# మెనీ మాన్షన్స్

# "అనంత జీవన యాత్రలోని మజిలీలు"

**"ఎడ్గర్‌కేసీ"** అనే మిష్టిక్ సమ్మోహన స్థితిలో ఇచ్చిన వివరణల ద్వారా పునర్జన్మ, మరియు కర్మ సిద్ధాంతములను ధృవీకరిస్తూ **డాక్టర్ . జినాసెర్మినారా** వ్రాసిన పుస్తకానికి **హైదరాబాద్ వాస్తవ్యులు "శ్రీ మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు"** వ్రాసిన స్వేచ్ఛానువాదం.

**తయారు చేసినది :** వై.హెచ్.ఎస్.ప్రసాద్, హైదరాబాద్.

**"ఎడ్గర్‌కేసీ"** అనే మిస్టిక్ సమ్మోహన స్థితిలో ఇచ్చిన వివరణల ద్వారా పునర్జన్మ, మరియు కర్మ సిద్ధాంతములను ధృవీకరిస్తూ **డాక్టర్ . జినాసెర్మినారా** వ్రాసిన పుస్తకానికి **హైదరాబాద్ వాస్తవ్యులు "శ్రీ మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు"** వ్రాసిన స్వేచ్ఛానువాదం.

**తయారు చేసినది :** వై.హెచ్.ఎస్.ప్రసాద్, హైదరాబాద్.

# మెనీ మాన్షన్స్ - అనంత జీవన యాత్రలోని మజిలీలు

**"ఎడ్గర్‌కేసీ"** అనే మిస్టిక్ సమ్మోహన స్థితిలో ఇచ్చిన వివరణల ద్వారా పునర్జన్మ, మరియు కర్మ సిద్ధాంతములను ధృవీకరిస్తూ **డాక్టర్ . జినాసెర్మినారా** వ్రాసిన **"మెనీమాన్షన్స్"** అనే పుస్తకానికి **హైదరాబాద్ వాస్తవ్యులు "శ్రీ మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు"** వ్రాసిన స్వేచ్ఛానువాదం.

## అధ్యాయము 1

## స్లీపింగ్ ప్రాఫెట్ ఎడ్గర్‌కేసి - ఒక పరిచయం

ఎడ్గర్‌కేసీ అమెరికాలోని కెంటకీ దగ్గరున్న హాప్‌కిన్స్ విల్లే అనే చోట 1877లో విద్యాహీనుడైన రైతు కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పుడే ప్రీస్ట్ అవాలనుకున్న ఎడ్గర్‌కి అది సాధ్యపడలేదు. పొలం పని మీద ఉత్సాహం లేక దగ్గరే ఉన్న నగరానికి వెళ్లి కొంత కాలం ఓ పుస్తకాల షాపులో క్లర్క్‌గా, తర్వాత ఇన్సూరెన్స్ పాలసీలు అమ్మే సేల్స్ మెన్‌గా పనిచేసాడు.

అతని 21వ ఏట అతని గమ్యాన్ని మార్చే విచిత్రం జరిగింది. లేరింగైటిస్ అనే వ్యాధితో అతని కంఠపేటిక దెబ్బతిని మాట పడి పోయింది. ఏ డాక్టరూ చికిత్స చేయలేకపోయాడు. వారి మందులన్నీ నిష్ప్రయోజనం అయ్యాయి. దాంతో సేల్స్‌మెన్ ఉద్యోగం నిర్వహించలేక తల్లి తండ్రుల దగ్గరే ఉండిపోవాల్సి వచ్చింది. కొంతకాలానికి, మాట్లాడాల్సిన అవసరం లేని ఫొటోగ్రఫీని వృత్తిగా స్వీకరించదలచి అప్రెంటిస్‌గా చేరాడు.

ఊళ్లు తిరుగుతూ వినోదం ఇచ్చే హిప్నాటిస్ట్ అయిన హార్ట్ అనే వ్యక్తి, ఎడ్గర్‌కేసీ ఉన్న హాప్‌కిన్స్ విల్లేలోని ఒపేరాహౌస్‌లో కార్యక్రమం ఇస్తుండగా, కేసీకున్న వ్యాధి గురించి తెలుసుకున్న ఆయన, హిప్నోసిస్ ద్వారా అతనికి చికిత్స చేసి, మాట తెప్పించే ప్రయత్నం చేయాలనుకున్నాడు. కేసీ ఇందుకు ఆనందంగా అంగీకరించాడు.

అయితే అది పాక్షికంగానే విజయవంతం అయ్యింది. హిప్నాటిక్ ట్రాన్స్‌లో ఉండగా హార్ట్ సూచనల ప్రకారం ఎడ్గర్‌కేసీ మామూలుగా మాట్లాడగలిగే వాడు. అందులోంచి బయటపడగానే యధాస్థితి కొనసాగేది. హిప్నోసిస్ ట్రాన్స్‌లోంచి బయటకి వచ్చాక కూడా మాట్లాడమని హార్ట్ చేసిన సూచన (పోస్ట్ హిప్నోటిక్ సజెషన్) కేసీ విషయంలో ఎందువల్లో ఫలించలేదు.

అయితే ఇతర ఊళ్లలో కార్యక్రమాలు ఉండడంతో హార్ట్ హాప్‌కిన్స్‌విల్లేని వదిలి వెళ్లాల్సి వచ్చింది. అదే ఊళ్లోని లేనీ అనే ఓ ఔత్సాహిక హిప్నాటిస్ట్ కేసీ చికిత్సా విధానం అసక్తిగా ఫాలో అవుతూ ఉండడంతో, అతను కేసీతో చెప్పాడు, తను పరిశోధన చేయదలచుకున్నానని, తనని కూడా అతనికి హిప్నోథెరపీ చేయనివ్వమని. ఎలాగైనా తన కంఠధ్వని తిరిగి తెచ్చుకోవాలన్న ఆతృతతో ఉన్న కేసీ అందుకు అంగీకరించాడు.

కేసీని హిప్నాటైజ్ చేసిన లేనీ, అతన్నే చికిత్సా విధానాన్ని సూచించమని కేసీని కోరాడు. చిత్రంగా ఆ సజెషన్‌కి సమాధానంగా హిప్నాటిక్ నిద్రలోని కేసీ మామూలు కంఠంతో తన ఓకల్ కార్డ్స్ పరిస్థితిని వివరించాడు.

"స్వరపేటికలోని కండరాలకి పాక్షికంగా పక్షవాతం వచ్చింది. ఇది భౌతికంగా వ్యక్తమయ్యే మానసిక పరిస్థితి. హిప్నాటిక్ ట్రాన్స్‌లో ఉండగానే, ఆ నరాల్లోకి రక్త ప్రసరణ అధికం అయ్యేలా సూచన చేయడం ద్వారా ఈ పరిస్థితిని అధిగమించవచ్చు"

లేనీ వెంటనే కేసీకి కంఠనాళాల్లోకి రక్తప్రసరణ అధికం చేయమని, అందువల్ల అతనిలోని వ్యాధి తగ్గిపోతుందని సూచించాడు.

నెమ్మదిగా కేసీ ఛాతి పై భాగం, తర్వాత గొంతు, గులాబి రంగులోకి, కొంత సేపటి తర్వాత ఊదారంగులోకీ మారాయి. దాదాపు ఇరవై నిమిషాల తర్వాత హిప్నోటిక్ నిద్రలో ఉన్న కేసీ గొంతు సవరించుకుని చెప్పాడు.

"ఇప్పుడు రోగి పరిస్థితి బాగైంది. మళ్లీ రక్తప్రసరణ మామూలుగా అయ్యే సూచన, హిప్నాటిక్ ట్రాన్స్‌లోంచి బయటికి వచ్చే సూచన ఇవ్వు".

లేనీ ఆ సూచనలివ్వగానే కేసీ హిప్నాటిక్ నిద్రలోంచి లేచాడు. చిత్రాతిచిత్రంగా అతని మాట అతనికి తిరిగి వచ్చింది. ఎప్పుడైనా తిరిగి ఆ రోగం వస్తే, ఈ హిప్నోథెరపీ ద్వారా తిరిగి మాయమవసాగింది.

భగవదేచ్ఛ మరోలా ఉండడంతో ఆ చికిత్సా సిధానం నిజానికి అక్కడతో పూర్తి అవలేదు. హిప్నాసిస్‌ని చికిత్సకి వాడుకునే విషయంలో పట్టుదలగా ఉన్న లేనీ, హిప్నాసిస్ స్థితిలో కేసి తన రోగ కారణాన్ని కనుక్కోగా లేంది, ఇతరుల రోగ కారణాలని ఎందుకు కనుక్కోకూడదు అనుకున్నాడు.

లేనీ ఈ పరిశోధన తన మీదనే చేసుకోదలచుకున్నాడు. చాలా కాలంగా అతనికి కడుపు నొప్పి ఉంది.

కేసీ హిప్నోసిస్ స్థితిలో ఉండగా, లేనీ కడుపులోని పరిస్థితిని వర్ణించి, చికిత్సా విధానాన్ని సూచించాడు. ఆ వివరణ లేనీ స్థితికి సరిగ్గా సరిపోవడంతో లేనీకి ఆనందం వేసింది.

ఆ చికిత్సా విధానంతో ఏళ్ల తరబడి తగ్గని ఆ రోగం కొన్ని వారాల్లో పూర్తిగా మాయమైంది. ఓ కొత్త చికిత్సా విధానం దొరికిందని లేనీ ఎంతో సంబరపడ్డా, కేసీకి దాని మీద ఎలాంటి ఆసక్తి కలగలేదు. అయితే అనారోగ్యంతో పీడింపబడే వారికి సహాయం చేయాలన్న కోరిక మాత్రం కేసీలో ఉండేది.

ఏటా ఓసారి బైబిల్‌ని ఆ అట్ట నుంచి, ఈ అట్ట చివరిదాకా, పదో ఏట నుంచి చదవే అలవాటున్న కేసీ, క్రీస్తు రోగగ్రస్థుల రోగాలని తీసేయడం చదివి, తనూ అలాంటి శక్తి కలిగి ఉండాలని కోరుకునే వాడు.

కేసీ, లేనీ కలిసి రోగగ్రస్థులకి సహాయం చేయనారంభించారు. హిప్నాసిస్‌లోకి వెళ్లి కేసీ రోగగ్రస్థుడి కండీషన్‌ని, కారణాన్ని, చికిత్సా విధానాన్ని వివరిస్తుంటే, దాన్ని లేనీ షార్ట్‌హ్యాండ్‌లో టక టక రాసుకునే వాడు. దాన్ని లాంగ్‌హేండ్‌లో రాసి రోగికో కాపీ ఇచ్చి తమ ఫైల్‌లో ఓ కాపీ ఉంచుకునే వారు. చాలా మందికి ఈ క్రమంలో రోగనివారణ అవడంతో కేసీ గురించి ముందు లోకల్ పేపర్లలో, తర్వాత జాతీయ పేపర్లలో రాయసాగారు. రోగిని కేసీ చూడనక్కరలేదు. అతని పేరు, అడ్రస్ హిప్నాసిస్‌లో ఉండగా చెప్తే చాలు. రోగి వివరాలు, చికిత్సా విధానం చెప్పేవాడు. వాటిని రోగికి పోస్ట్ చేసి ఓ కాపీ ఫైల్స్‌లో ఉంచేవారు.

**2,500 పై చిలుకు గల ఈ కాపీలలో కొన్నింటిని తీసుకుని 'జినా సర్మినారా' అనే ఆమె 1950లో "మెనీ మాన్షన్స్" అనే పుస్తకం రాసింది.**

వాటి వివరాలు, అవి మనకి ఎలా ఆధ్యాత్మిక పురోగతికి ఉపయోగిస్తాయి అన్నది తరువాతి అధ్యాయంలో తెలుసుకుందాము.

ఎడ్గర్ కేసీకి సమ్మోహన (హిప్నాటిక్) స్థితిలో ఓ మనిషి పేరు, పుట్టిన ప్రదేశం, పుట్టిన తేది మాత్రం ఇస్తే చాలు. ఈ జీవితంలో వాళ్లకి సంబంధించిన విషయాలు, అందుకు వారి పూర్వజన్మల్లో ఎప్పుడు ఏ కర్మల ద్వారా పునాదులు పడ్డాయో అన్నవి చెప్పడం ప్రారంభిచేలా, వారి జీవితాల్లోని సంఘటనలే కాక,

వారిలోని గుణాలని కూడా - కోపం అధికం లేదా శాంతస్వభావం లాంటివి వివరించసాగాడు.

ఇవి ముందు తన కుటుంబ సభ్యులు, తన మిత్రుల గురించి చెప్పినప్పుడు నిజమయితే, వాళ్ల గురించి తనకు తెలిసింది తన సబ్‌కాన్షస్ మైండ్‌లోంచి వస్తోందనుకున్నాడు. కానీ తనెన్నడూ చూడని, అమెరికాలోని దూర ప్రాంతంలో ఉన్న వారి విషయంలో కూడా తాను హిప్నాటిక్ ట్రాన్స్‌లో చెప్పేది నిజం అవుతుండడంతో ఎడ్గర్‌కేసీ ఓ కన్‌ఫ్యూజన్‌లో పడ్డాడు.

కేథలిక్ క్రిస్టియానిటీ మతానికి చెందిన కేసీకి బైబిల్ అతి ఇష్టమైన గ్రంథం. ప్రతీ ఏడాది ఒక సారి దాన్ని తప్పని సరిగా చదవడం తన పదవ ఏట నుంచి అలవాటు. బైబిల్‌లో ఎక్కడా పునర్జన్మ ప్రసక్తి లేదు. హిందూయిజం, బుద్ధిజంలో పునర్జన్మ గురించి చెప్పారు కానీ, క్రీస్తు ఎక్కడా అది చెప్పకపోవడంతో, కేసీ తను చెప్పేది నిజం కాదేమోనని కన్‌ఫ్యూజన్‌లో పడ్డాడు. కానీ అతని ప్రిడిక్షన్స్ అన్నీ నిజమవుతూండడంతో పునర్జన్మ సిద్ధాంతాన్ని అతను నమ్మక తప్పలేదు.

తర్వాత తను చెప్పేవారి పునర్జన్మలు ఎక్కువగా అట్లాంటిస్, ఈజిప్ట్, రోమ్, క్రిస్టియన్ మత యుద్ధాలకి చెందిన క్రూసేడ్స్ కాలాలకి, ఇంకా అమెరికన్ సివిల్ వార్ కాలానికి, ఫ్రెంచ్ చక్రవర్తి లూయీ పన్నెండు, పదిహేను, పదహారుల కాలాలికి చెందడం గమనించాడు. (అరుదుగా చైనా, ఇండియా, కంబోడియా, పర్షియా, ఆఫ్రికా, పెరు, సిసిలీ, స్పెయిన్, జపాన్ లాంటి ఇతర ప్రదేశాలకి కూడా చెందినవి ఉన్నాయి)

**ఇందుకు అతనికి తట్టిన వివరణ "ఆ కాలంలో జీవించిన మనుషుల ఆత్మలు మళ్లీ ఇప్పుడు గ్రూప్‌లుగా తిరిగి పునర్జన్మలని తీసుకుంటున్నాయి. తాము ఆ కాలంలో జీవించి ఉన్నప్పుడు ఎవరితో సంబంధ బాంధవ్యాలుంటే, మళ్లీ పుట్టాక వాళ్లతో సంబంధబాంధవ్యాలని కొనసాగిస్తున్నాయి. అతనికి ఇంకోటి కూడా స్ఫురించింది. ఫేక్టరీలలో వర్కర్లు ఎలా షిఫ్టుల ప్రకారం డ్యూటీకి హాజరు అవుతారో అలా ఒక కాలానికి చెందిన ఆత్మలు అన్నీ కలిసి కొంత విరామ కాలం తర్వాత పుడతాయి. ఈలోగా భూమి మీద మరో కాలానికి చెందిన ఆత్మలు పుడతాయి. ఇలా వంతుల వారీగా జీవులు ప్రకృతి విధించిన ఓ పద్ధతి ప్రకారం జీవం తీసుకుంటూ ఉంటాయి."**

కేసీకి అసలు ఈ సమాచారం సబ్‌కాన్షస్ స్టేట్‌లో ఉండగా ఎక్కడి నుంచి లభిస్తోంది? దాని మూలం ఏమిటి? అన్న ప్రశ్న ఉదయించింది. **"కేసీ ఏ మనిషి గురించి చెప్తున్నాడో ఆ మనిషి సబ్‌కాన్షస్ మైండ్‌లో అతనికి చెందిన పూర్వజన్మల జ్ఞాపకాలు సమస్తం నిక్షిప్తం అయి వుంటాయని, కేసీ సబ్‌కాన్షస్ మైండ్‌కి, అతని సబ్‌కాన్షస్ మైండ్‌కి ఆ సమ్మోహన స్థితిలో కనెక్షన్ ఏర్పడడం ద్వారా ఆ సమాచారం లభిస్తుంది"** అన్న వివరణ ఒకటి సమ్మోహన స్థితిలో చెప్పాడు. అలాగే సమ్మోహన స్థితిలో మరో వివరణ కూడా అతను చెప్పాడు. **"ఆకాషిక్ రికార్డ్స్"** నుంచి ఆ సమాచారం అందుతోందన్న వివవరణ అతనికెంతో అద్భుతంగా అన్పించింది. ఎందుకంటే సంస్కృత పదమైన **"ఆకాశ్"** అతనంతక ముందు ఎన్నడూ విని ఉండలేదు. ఆకాశ్ అంటే ఏమిటని అతన్నా స్థితిలో అడిగితే కేసీ చెప్పిన సమాధానం ఇది.

**"విశ్వంలోని మూల ఈథరిక్ పదార్థం ఏదైతే ఉందో, అది ఎలక్ట్రో స్పిరిచ్యువల్ కంపోజిషన్ అని, ఆ ఆకాశ్ మీద ప్రతీ కాంతి, శబ్దం, కదలిక లేదా ఆలోచనా తరంగాలు విశ్వారంభం నుంచి నమోదు అవుతూ వస్తున్నాయని, వీటి ద్వారానే " క్లేర్‌వాయింట్లు" (మామూలు కంటికి కనబడని సూక్ష్మలోకాలని దర్శించగలిగే సూక్ష్మదృష్టిని, దివ్యదృష్టిని కలిగిన వారిని క్లేరవాయింట్స్ అంటారు) జరిగినవి తిరిగి చూడగలుగుతున్నారు అని, ఎవరి కాన్షస్‌నెస్ దానికి ట్యూన్ అయితే వారు దాన్ని వినవచ్చని, చూడవచ్చని వివరించాడు."**

ఈ విషయాన్ని ఎన్ని సార్లు ఎన్ని కోణాల నుంచి, ఎప్పుడు ప్రశ్నించినా ఇదే సమాధానం ఆయన

నోట్లోంచి రావడంతో దీన్ని వాళ్లు నమ్మక తప్పలేదు. దీన్ని వారు అధికంగా నమ్మడానికి కారణం వ్యక్తిగత రీడింగ్స్‌లో వారి గత చరిత్రకి సంబంధించిన వివరాలు కాక, ఆ వ్యక్తి సబ్‌కాన్షస్ మైండ్‌లో నమోదవ్వాల్సిన అవసరం లేని సంగతులు కూడా కేసీ చెప్పగలగుతూండడం.

క్రైస్ట్ బతికున్న రోజులలోని ఈజిప్ట్, రోమ్ చరిత్రలు (జరిగిన విషయాలు) కేసీ చెప్పగలిగాడు. కొత్త మనుషులకి చెందిన విషయాలు (రీడింగ్స్) కరెక్ట్ అయినప్పుడు ఈ వివరణ కరెక్టే అవ్వాలిగా అని కేసీ ఈ అద్భుత వియషాన్ని నమ్మక తప్పలేదు. 1923 నుంచి 1945 దాకా కేసీ ఇచ్చిన మొత్తం 2,500 మంది లైఫ్ రీడింగ్స్ అలా అకాశిక్ రికార్డులలోంచే వచ్చాయి అనుకోవచ్చు.

ఈ లైఫ్ రీడింగ్స్ వల్ల కేసీకి అర్థమైందేమిటంటే, "విశ్వంలో సృష్టిలోని ఓ కాలంలోని కొన్ని జీవులు, ఇతర జీవులతో ఏర్పరచుకున్న సంబంధబాంధవ్యాల తాలూకు లింక్స్ తిరిగి కొంతకాలానికి పునరావృత్తమవుతాయి." దీన్ని హిందూయిజంలో "కర్మ లేక కార్మిక్ లింక్" అంటారన్న సంగతి అతనికి తర్వాత తెలిసింది.

ప్రతీ ఆత్మ ఓ నటుడిలాంటిది. నటుడు ఓ నాటకం ఆడడానికి ఎలా వేషం వేసుకుని ఆ నాటకం అయ్యాక దాన్ని తీసేస్తాడో, అలా ప్రతీ ఆత్మ చాలా కాలంగా భౌతిక శరీరాన్ని నాటకంలోని దుస్తుల్లా ధరించి నాటకం సమాప్తం అవగానే దాన్ని వదిలేస్తోందని, ఈ కార్యక్రమంలో ఆ ఆత్మ ప్రతీసారి కొత్త అంశాలు నేర్చుకుని, తనలోని చెడ్డతనాన్ని వదిలి కొద్దికొద్దిగా పవిత్రంగా మారుతూ ఉంటుందని, ఇందుకు ఓ నాటకంలో (జీవితంలో) చేసిన తప్పులని మరో నాటకంలో (జీవితంలో) సరిదిద్దుకునే పాత్రనే ధరిస్తుందని కొన్ని వేల మందికి లైఫ్ రీడింగ్స్ చెప్పాక అతనికి బోధ పడింది. హిందూయిజంలోని కర్మసిద్ధాంతం - ప్రతీ చర్యకి, ప్రతిచర్య ఉంటుందన్నది- ఎడ్గర్ కేసీ తను సమ్మోహక స్థితిలో చెప్పిన వారి రీడింగ్‌లన్నీ ఋజువు చేస్తున్నాయి.

వచ్చే నెల అలాంటివి కొన్ని పరిశీలించబోయే ముందు, అసలు ఎడ్గర్ కేసీకి ఈ అద్భుత శక్తి ఎలా, ఎందుకు వచ్చింది అన్న అనుమానం మనకి కలగవచ్చు. అది అతనికెలా వచ్చింది. ఓసారి సమ్మోహన స్థితిలో తననే ఆ ప్రశ్న అడగమన్నాడతను. ఆ ప్రశ్నకి అతనిచ్చిన జవాబిలా రికార్డ్ చేసింది స్టెనోగ్రాఫర్.

"కొన్ని శతాబ్దాల క్రితం కేసీ ఈజిప్ట్‌లో పెద్ద మతాధికారి. అప్పుడతనికి ఎన్నో అతీంద్రియ శక్తులున్నాయి. కానీ ప్రాపంచిక కోరికలతో ఆ జీవితాన్ని వ్యర్థం చేసుకున్నాడు. తర్వాత పర్షియాలో డాక్టర్‌గా పుట్టాడు. మరో జన్మలో ఎడారిలో జరిగిన యుద్ధంలో గాయపడిన కేసీ ఆహారం, నీరు, నీడ లేక ఒంటరిగా మూడు రోజుల పాటు ఎంతో నరకం అనుభవించి, ఎంతో ప్రయత్నంతో తన ఆత్మని తన శరీరం నుంచి విజయవంతంగా విడుదల చేయగలిగాడు. ఆ కారణంగా అతనికి ఈ జన్మలో ఈ అద్భుత శక్తి లభించి, తన శరీరంనుంచి తన 'సబ్‌కాన్షియస్'ని విడుదల చేయగలుగుతున్నాడు.

ఇలా ఈ జన్మలోని ప్రతీవారి జీవితాలలో జరిగే ప్లస్, మైనస్ పాయింట్లన్నీ వివిధ పూర్వ జన్మల్లో ఆర్జించుకున్నవే. పూర్వ జన్మలో ప్రాపంచిక సుఖాల పట్లగల ఏ కామం వల్లయితే అతను చ్యుతుడయ్యాడో, దాన్నించి బయట పడడానికి, మానవాళికి సేవ చేయడానికి ఎడ్గర్ కేసీకి ఈ జన్మ లభించింది.

ఎడ్గర్ కేసీ రీడింగ్‌ల్లోని వివరాలన్నీ మన కర్మ సిద్ధాంతానికి దగ్గరగా ఉంటాయి. ఓ మనిషి బీదవాడుగానో లేదా ధనవంతుడుగానో, ఆరోగ్య వంతుడుగానో లేక కురూపి గానో, కష్టాల్లోనో లేదా సుఖాలలోనో పుట్టడానికి కారణం కాకతాళీయం కాదు. వంశపారంపర్యంగా వచ్చే అనారోగ్యం లేదా ఆరోగ్యాలు కావు. అలాగే ప్రపంచంలో ఓ మనిషికి జరిగే ప్రతీ సంఘటనా, ఇక్కడి భౌతిక పదార్థాలు, పరిస్థితుల వల్ల

కాదు. మనిషికి కష్టసుఖాలు మొదలైనవి గుడ్డిగా పరిస్థితులను అనుసరించి సంభవించడం లేదు. పూర్వజన్మల్లోని మెరిట్స్, డిమెరిట్స్‌ని బట్టే అవి వారికి సంభవిస్తున్నాయి. ఈ కష్టాలు, దుఃఖాలు మనిషికి ఈ జన్మలో బోధ చేయడానికే జరుగుతున్నాయి. నీతిగా లేదా అవినీతిగా, నిజాయితీగా లేదా అన్యాయంగా ఉండడం లేదా ఉండక పోవడం అనే మన చర్యలన్నీ మనని కరెక్ట్ చేసే పాఠాలు. అవి నేర్చుకుని జ్ఞానం పొంది పర్‌ఫెక్ట్‌గా అవడానికే ఈ జన్మలు లభిస్తున్నాయని ఎడ్గర్ కేసీ చివర్లో నమ్మాడు. దైవం విషయంలో పాశ్చాత్యుల కన్నా, తూర్పు దేశవాసులు చెప్పేవి కరెక్ట్ అని కూడా అతను ఒప్పుకున్నాడు.

పాశ్చాత్య ప్రపంచంలో ఇలా తొలిసారిగా హిందూ కర్మ థియరీని వివరించి, సమర్థించే శాస్త్రీయ ఋజువులు గలవి ఎడ్గర్ కేసీ లైఫ్ రీడింగ్స్‌లో లభ్యం అవుతాయి. వీటినిప్పుడు అక్కడ రీసెర్చర్స్ అన్నీ కోణాల్లోంచి పరిశీలించి ఎనలైజ్ చేస్తున్నారు.

ఎడ్గర్‌కేసీ అనేకమందికి ఇచ్చిన ఆ లైఫ్ రీడింగ్స్ కొన్నింటిని తెలుసుకుందాం

ఎడ్గర్ కేసీ తన జీవిత కాలంలో ఇచ్చిన వేల రీడింగ్స్‌ని పరిశీలించిన మేధావులకి రెండు విషయాలు క్షుణ్ణంగా బోధపడ్డాయి. ఒకటి సైన్స్‌కి, మతానికి మధ్య పెద్ద తేడా లేదని, ఫిజిక్స్‌లో న్యూటన్ లా లోని మూడో సిద్ధాంతమైన "ఏక్షన్ టు రియాక్షన్" థియరీ మనిషి చర్యలన్నింటిలో చక్కగా పని చేస్తుందన్నది స్పష్టమైంది. మనిషి పుట్టాక, అతని జీవితంలో జరిగే ప్రతీ సంఘటన పూర్వజన్మలో అతను చేసిన పనులకి ఏక్షన్-టు-రియాక్షన్ ఫలితాలే అన్నది మూఢ నమ్మకం కాదన్నది విశదమైనది.

రెండోది మనిషి జీవితం అతి పెద్దదైన ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయంలో ఓ రోజు మాత్రమే. మనిషి అనుభవించే బాధలు, కష్టాలు, కన్నీళ్లు అన్నీ అతన్ని ఆధ్యాత్మికంగా విద్యావంతుడిగా తీర్చిదిద్దడానికే జరుగుతూంటాయి తప్ప గుడ్డిగా జరగవు.

"పూర్వజన్మ కృతం పాపం వ్యాధిరూపేణ పీడితం" అనే సూక్తిని మన ఋషులు చెప్పారు. ఈ సత్యం ఎడ్గర్‌కేసీ రీడింగ్స్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. పూర్వజన్మల్లోని కొందరి దుశ్చర్యలు ఈ జన్మలో భౌతిక శరీరానికి వ్యాధి రూపంగా వ్యక్తం అవడం గురించి కేసీ అనేక మందికి చెప్పాడు. ఇవి అనేక రూపాలలో వ్యక్తం అయ్యాయి.

కుంటితనం, అవిటితనం, అంధత్వం, బధిరత్వం మొదలైన వాటితో పుట్టిన వారిలో దేవుడు ఎందుకిలాంటి జన్మని తనకివ్వాలి అని బాధపడే వారుంటారు. ఇది భౌతికంగా కనిపించే పూర్వజన్మ కర్మఫలితం అని ఎడ్గర్‌కేసీ చెప్పాడు. 'పాపం, కష్టం' వేరు కావని, అవి ఒక దాని మీద ఇంకొకటి ఆధారపడి ఉన్నాయని కేసీ రీడింగ్స్ వల్ల స్పష్టం అయ్యింది. కర్మ అంటేనే చర్య, ఓ కారణం తాలూకు ఫలితం (కాజ్ అండ్ ఎఫెక్ట్) లేదా చర్యకి ప్రతిచర్య (ఏక్షన్‌కి రియాక్షన్), వల్లనే మనిషికి కష్టాలు. దీన్నే కర్మ అని హిందూయిజంలో పేర్కొన్నారని కేసీ రీడింగ్స్ చదివిన వారు నిర్వచించారు.

హిందూ మతాన్ని స్టడీ చేసిన ఎమర్సన్ దీన్ని "నష్ట పరిహార నియమం" (లా ఆఫ్ కాంపన్సేషన్) అన్నాడు. క్రీస్తు దీన్నే 'మనిషి తను నాటిన విత్తన ఫలాన్నే కోసుకుంటాడు' అని చెప్పాడు.

**"WHAT SOEVER A MAN SOWETH, THAT SHALL HE ALSO REAP"**

కేసీ రీడింగ్స్ అన్నింటిలో "మనిషి ఈ రోజు పడే కష్టం ఒకప్పుడు చేసిన చర్యకి ఫలితంగా అనుభవిస్తున్నాడు అనీ, అలా అనుభవించడం ద్వారా తను ఒకనాడు చేసిన చర్య నుంచి విముక్తిని పొంది, ఆ మేరకు నైతికంగా ఎదుగుతున్నాడని విశదీకరించాడు.

**దీన్ని మనం అర్థం చేసుకోగలిగితే, మన మనసుల్లో ఈ సారాంశాన్ని ఇంకించుకోగలిగితే, దీన్ని సర్వవేళలా జ్ఞప్తిలో ఉంచుకోగలిగితే, మనం ఈ రోజు చేసే దుశ్చర్య ఒక రోజు ఫలించి, అది మనకి తప్పక కష్టాన్నిస్తుంది అనే స్పృహతో జీవించగలిగితే, అప్పుడు మనం చేసే ప్రతీ చర్యా, మాట్లాడే ప్రతీ మాట మనసులో చేసే ప్రతీ ఆలోచన విషయంలో ఎంతో నిబద్ధతతో ఉండడానికి ప్రయత్నిస్తాం.**

నెలకింతే ఆదాయం అంటే, దాన్ని ఆ నెలకి ఎలా ఖర్చు చేయాలి అన్న విషయం మీద ఎంత జాగ్రత్తగా ఆలోచిస్తామో, అలాగే ఈనాటి మన అన్ని చర్యలకి మనం ఓనాడు బాధ్యతని వహించి తీరాలి అన్న సత్యాన్ని మనం నమ్మగలిగితే, అలా ఆలోచించగలిగితే మన జీవన విధానమే మారిపోతుంది. నేడు మనం జీవిస్తున్నంత అనైతికంగా అప్పుడే జీవించలేము. తోటి జీవికి అన్యాయం తలపెట్టలేము. సాటి మనిషిని మన ఆనందం కోసం, మన అహాన్ని తృప్తి పరచుకోవడం కోసం హింసించలేం.

కేసీ ఈ కర్మలన్నింటిని పాశ్చాత్య సంప్రదాయ ప్రకారం విభజన చేసి వాటికి అనేక పేర్లు పెట్టాడు. అలాంటి వాటిలో ఒకటి **"బూమరాంగ్ కర్మ"**. ఆస్ట్రేలియాలో కలపతో చేసిన ఓ పరికరాన్ని బూమరాంగ్ అంటారు. దాన్ని విసిరితే కొంత దూరం వెళ్లి దాన్ని విసిరిన మనషి దగ్గరకే అది తిరిగి వస్తుంది. ఆ పరికరం పేరున బూమరాంగ్ అనే పదం ఇంగ్లీషులో చోటు చేసుకుంది.

**"బూమరాంగ్ అంటే ఇతరులకి తలపెట్టిన హాని మనకే తిరిగి రావడం అని అర్థం."**

ఈ రకం కర్మలు అనుభవించే ఎన్నో కేసులు కేసీ ఫైల్స్‌లో ఉన్నాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

పుట్టుగుడ్డిగా జన్మించిన ఓ కాలేజీ ప్రొఫెసర్ కేసి రీడింగ్స్ గురించి, "మిరకిల్స్ ఆఫ్ మైండ్" అనే రేడియో కార్యక్రమం ద్వారా తెలుసుకుని, తన అంధత్వానికి కారణం తెలియచేయమని కేసీకి లెటర్ రాసాడు. అతని రీడింగ్‌ని కేసీ ఈ విధంగా చెప్పాడు.

ఆ ప్రొఫెసర్ ఓ పూర్వ జన్మలో పర్షియాలో పుట్టినప్పుడు నేటి అంధత్వానికి సరిపడే **"ఆధ్యాత్మిక నియమం పని చేసే చర్యని"** చేసాడు. అతనప్పుడు ఓ ఆటవిక సంస్కృతిలో పుట్టాడు. తమకి పట్టుబడ్డ శత్రువుల కళ్లని ఎర్రగా కాల్చిన ఇనుపచువ్వలతో పొడిచి గుడ్డివాళ్లని చేయడం ఆ తెగ ఆచారంగా ఉండేది. ఈ ప్రొఫెసర్ ఆ జన్మలో ఆ సాంప్రదాయం ప్రకారం తన శత్రువులని ఆ విధంగా గుడ్డివారిగా చేయబట్టి, ఇప్పుడు దాని ఫలితం అనుభవిస్తున్నాడు.

ఇక్కడ మనకి ఓ సందేహం రావచ్చు. ఓ జాతి నీతిని అతను పాటించినంత మాత్రాన ఆ కర్మలో ఎలా చిక్కుకుంటాడు? తను పుట్టిన జాతి ఆచారాలకి ఇతనెందుకు బాధ్యుడు అవ్వాలి? ఆ ప్రశ్నకి ఎడ్గర్‌కేసీ ఇచ్చిన సమాధానం చూస్తే "ప్రతీవారి కర్మకి ఆ మనిషే వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని తెలుస్తుంది.

**చర్య లేదా కర్మ వెనక ఉండే భావమే (మోటివ్) ఆ కర్మ బంధిస్తుందో లేదో నిర్ణయించేది.**

ఆ కర్మ చేసే మనిషి ఆ జాతిలోని ఆచారాన్ని గర్హిస్తూ, తనకిష్టం లేకపోయినా తన శత్రువుల కళ్లని వేడి ఇనుపకడ్డీతో పొడిస్తే ఆ కర్మ అతన్ని అంటుకోదు. కానీ ఆ చర్యని, ఆ జాతి నీతిని అతను మానసికంగా సమర్థిస్తూ, దాన్ని ఎంజాయ్ చేస్తూ, ఏ మాత్రం గిల్టీగా ఫీలవ్వకుండా చేస్తే అప్పుడు అతను ఆ కర్మకి బంధితుడవుతాడు.

ఓ రాజు దోషికి మరణశిక్ష విధిస్తే, అతన్ని ఉరి తీసే రాజోద్యోగి తను కేవలం జీతం కోసం ఈ పనిని చేస్తున్నానని భావించి విముఖతతో ఉరితీస్తే అప్పుడు ఆ కర్మ అతన్ని అంటదు. అలా కాక, ఆ దోషి చేసిన

నేరం వల్ల అతని మీద అసహ్యం కలిగి, అతనికి సరైన శాస్తి చేస్తున్నానని భావిస్తూ ఉరి తీస్తే, ఆ భావం వల్ల ఆ చర్య తాలూకు చెడ్డతనం అతని భావనతో అతనిలో నాటుకుని, భవిష్యత్‌లో ఏదో ఓ జన్మలో అతను దీనికి తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది.

సరిగ్గా ఇదే విషయాన్ని భగవద్గీత అనేక చోట్ల ఎంతో సొంపుగా వివరిస్తుంది. (ఈ విషయం ఇదే సంధర్భంలో మెనీ మాన్షన్స్‌లో రచయిత్రి ఉదహరిస్తూ, ఇంగ్లీషులోని స్వామీ ప్రభవానంద, క్రిస్టర్ ఐషర్ ఉడ్ అనువాదాలు చదవమని కూడా పేర్కొంది) భగవద్గీతలో ఈ విషయాన్ని ఎన్నో శ్లోకాల్లో కర్మలని అహంభావరహితంగా, భగవత్ ప్రీత్యర్థం చేస్తూ వాటి ఫలితాలని తనకి అర్పించమని పరమాత్మ చెప్పాడు.

**"యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్, యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్"**

(అర్థం : ఓ కౌంతేయా, నీవు ఆచరించే ప్రతీ కర్మనీ, తినే ఆహారాన్ని, హోమము చేయు హవ్యమును, అర్పించు దానమును, ఆచరించే తపస్సును నాకే అర్పించుము). ఉదాహరణకి ఈ ఒక్క శ్లోకం ఇవ్వడం జరిగింది.

**వ్యక్తిగత భావన లేని అనాసక్త కర్మల వలన భవిష్యత్‌లో వాటి ఫలితం ఉండదు. మన కుటుంబ వ్యవహారాల్లో కూడా సాటి వ్యక్తుల మీద గల ప్రేమ, బాధ్యతాయుతంగా ఉంచుకుంటే తప్ప, ఎక్కువ ఇన్‌వాల్వ్ అయితే అది భవిష్యత్తులో తిరిగి అంటుకుంటుంది.** ఇందుకేనేమో భార్యాభర్తల బంధం ఏడు జన్మలది అంటారు.

బూమరాంగ్ కర్మలో మరో ఉదాహరణగా మేనిక్యురిస్ట్‌గా పని చేసే ఒకామె కథనం. ఒకటో ఏటే ఆమెకి రెండు కాళ్లకి పక్షవాతం వచ్చి పాదాలు పెరగలేదు. ఆమె పూర్వజన్మల్లో ఒకదాంట్లో అట్లాంటిస్‌లో పుట్టినప్పుడు మందులు లేదా టెలిపతీ లేదా హిప్నోసిస్ లాంటి ఏదో విద్యతో (ఇదేమిటో స్పష్టంగా చెప్పలేదు) ఆమె మనుషుల అవయవాలని బలహీనపరిచేది. ఆ కారణంగా ఆమెకి ఈ జన్మలో పక్షవాతం వచ్చింది. ఆ చెడ్డతనం ఆమె జీవాత్మ నుంచి తొలగేదాకా ఆమె మళ్లీ మళ్లీ ఈ ఒక్క విషయం మీద ఇంకా ఎన్ని జన్మలైనా తీసుకోవచ్చు. అంటే తను ఓ జన్మలో చేసింది తప్పు అని ఆ మనిషి జీవాత్మకి పూర్తిగా అవగాహన వచ్చే దాకా కొన్ని జన్మల పాటు ఆ తప్పు తాలూకు కర్మని అనుభవించాల్సిందే. (ఓ సంధర్భంలో చిన్నజియర్‌స్వామీ "ఓ క్షణంలో చేసే కర్మని అనుభవించడానికి ఎన్నో జన్మలు పట్టవచ్చు" అన్నారు.) బహూశా ఇందుకేనేమో పశ్చాత్తాపం కలిగితే పాపం నశిస్తుంది అన్నారు.

మూడో ఉదాహరణ, ఓ నలభై ఏళ్ల యువతి, అమె చిన్నతనం నుంచి కొన్ని రకాల ఆహార పదార్థాలు-ప్రధానంగా బ్రెడ్, అన్ని రకాల పప్పుధాన్యాలు తింటే హైఫీవర్ వచ్చిన రోగికి మల్లే తుమ్ములు వచ్చేవి. డాక్టర్లు దాన్ని అలర్జీగా డయాగ్నైజ్ చేసారు. అలాగే అమె కొన్ని రకాల వస్తువులని తాకితే, ముఖ్యంగా పాదరక్షల చర్మం, ప్లాస్టిక్ కళ్లజోడు- అమె తన ఎడమ భాగంలో విపరీతమైన బాధని అనుభవించేది. ఆమెకి ఏ డాక్టరూ సహాయం చేయలేకపోయాడు. అయితే తన 25వ ఏట ఆమె హిప్నాసిస్ ద్వారా ఆరేళ్ల పాటు ఈ బాధని దూరం చేసుకోగలిగింది కానీ అది తిరిగి మళ్లీ ఇప్పుడు వచ్చింది.

ఎడ్గర్ కేసీ రీడింగ్ ఇందుకు ఇచ్చిన సమాధానం-ఓ జన్మలో ఈమె కెమిస్ట్‌గా ఉంటూ, ఏ పదార్థాల ద్వారా అయితే ఇతరులలో దురద పుట్టించే విధంగా ప్రయోగం చేసిందో, ఈ జన్మలో ఆ పదార్థాల వల్ల ఈమెకి ఈ విధంగా జరుగుతోంది. అలాగే ఆమె కొన్ని పదార్థాలతో వారి ఊపిరే వారికి విషం అయ్యేలా కొందరికి చేసింది. దాంతో ఇప్పుడు ఆ పదార్థాలు ఆమెకి శత్రువులు అవుతున్నాయి. పాదరక్షల చర్మాన్ని ఆమె ఓక్ వృక్షం బెరడుతో కప్పితే ఏం కాదు అని పరిష్కారం సూచించాడు కేసీ.

మరోరకం కర్మకి '**ఆర్గానిక్ కర్మ**' అని పేరు పెట్టారు ఎడ్గర్ కేసీ పరిశోధకులు. మనిషి శరీరంలోని అవయవాలకి వ్యాధిరూపంలో ఆ కర్మ సోకడంతో ఈ పేరు పెట్టారు.

ఓ జన్మలో శరీరంలోని ఓ అవయవాన్ని ఎక్కువగా దుర్వినియోగం చేస్తే, తర్వాత జన్మలో ఆ అవయవం ద్వారానే ఆ జీవాత్మకి శిక్షని అనుభవించాల్సి ఉంటుంది. ఇందుకు ఉదాహరణ ఓ 35 ఏళ్ల వ్యక్తి రీడింగ్.-ఇతనికి చిన్నప్పటినుంచి జీర్ణశక్తి అతితక్కువ. అన్ని రకాల ఆహారపదార్థాలు ఇతను జీర్ణం చేసుకోలేడు. కొన్ని రకాల పదార్థాలని మాత్రమే కలిపితింటే జీర్ణం అవుతాయి. ఆ జీర్ణ ప్రక్రియ కూడా మామూలు మనిషి కన్నా ఎక్కువ సమయం తీసుకుంటుంది. దీని వల్ల సామాజిక జీవితంలో ఇతను ఎంతో ఇబ్బందికి గురవ్వాల్సి వస్తోంది. ఈ జన్మలో ఇతను అనుభవిస్తున్న కర్మకి కారణం-ఓ జన్మలో ఇతను ఫ్రెంచ్ చక్రవర్తి 13వ లూయిస్ కోర్ట్‌లో, ఆయన దుస్తుల విషయంలో సలహాదారుడిగా ఉన్నప్పుడు అతను పరమ తిండిపోతుగా ఉండేవాడు. ఆ తర్వాతి జన్మలో కూడా ఇతను పర్షియాదేశరాజుకి వైద్యుడిగా ఉంటూ రాజభోజనం అనుభవించాడు. ఈ రెండు జన్మల్లో ఇతను 'అతి భోజనం' అనే భౌతిక పాపం చేసాడు కాబట్టి, దాన్ని బాలెన్స్ చేయడానికి ఈ జన్మలో ఇతను ఈ అజీర్ణ వ్యాధిని అనుభవిస్తున్నాడు.

దీన్నే భగవద్గీతలో 6వ అధ్యాయంలో (ఆత్మ సంయమన యోగం) 17వ శ్లోకంలో భగవంతుడు ఇలా చెప్పాడు.

**"యుక్తాహార విహారస్య, యుక్తచేష్టస్య కర్మసు, యుక్త స్వప్నావభోధస్య, యోగో భవతి దుఃఖహా"**

ఆహార విహారాదుల యందును, కర్మాచరణముల యందును, జాగ్రత్‌స్వప్నాదుల యందును యథాయోగ్యముగా ప్రవర్తించు వానికి దుఃఖ నాశకమగు ధ్యానయోగము సిద్ధించును". ఇక్కడ ఆహారం అంటే నోటితో తినేదే కాదు, మిగిలిన అన్ని ఇంద్రియాల ద్వారా మనసులోకి తీసుకునే అని అర్థం అని చెప్పుకోవాలి.

**"నాత్యశ్నతస్తు యోగో అస్తి న చైకాంతమనశ్నతః,**

**నచాతి స్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున" (గీత 6-16)**

అలాగే అర్జునా అతిగా భుజించువానికినీ, ఏ మాత్రము భుజింపనివానికిని, అతిగా నిద్రించువానికిని, ఎల్లప్పుడునూ (ఏ మాత్రము నిద్రింపక) మేల్కొని ఉండు వానికిని ఈ యోగసిద్ధి కలుగదు అని శ్రీకృష్ణుడు చెప్పాడు. ఒక్క పై విషయంలోనే కాక ఇతరత్రా కూడా మన జీవన విధానంలో ఏ విషయంలోనైనా అతిగా ప్రవర్తిస్తే ఆ కర్మబంధంలో ఉంటాము అని గ్రహించాలి. ఉదాహరణకి సెక్స్, మందు, పేకాట, సిగరెట్, భర్తని పిల్లలని తిట్టడం, కొట్టడం, అతిగా ఆఫీసు పనినే చేయడం, అసలు అఫీసు పనే ఎగ్గొట్టడం మొదలైన విషయాలలో చాలా మంది అతిగా ఈ తప్పు చేస్తుంటారు. అలాంటి సాధకులు దీన్ని గమనించాలి.

మరో రకం భౌతిక వ్యాధి కర్మకి **"సింబాలిక్ కర్మ"** అనే పేరు పెట్టారు. ఇది అత్యంత ఆసక్తికరమైన, విస్మయకరమైన కర్మఫలితానుభవం. ఓ వ్యక్తి చిన్నతనం నుంచే ఎనీమియా (రక్తహీనత) వ్యాధితో బాధ పడేవాడు. అతని తండ్రి ఎంతమంది డాక్టర్ల దగ్గరకి తీస్కుని వెళ్లినా ఫలితం కనిపించలేదు. ఇతని రీడింగ్‌లో కేసీ ఇలా చెప్పాడు. అయిదు జన్మల క్రితం ఇతను పెరూ దేశంలో ఎంతో రక్తపాతం చిందించి అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఆ కారణంగా ఈ జన్మలో ఇతను రక్తహీనతతో బాధపడుతున్నాడు.

ఇతను బూమరాంగ్ కర్మ పద్ధతిలో ఫలితం అనుభవించినట్లయితే, ఈ జన్మలో ఇతని రక్తం చింది ఉండేది. అలాగే తన అవయవాలని ఇతను దుర్వినియోగం చేయలేదు కాబట్టి అది ఆర్గానిక్ కర్మ కూడా

కాదు. ఈ జన్మలో రక్తహీనతతో ఇతని శరీరం ఛిన్నాభిన్నమై బాధపడుతోంది. ఒక్కసారి యుద్ధరంగంలో నెత్తురు చింది మరణించడం వల్ల ఇతని కర్మ పరిపాకం కాదు కాబట్టి జీవితాంతం రక్తహీనతతో బాధపడాల్సి ఉంది. ఎందుకంటే రక్తం కారేలా కొట్టి, రక్తహీనతతో మరణించేలా ఆ జన్మలో ఇతను చేసిన తప్పుకి ఫలితం ఇది.

**మనిషి మనసు వల్ల రోగాలు వస్తాయని వైద్యపరిశోధకులు తేల్చారు. ఆ విభాగానికి చెందిన రోగాలకి "సైకోసోమాటిక్ రోగాలు" అని పేరు. (సైకో అంటే ఆత్మ, సోమా అంటే శరీరం) ఓ మాట ద్వారా కానీ, చర్య ద్వారా కానీ బహిర్గతంగా కాని ఏమోషనల్ టెన్షన్స్ తరచు శరీరంలోని ఏదో ఓ అవయవం ద్వారా బయట పడుతూంటాయన్నది ఆ రకం రోగాల సిద్ధాంతం.** ఇది అర్థం అయితే సింబాలిక్ కర్మని అర్థం చేసుకోవచ్చు. సింబాలిక్ కర్మకి మరికొన్ని ఉదాహరణలు చూద్దాం.

"నువ్వు ఇతరులకి ఊపిరి ఆడకుండా చేసి చంపావు కాబట్టి ఈ జన్మలో ఊపిరి ఆడకుండా నువ్వు బతకాలి కాబట్టి నీకు ఉబ్బసం వ్యాధి వచ్చింది."(ఒక్కసారి అలా ఊపిరి ఆడకుండా చేస్తే కర్మ పరిపాకం కాదు).

ఓ చెవిటి వాడి రీడింగ్ ఇస్తూ కేసీ ఇలా చెప్పాడు. **"ఇక నుంచి సహాయం కోరే వాళ్ల మాటలని వినిపించుకోని పొరబాటు చేయకు"** (ఇతను ఫ్రెంచ్ విప్లవ సమయంలో రాజుగారి ప్రధాన అనుచరుడిగా ఉంటూ ఈ తప్పు చేసాడు)

కర్మ ఫలితం అనుభవించి తీరాలి. అయితే అందుకు మనం పుట్టే జన్మలోని సామాజిక పరిస్థితులకి అణుగుణ్యంగా అది జరుగుతుంది. ఉదాహరణకి తన శతృవుల కళ్లని వేడి ఇనుపరాడ్‌లతో పొడిచిన ఒకతనికి ఈ జన్మలో సరిగ్గా అలాంటి శిక్షే పడే అవకాశం లేదు. ఎందుకంటే ఆటవిక జాతులు ఇప్పుడు లేవు. అందువల్ల అతను పుట్టిగుడ్డిగా పుట్టాడు.

అంటే **భౌతిక స్థాయిలో తీసుకుంటే కర్మఫలితం, ఓ జన్మలో కర్మ చేసిన పరిస్థితులకి సరిసమానంగా ఉండదు. కానీ అదే మానసిక స్థాయిలో తీసుకుంటే అనుభవించే ఆ కర్మ ఫలితం దాదాపుగా ఆ కర్మకి సరిసమానంగా ఉంటుంది.**

**ఓ జీవి శరీరాన్ని లేదా అంగాలని బాధించినా లేక చంపినా, ఆ దుష్కర్మ ఫలితం తిరిగి మనం శరీరానికి వచ్చే వ్యాధి లేదా లోపం రూపేణా అనుభవించి తీరాలని ఈ ఉదాహరణ ద్వారా తెలుస్తోంది. అంతే కానీ మానసిక కష్టాల ద్వారా ఆ శిక్ష పడదు.**

ఆ రీడింగ్స్‌లో ఎక్కడా ఈ జన్మలోని కష్టాలు, అతను పూర్వ జన్మలో ఎవరినైతే కష్టపెట్టాడో, ఆ వ్యక్తి నుంచి శిక్షగా పొందాడని లేదు. కాళ్లకి పక్షవాతం వచ్చిన అమ్మాయికి ఆ వ్యాధి ఆమె పూర్వజన్మలో అలా బాధింపబడ్డవారి వల్ల సంభవించలేదు. అలాగే రక్తహీనతతో బాధపడే వ్యక్తికి, గతజన్మలో తాను ఎవరి రక్తాన్నయితే కళ్ల చూసాడో వారి వల్ల అది జరగలేదు.

**"దీన్ని బట్టి దుష్కర్మ చేసిన జీవాత్మని సరిదిద్దడానికి వీలుగా ఆ కర్మఫలం అనుభవించడానికి తగిన శిక్ష ఏదో విధంగా లభిస్తుంది కానీ అది అందుకు సంబంధించిన వ్యక్తుల వల్ల కలగాలని లేదు."**

ఈ రహస్యం తెలిసే కామోసు మన పెద్దవాళ్లు ప్రతీకారం కూడదని ఎవరి కర్మకి వాళ్లని వదిలేయాలని చెప్తారు. పగ, ప్రతీకారాల ద్వారా మనం కర్మ బంధంలో ఇరుక్కుంటాము. దానిని ప్రకృతికి వదిలేస్తే చాలు. ఎందుకంటే ఏ దుష్కర్మకీ తగిన శిక్ష వేయకుండా ప్రకృతి ఊరుకోదు. మరి కొన్ని వివరాలు వచ్చే అధ్యాయంలో చూద్దాం.

## అధ్యాయము - 2

## నిత్యజీవితంలో అతి సాధారణంగా చేసే కర్మలు - రోగ పరంపరలో వాటి ఫలితాలు

మనిషి చేసే కర్మలు మూడు రకాలు.

1) తన శరీరానికి చేసే దుష్కర్మలు. ఎక్కువగా తినడం, సిగరెట్, ఆల్కహాల్, డ్రగ్స్‌లాంటి అలవాట్లతో శరీరానికి హాని కలిగించడం లేదా భగవద్గీతలో "యుక్తాహార విహారస్య" అని చెప్పినట్లు ఏ ఇంద్రియానికి అధిక ఆహారం ఇవ్వకపోవడం లాంటి సుకర్మలు చేయడం.

2) తను జన్మించిన ప్రపంచములోని వాటి పట్ల చేసే క్రియలు - అడవులు నాశనం చేయడం (దుష్కర్మ) లేదా చెట్లునాటి  వాతావరణకాలుష్యాన్ని అరికట్టడం లాంటివి (సుకర్మలు), అనగా ప్రపంచం పట్ల చేసేవి.

3) సాటి జీవుల పట్ల చేసే కర్మలు. వారిని హింసించడం, అన్యాయంగా అపకారం చేయడం లేదా వారికి సహాయం చేయడం, వారు ఆనందంగా ఉండేలా చూడడం లాంటివి.

మనుష్యులుగా మనం చేసే ఈ మూడు రకాల చెడు లేదా మంచి కర్మల తాలూకు ఫలితాన్ని మనం వెంటనే అదే శరీరంతోనే (అతిగా ఆల్కహాల్ సేవించే వారు లివర్ లేదా కిడ్నీ జబ్బుతో మరణించడం, సిగరెట్ తాగే వాడు లంగ్ కాన్సర్‌తో మరణించడం) లేదా అవి వాయిదా పడి మరో జన్మలో ఇంకో శరీరంతోనో (ఈ అలవాట్లు లేని వారు కూడా ఆ జబ్బులతో మరణించడం మనం చూస్తున్నాము. బహూశ ఇవి పూర్వ జన్మలోని ఆ అలవాట్ల వల్ల కావచ్చు) అనుభవించి తీరాలి అని ఎడ్గర్‌కేసీ ఇచ్చిన రీడింగ్స్ తాలూకు ఫైల్స్ ద్వారా విశదమౌతోంది. ఈ మూడింటిలో ఏ విభాగం కర్మ ఆ విభాగంలోనే ప్రతిస్పందించడం విశేషం.

ఉదాహరణకి భోజనప్రియులు, మరు జన్మలో అసలు తినలేరు. అలాగే ఇతరులని ఎలా హింసిస్తే మరో జన్మలో దాదాపుగా అదే విధంగా హింసించబడతారు. ఈ జన్మలో చెట్లు నాటితే వచ్చే జన్మలో వాటి నుంచి, అవి ఇచ్చే సంపదని లబ్ధి పొందుతారు అని ఎడ్గర్‌కేసీ ఫైల్స్‌ని పరిశీలించిన వారు గ్రహించారు.

ఇక్కడ మనం స్పష్టంగా అర్థం చేసుకోవాల్సిన విషయం, ఈ కర్మఫలం అనుభవించడం ద్వారా మనస్సు లేదా జీవి తన తప్పిదాన్ని గ్రహించి మరెన్నడూ అది చేయని స్థితికి ఎదగగలగాలి. అప్పుడే ఆ కర్మఫలం పూర్తి అయినట్టు. లేదా అంతదాకా దాన్ని అనుభవిస్తూండాల్సిందే. దీనికి చక్కని ఉదాహరణ ఓ 11 ఏళ్ల కుర్రాడి కేసు.

తన రెండవ ఏట నుంచి ఆ బాలుడికి రాత్రుళ్లు పక్క తడిపే అలవాటుంది. తనకి తమ్ముడు పుట్టినప్పటినుంచి ఇది జరుగుతోంది. ఇంకో బిడ్డ వల్ల, తను రక్షణ కోల్పోయినట్లుగా భావించి పక్క తడుపుతున్నాడు అనుకున్నారు అతని తల్లితండ్రులు. అయితే ఏడాది అయినా మందులకి అది తగ్గక పోవడంతో సైక్రియాట్రిక్ చికిత్స పొందినా అతని ఈ చెడ్డ అలవాటు పోలేదు.

ఆ తర్వాత అతని తల్లితండ్రులు పక్క తడిపే అలవాటుని మాన్పించే అన్ని రకాల చికిత్సలూ ఆ కుర్రాడి మీద ప్రయోగించారు.కానీ ప్రతీ రాత్రి అతను పక్క తడుపుతూనే వున్నాడు. ఎనిమిదో ఏట మరోసారి సైక్రియాట్రిస్ట్ దగ్గరకి తీసుకెళ్లారు. కానీ రెండేళ్ల తరువాత సత్ఫలితం లేక విసిగి దాన్ని ఆపేసారు.

ఎడ్గర్‌కేసీ దగ్గరకి ఈ కేసు తీసుకు వెళ్లే నాటికి ఆ కుర్రాడి వయస్సు పదకొండు. ఎడ్గర్‌కేసీ సమ్మోహన స్థితిలో ఆ కుర్రాడిలోని ఆ చెడ్డ అలవాటుకి కారణం, దానికి నివారణోపాయం ఇలా వివరించాడు.

"ఈ జన్మకి ముందు జన్మలో ఆ బాలుడు, కొన్ని వందల ఏళ్ల క్రితం, ఓ చర్చ్‌లో మినిస్టర్‌గా పని చేసేవాడు. ఆ రోజుల్లో విచ్‌క్రాఫ్ట్ (చేతబడులలాంటివి) అధికంగా ఉండేది. మినిస్టర్‌గా ఇతను మంత్రగత్తెలని ఓ స్టూల్‌కి కట్టేసి , దాన్ని ఓ చెరువులోకి ముంచి లేపి, ముంచి లేపి వాళ్లని శిక్షించేవాడు. దాన్ని ఫలితమే ఇతని ఈ చెడ్డ అలవాటు."

ఇది పోవడానికి ఎడ్గర్ కేసీ ఓ నివారణోపాయం కూడా చెప్పాడు. ప్రతీరాత్రి ఆ బాలుడు నిద్రపోయే సమయంలో ఓ ఆధ్యాత్మిక సూచనని అతనికి వినిపిస్తూ ఉండాలి. ఆ ప్రకారం అతని తల్లి ప్రతీ రాత్రి ఆ బాలుడి పక్కన స్టూల్ మీద కూర్చుని, ఆ బాలుడు నిద్రపోవడానికి ముందు నెమ్మదిగా ఆ వాక్యాలని అతని చెవిలో చెప్పేది.

"నువ్వు మంచివాడివి, దయగలవాడివి, నువ్వు చాలా మందిని ఆనందంగా ఉంచగలుగుతావు. నీకు పరిచయమైన ప్రతీ వారికీ నువ్వు సహాయం చేస్తావు . . . నువ్వు మంచివాడివి, దయ గలవాడివి. . . . . ."

ఆ బాలుడు నిద్ర పోవడానికి ముందు 10 నిమిషాల సేపు ఆ తల్లి పైవాక్యాలని అతని చెవుల్లో చెప్పేది. ఆమె వృత్తిరీత్యా లాజిక్‌కి అధిక ప్రాధాన్యత ఇచ్చే లాయర్ అయినా, కేసీ మీద విశ్వాసంతో ఎలాంటి సందేహం లేకుండా, ఈ పని చేసింది.

తొమ్మిదేళ్ల తర్వాత మొదటి సారిగా ఆ రాత్రి ఆ బాలుడు పక్క తడపలేదు ! దాంతో కొన్ని నెలల పాటు ఆ తల్లి ప్రతీరాత్రి ఈ నివారణోపాయాన్ని అమలు చేసింది. మళ్లీ ఎన్నడూ ఆ బాలుడు పక్క తడపలేదు. కొంతకాలానికి వారానికో రాత్రి ఆ సూచన అతనికి చెప్తే సరిపోయేది. మరికొంత కాలానికి అసలు ఆ వాక్యాలు అతనికి చెప్పాల్సిన అవసరం లేకుండానే ఆ చెడ్డ అలవాటు పూర్తిగా మాయం అయిపోయింది.

తొమ్మిదేళ్లుగా పోని ఆ అలవాటు, ఆ బాలుడికి ఆ సూచన చెప్పిన తొలి రాత్రే పోవడం విశేషం. ఈ సూచన ఆ బాలుడి భౌతిక శరీరానికి ఇవ్వబడలేదు. అతని ఆత్మకి (స్పిరిట్యువల్ కాన్షస్‌నెస్‌కి) ఇవ్వబడింది. తనతో పాటు గత జన్మనుంచి తెచ్చుకున్న, తను తప్పు చేసానన్న ఆ అపరాధ భావాన్ని అతను సింబాలిక్‌గా, తన శరీరంలోని కిడ్నీ అనే జలానికి సంబంధించిన అవయవంతో ఈ చెడ్డ అలవాటు ద్వారా, దాన్ని వ్యక్తం చేసేవాడు. ఈ జన్మలో అతను ఎవరికి ఏ అపకారం చేయకపోయినా, అతని సబ్‌కాన్షస్‌నెస్ బ్రెయిన్‌లో తన మంచితనం మీద, దయ మీద తనకి అపనమ్మకం ఉండడంతో ఆ జ్ఞాపకం పని చేసి, నిద్రలో అది తన శరీరాన్ని తనే శిక్షించుకునేది. తల్లి సూచన ద్వారా సబ్‌కాన్షస్ బ్రెయిన్‌లోని ఆ అపరాధభావం సమూలంగా తుడిచి పెట్టుకుని పోవడంతో, అది తన శరీరాన్ని తనే శిక్షించుకోవడం ఆపేసింది. దాంతో ఆ చెడ్డ అలవాటు పోయింది.

ఆ తర్వాత ఆ బాలుడు పెద్ద వాడయ్యాక అంతా అతన్ని ఎంతో ప్రేమించేలా మసలు కొనేవాడు. ఇతరులలోని చెడ్డ గుణాలని, లోపాలని ఇతను ఎంతో ఓపికగా భరించగలిగేవాడు. ఈ విధంగా అతని ఆ కర్మఫలితం నాశనం చేయబడింది.

కాబట్టి కర్మతాలూకు ప్రతిఫలం ఎల్లప్పుడూ మానసికమైన శిక్షణే అయి, ఆత్మని ఉన్నత దిశకి తీసుకువెళ్లేదే తప్ప అది దేవుడు లేదా ప్రకృతి విధించే భౌతికమైన శిక్ష కానే కాదు అని కేసీ ఫైల్స్ నిరూపిస్తున్నాయి.

**"ఎగతాళి ఘోరమైన పాపం సుమా !"**

భగవద్గీతలోని "కర్మణ్యే వాధికారస్తే" లాంటి అనేక శ్లోకాల ద్వారా జగద్గురువు 'నేను' అనే భావం పెట్టుకోకుండా, 'సర్వం పరమాత్ముడి ప్రీత్యర్థమే చేస్తున్నాను' అనుకుంటూ చేయమని చెప్పాడు. ఈ స్థితిని "సంపూర్ణ శరణాగతి" అని చెప్తారు.

క్రీస్టియన్ మతంలోని ప్రధాన ఏడు పాపాల్లో ఒకటి అహం. (ప్రైడ్). గర్వానికి, మనిషికి వచ్చే భౌతిక సమస్యలకి సంబంధం ఉన్నది అనేది మన మేధస్సు ఒప్పుకోవడానికి అంగీకరించకపోవచ్చు. కానీ ఎడ్గర్‌కేసీ రీడింగ్స్ వల్ల ఇది నమ్మక తప్పడం లేదు.

**"అహం ఓ పాపం. ముఖ్యంగా అది ఇతరుల మీద హేళన లేదా ఎగతాళి ద్వారా బయట పడినప్పుడల్లా దాని ఫలితం ఆ జీవి అనుభవించక తప్పదు. క్రూరమైన నవ్వు, కించపరిచే మాటలు, ఎగతాళి చూపులులాంటివి వారి మీద భౌతికంగా దాడి చేయడంతో సమానం. దాంతో "బూమరాంగ్ కర్మ" ఫలితాల చర్య మొదలవుతుంది. మనం ఎవరి శరీర అంగాలని లేదా లోపాలని కించపరుస్తూ నవ్వామో లేదా మాట్లాడామో, మనం ఏదో ఓ జన్మలో, అదే అంగానికి సంబంధించిన వ్యాధి లేదా లోపంతో బాధపడి తీరాలని ఎడ్గర్‌కేసీ ఫైల్స్ లోని ఏడు కేసులు స్పష్టం చేస్తున్నాయి."**

ఆసక్తికరంగా, వాటిలోని ఆరు కేసులు రోమ్‌లో క్రీస్టియన్స్‌ని బాధించిన తరానికి చెందినవే అవడం ఓ విశేషం. ఇది వరకు చెప్పినట్లుగా చరిత్రలోని ఓ భాగంలో జీవించిన ఆత్మలు, మళ్ళీ కలిసికట్టుగా చరిత్రలోని ఇంకో భాగానికి చెందిన సమయంలో రావడం వీటి ద్వారా గమనించవచ్చు. ఈ ఏడిండిలో మూడు పోలియో వ్యాధికి చెందినవి.

మొదటిది - 45 ఏళ్ల ఓ ఇల్లాలు, ముగ్గురు బిడ్డల తల్లి, తన 36వ ఏట పక్షవాతంతో అడ్డంపడి అప్పటి నుంచి నడవలేకపోతోంది. ఇంట్లో వీల్‌చెయిర్‌లో తిరుగుతూ ఉండేది కానీ ఇంటి బయట ఎక్కడకి వెళ్లాలన్నా ఇతరుల సహాయం మీద ఆధారపడాలి.

ఎడ్గార్ కేసీ ఆమెకి ఏ కర్మ వల్ల ఇది సంభవించిందో వివరించాడు. పురాతన రోమ్ కాలంలో, నీరో చక్రవర్తి పరివారంలో ఈమె ఉండేది. అతను క్రిస్టియన్స్‌ని అనేక విధాలుగా హింసించాడు. ఆ కాలంలో మనుషులతో మనుషులు, క్రూర మృగాలతో మనుష్యులు, పోట్లాడి ఎవరు బ్రతికి ఉంటే, వాళ్లని విడుదల చేసేవారు. సాధారణంగా ఆ కాలంలో నేరస్థులకి ఈ శిక్ష వేసేవారు. ఇలా తమ ప్రాణం కోసం పోరాడే వారి కాళ్లకి ఏదైనా గాయమై కదలలేకపోతే వారిని చూసి ఈమె తెగ నవ్వేది. దాంతో 'ఇన్‌ఫెంటైల్ పెరాలసిస్ వ్యాధి' వచ్చింది. ఈ అనుభవం ఆ ఆత్మ మీద పని చేసి భవిష్యత్‌లో మరెన్నడూ కుంటివారిని, అవిటివారిని చూసి నవ్వకూడదన్న పాఠాన్ని ఈ ఆత్మ ఈ శరీరంలో నేర్చుకుంటుంది అని కేసీ వివరించాడు.

రెండో కేసు ఓ సినిమా నిర్మాతది. తన 17వ ఏట ఇతనికి పోలియో వ్యాధి వచ్చి ఓ కాలితో కుంటుతూ నడిచేవాడు. ఎడ్గర్ కేసీ రీడింగ్స్‌లో అతని గురించి ఇలా ఉంది.

" ఈ ఆత్మ రోమన్ సామ్రాజ్యంలోని సైనిక దళంలో ఉన్నప్పుడు భయపడేవారిని చూసి, అసలే మాత్రం పోరాడకుండా లొంగిపోయే వాళ్లని చూసి అవహేళనగా నవ్వేవాడు. అయితే వాళ్లు ఏ ఆశయాలతో అలా చేసేవారో గమనించేవాడు కాదు. ఈ జన్మలో శరీరంలోని ఈ వ్యాధి అనే అనుభవం ద్వారా అవసరమైన భావాలు మేల్కొని ఈ ఆత్మ ఆధ్యాత్మిక శక్తులని అభివృద్ధి చేసుకుంటుంది."

మూడో కేసు, కేసీ ఫైల్స్‌లోని అన్ని కేసులకంటే బాధాకరమైనది. 34 ఏళ్ల యువతికి 6 నెలలకే "ఇన్‌ఫెంటైల్ పెరాలసిస్' అనే వ్యాధి రావడంతో వెన్నెముక లోపానికి దారి తీసి కుంటుకుంటూ నడవడం సంభవించింది. తండ్రి ఈమెని పట్టించుకోకపోగా, ఈమె కోళ్లని పెంచి సంపాదించింది కూడా

దొంగిలించేవాడు. విధి ఆమె ఇద్దరు ప్రియులని దూరం చేసింది. ఆమె మొదటి ప్రియుడు, మొదటి ప్రపంచ యుద్ధంలో మరణించాడు. ఆమెతో నిశ్చితార్థం అయ్యాక రెండో ప్రియుడు తీవ్రవ్యాధిగ్రస్తుడయ్యాడు. అయితే అతను ఆ వ్యాధి నుంచి కోలుకున్నాక తనకి సేవ చేసిన నర్స్‌నే వివాహం చేసుకున్నాడు. ఓ రోజు ఈమె మెట్ల మీద నుంచి జారిపడి, వెన్నెముక విరిగి, పక్క మీద నుంచి లేవలేని స్థితికి చేరుకుంది.

ఇది ఏ కర్మ ఫలితమో ఎడ్గర్‌కేసీ ఇలా వివరించాడు. " రెండు జన్మల క్రితం ఈమె రోమ్‌లో 'పాలటియస్' ఇంటి పరివారంలో ఉంటూ, మనిషి సాటి మనిషితో కానీ, క్రూరమృగంతో కానీ తన ప్రాణాల కోసం జరిపే పోరాటాన్ని తిలకించి, వారిలోని బలహీనులని చూసి నవ్వేది. వారు సరైన కారణం కోసం పోరాడుతున్నారనే సానుభూతితో అర్థం చేసుకోక పోగా, నవ్వేది కాబట్టి ఈ జన్మలో ఆత్మోన్నతి కోసం ఈ గతి సంభవించింది."

పోలియో కాక మరో వ్యాధి రూపంలో, ఇతరులని చూసి ఎగతాళిగా నవ్విన మరో నలుగురి కేసులు. మొదటి కేసు, తుంటి ఎముక దగ్గర వచ్చిన టి.బి. వ్యాధితో కుంటుతున్న ఒకామె, గత జన్మలో అమెరికాలో సెటిల్ అయిన వాళ్లలో ఒకరు. అయితే ఈ వ్యాధికి కారణం ఆమె అంతకు మునుపు జన్మలో రోమ్ సామ్రాజ్యంలో నీరో సభలో స్థానం సంపాదించిన ఓ ప్రముఖుడు. గోదాలో (ఎరీనాలో) క్రిస్టియన్స్ తమ ప్రాణం కోసం సాటి జీవితో జరిపే పోరాటాలని చూసి నవ్వేవాడు. ఓ సారి ఓ సింహం పంజా దెబ్బకి ఒకామె తుంటి భాగం చీలిపోవడం చూసి నవ్విన కర్మ ఫలితమే ఈ జన్మలో ఈ వ్యాధి.

రెండో కేసు ఓ 18 ఏళ్ల అమ్మాయిది. ఈమె అందగత్తె కానీ చాలా లావుగా ఉండడం వల్ల ఆ అందానికి శరీరం అవరోధం అయ్యింది. పిట్యూటరీ గ్లాండ్ ఎక్కువగా పని చేయడం వల్ల ఈ అధిక బరువు అని డాక్టర్లు తీర్మానించినా, ఎడ్గర్ కేసీ రీడింగ్ ప్రకారం రెండు జన్మల పూర్వం ఈమె రోమ్ నగరంలోని అందగత్తె అయిన క్రీడాకారిణి. అయితే అధిక బరువు వలన తనతో బాగా ఆడలేని వారిని చూసి ఎగతాళిగా నవ్వేది కాబట్టి ఆ కర్మ ఫలితమే ఈ జన్మలో లావు శరీరం సంభవించింది.

మూడో కేసు 21 ఏళ్ల కేథలిక్ యువకుడిది. ఇతన్ని మతాధికారిని (ప్రీస్ట్‌ని) చేయాలని తల్లితండ్రుల ఆకాంక్ష. కానీ ఇతను అందుకు అంగీకరించలేదు. స్వలింగ సంపర్క వాంఛ ఇతని సమస్య.

రెండు జన్మల క్రితం ఇతను ఫ్రెంచ్ చక్రవర్తి సభలో ఉంటూ, ఆ సభలోని స్వలింగ సంపర్క సంబంధం గల అనేకమంది గురించి అందరి ముందూ ఎద్దేవాగా మాట్లడుతూ, తన కార్టూనిస్ట్ నైపుణ్యంతో వాటిని ఇతరుల ముందు పెట్టి ఆనందాన్ని అనుభవిస్తూ ఉండేవాడు.

**"ఇతరులని నిందించకు. అప్పుడు నువ్వు నిందించబడవు. నువ్వు ఇతరుల విషయంలో ఎలా ప్రవర్తిస్తే, ఇతరులు నీ విషయంలో అలాగే ప్రవర్తిస్తారు. ఇతరులలో నువ్వు ఏది చూసి నిందిస్తే, నువ్వు అదే అవుతావు" అని ఎడ్గర్‌కేసీ అతని గురించి చెప్పాడు.**

నాలుగో కేసు 16 ఏళ్ల వయస్సులో ఓ కుర్రాడికైన కారు ఏక్సిడెంటులో అతని వెన్నుముక విరిగింది. డాక్టర్లు అసలు బతుకుతాడు అనుకోలేదు. కానీ బ్రతికాడు. అతని జీవితం ఆ తర్వాత చక్రాల కుర్చీకి పరిమితమైపోయింది. ఏడున్నర ఏళ్ల తరవాత అతని 23వ ఏట అతని తల్లి ఎడ్గర్ కేసీని కన్సల్ట్ చేస్తే, అతనిలా చెప్పాడు.

"రోమన్ సామ్రాజ్యంలో ఇతను తన ప్రాణాల కోసం, సాటి మనుషులతో పోరాడి గెలిచాడు. అయితే తనలాగా ఇతరులు తమ ప్రాణాల కోసం క్రూర మృగాలతో అదే ఎరీనాలో పోరాడడం చూసి, వారి బాధని గుర్తించక దాన్ని తేలికగా తీసుకునేవాడు. అందువల్ల ఈ ఆత్మ ఈ జీవితంలో తనలోనే బాధని చూసుకుని

దాన్ని తేలికగా తీసుకుంటోంది. ఇలా తేలికగా తీసుకునే స్వభావం ఆ తర్వాతి జన్మలో ఆమెరికన్ రెవల్యూషన్ సమయంలో ధైర్యవంతుడైన మిలటరీ ఆఫీసర్‌గా ఉంటూ ఇతను సాధించాల్సిన గుణాలు-ఉత్సాహంగా ఉండడం, ప్రతీది క్రమశిక్షణగా చేయడం, చేతిలో ఉన్నదాన్ని ఏదో విధంగా ఉపయోగించుకోవడం, కష్టాలలోంచి బయటపడే ప్రయత్నం చేయడం - అనే స్వభావాలు సంపాదించుకునేదాకా ఆ కర్మఫలితం వేచి ఉంది"

ఈ ఏడు కేసుల ద్వారా ఇక్కడ గమనించాల్సిన ఆసక్తికరమైన విశేషాలెన్నో ఉన్నాయి. పోలియో వ్యాధి, తుంటి ఎముకకి టి.బి., అధికబరువు, స్వలింగ సంపర్కవాంఛ, ఏక్సిడెంట్ వలన వెన్నెముక విరగడం. వీరిలో ఎవరూ ఈ వ్యాధులతో పుట్టలేదు.

పుట్టిన కొంతకాలానికి - 6 నెలల నుంచి, 36 సంవత్సరాలలోగా - ఈ వ్యాధులు వచ్చాయి. పోలియో లేదా టి.బి. క్రిమి, లేదా ఇంకే వ్యాధి కారక క్రిమి అయినా కేవలం కొంత మంది మనుష్యులనే ఇబ్బంది పెట్టి, మిగిలిన వారిని ఏం చేయకపోవడం వెనుక అసలు కారణం, "ఎవరు కర్మఫలం అనుభవించాల్సి ఉందో వారినే అవి బాధించడంగా" ఇందు వలన గ్రహించవచ్చు.

అలాగే ఎంతమంది ఏక్సిడెంట్ బారిన పడ్డా అందులో కొందరికే దాని వల్ల చెడు ఫలితం - అదీ ఒకొక్కరికీ ఒక్కో విధంగా కలగడం కూడా వారి పూర్వజన్మ కర్మల ఫలితంగా అని మనం గ్రహించవచ్చు. కొందరు చర్మం గీరుకు పోకుండా కూడా ఏక్సిడెంట్‌లోంచి తప్పించుకుంటే, మరికొందరు కాలో, చెయ్యో పోగొట్టుకుంటారు. కర్మని, కర్మ ఫలితాలని నమ్మే వారికి ఇది కొంత ఊరట కలిగించే విషయం.

అయితే ఎగతాళిగా నవ్వినందుకే ఇంత ఫలితం ఉంటుందా? ఇది కర్మకి మించి ఫలితం కదా అని కొందరికి అనిపించవచ్చు. కానీ కాదు.

**"ప్రతీ జీవిలో ఉండే ఆత్మ పరమాత్మే. మరో జీవిని చూసి నవ్వడం అంటే పరమాత్మని చూసి నవ్వడమే. ఇతర జీవాలు తమ కర్మఫలంలో చిక్కుకున్న సందర్భాలని సానుభూతిగా చూసి అర్థం చేసుకోకుండా, వారి ఆత్మ గౌరవం దెబ్బ తీసే విధంగా, వారిలోని దైవత్వాన్ని మరచి నవ్వడం అనే పాపం చేయడం సముచితం కాదు అన్నది ప్రకృతి నియమం. దాన్ని ఉల్లంఘిస్తే ఆ మేరకి ప్రకృతి మన ఆత్మలని సరిదిద్దాల్సిన అవసరం ఉంది కాబట్టి అందులో భాగంగానే శిక్షలుగా తోచే ఈ వ్యాధులు, ఇబ్బందులు సంభవిస్తాయి."**

అంతే కాక తన అహం ఇతరుల అహం కన్నా ఎక్కువని అపోహపడడం వల్ల కూడా - అంటే తను ఎవరిని చూసి నవ్వుతున్నాడో వారి కన్నా తను గొప్ప అని భావించడం ద్వారా కూడా - నవ్వుతాడు. ఇతరులని ఎగతాళి చేయడం అంటే, మనల్ని వారికన్నా గొప్పగా భావించడమే. అదే స్థితిలో ఉన్న ఒకరు మరొకర్ని చూసి నవ్వరు కదా.

**" నాలికతో, నోటి మాటలతో, నవ్వుతో మనం ఏ రకం పాపం చేయకూడదని, తద్వారా పాపకూపంలో, జన్మ బంధంలో చిక్కుకోకూడదని ఈ ఏడు కేసుల నుంచి మనం పాఠాలుగా గ్రహించాలి."**

**ఇది జీసెస్ మాటలలో "జడ్జ్ నాట్ దట్ ఇ బి నాట్ జడ్జ్‌డ్" -**

" మనం మన నోటితో, నాలుకతో విషాన్ని కక్కకుండా మన గురు దేవులు

మనందర్నీ కాపాడుగాక . . . "

## అధ్యాయము - 3

## భార్యాభర్తలు కర్మ ఫలితంగానే జత చేయబడతారా?

గత అధ్యాయంలో కొన్ని కర్మలు మనకి రోగపరంపరలో ఎలా ఫలితాలనిస్తాయో తెలుసుకున్నాము. అయితే చాలా రోగాలు వంశపారంపర్యంగా వస్తూంటాయి. పిచ్చి, ఆస్తమా, డయాబెటిస్ లాంటి అనేక రోగాలు రావడానికి కారణం అది మన పూర్వికులకి ఉందా లేదా అన్నది నిర్ణయిస్తుంది.

ఓసారి ఒకరు ఎడ్గర్ కేసీని నాకున్న ఈ రోగం నా తండ్రి వైపు నుంచి సంక్రమించిందా? లేక నా తల్లి వైపు నుంచా? అని ప్రశ్నిస్తే ఎడ్గర్‌కేసీ ఇచ్చిన జవాబు.

అది నీ కుంటుంబం నుంచి కాక నీ నుంచే సంక్రమించింది. "కుటుంబం అనే నదిలో ఆత్మ ప్రవహిస్తుంది." కర్మ ఫలితాలని ఆ రోగాలతో అనుభవించాల్సిన అవసరం ఉన్న ఆత్మలు - ఆ వంశంలో జన్మించేలా ఓ ప్రత్యేక అయిస్కాంత ఆకర్షణాశక్తి పని చేస్తోందని, ఇందు వల్ల అర్థం చేసుకోవచ్చు. వంశపారంపర్య వ్యాధులు గత జన్మలలోని కర్మ బంధాలకి లోబడి ఉంటాయి అని కూడా ఇందువల్ల విదితమవుతోంది.

## "కర్మ బంధాల వల్లే భార్యాభర్తలు అవుతారు"

హిందూ కర్మ సిద్ధాంతం ప్రకారం మనిషి జననం నుంచి, మరణంలోగా ఇతరులతో అతనికి సంభవించే అన్ని ప్రధాన బంధాలు పూర్వజన్మ కర్మబంధాల వల్లనే జరుగుతాయి. అందులో భార్య, పిల్లలతో బంధాలు ముఖ్యమైనవి.

ఎడ్గర్‌కేసీ కేస్ రీడింగ్స్ కూడా ఇదే చెప్తున్నాయి. ఆ నేపథ్యంలో దీన్ని ఇలా చెప్పుకోవచ్చు. 'వివాహం అనేది ఇద్దరు మనుష్యులు తమ ఋణానుబంధాలు తీర్చుకోవడానికి, తద్వారా ఆత్మోన్నతిని పొందడానికి ఏర్పడుతుంది.

ఎడ్గర్ కేసీ కూడా ఓ మనిషికి ఇంకో మనిషితో ఉండే ప్రధాన బంధం కేవలం కాకతాళీయంగా సంభవించదని, గత జన్మల ఋణాను బంధాల వల్లే అది కలుగుతుందని స్పష్టం చేసాడు. భార్యాభర్తలు, ఈ జీవితాల్లో కొత్త అధ్యాయం తెరుస్తున్నా, గత జన్మల్లోనే దాని ఆరంభం జరిగిందని తెలుసుకోలేరు.

తమ వైవాహిక జీవితాల్లో తమ జీవిత భాగస్వామ్యుల నుంచి కలిగిన సమస్యల విషయాలలో కొందరు ఎడ్గర్ కేసీ సహాయం కోరారు. కేసీ రికార్డుల్లోని అలాంటి కొన్ని కేసులని ఈ నేపథ్యంలో డాక్టర్ జి.సెర్మినారా 'మెనీ మాన్షన్స్' పుస్తకంలో పేర్కొన్నారు. వాటి గురించి తెలుసుకుంటే, పై విషయాలు మనకి ఇంకాస్త స్పష్టము అవుతాయి.

తన 23వ ఏట వివాహం చేసుకున్న ఓ సౌందర్యవతి, 18 ఏళ్ల వైవాహిక జీవితానంతరం, తన 41వ ఏట ఎడ్గర్ కేసీకి తన సమస్యని ఇలా వివరించింది.

ఐశ్వర్యవంతుడు, వ్యాపారవేత్త అయిన ఆమె భర్త నపుంసకుడు. అద్భుత సౌందర్యవతి అయిన ఈమెకిలాంటి భర్త లభించడం షేక్స్‌పియర్ ట్రాజెడీ డ్రామా లాంటిది. అన్నల్‌మెంట్ (విడాకుల అవసరం లేకుండా, అసలు అలాంటి వివాహమే చట్టవిరుద్ధమని కోర్టు ఇచ్చే తీర్పు) కోసం కానీ, విడాకుల కోసం కానీ అమె ప్రయత్నిస్తే, ఆ సమస్య ఏనాడో తీరేది. కానీ అమె అందుకు విముఖురాలు. ఈ ఒక్క లోపం వదిలేస్తే తన భర్త అన్ని విషయాల్లో ప్రేమకి అర్హుడు కాబట్టి ఆమె అతన్ని కోర్టుకి ఈడ్చి బాధించదలచుకోలేదు. తమ వివాహమైన కొత్తల్లో ఆమె భర్త మీద కోపంతో కాక, తన శారీరక వాంఛలని తీర్చుకోవడానికి

అనేకమందితో అక్రమసంబధాలు నడిపింది. కానీ క్రమేపీ ఆమె ధ్యానం వల్ల, దైవభక్తి పెంపొందించుకోవడం వల్ల ఆ విష వలయంలోంచి బయట పడింది.

తన పాత జీవితంలోని ఓ ప్రియుడు తిరిగి ఇటీవల ఆమెకి తారసపడ్డాడు. ఆమె మనస్సు మళ్లీ జారింది. అయితే అతనికి వివాహమై భార్య ఉండడం వల్ల, ఆ భార్యకి ద్రోహం చేయకూడదన్న తలంపే ఆమెని నిగ్రహింప చేసింది. తగిన తరుణోపాయం చెప్పమని కోరుతూ ఆమె కేసీకి ఇదంతా ఉత్తరం ద్వారా వివరించింది.

సమ్మోహన స్థితిలో ఎడ్గర్‌కేసీ ఆమెకి చెప్పిన విషయాలు చూద్దాం. ఈ జన్మకి రెండు జన్మల ముందు ఆమె ఫ్రాన్స్‌లో, క్రైస్తవ మత యుద్దాలు జరిగే రోజుల్లో సుజేన్ మెర్ సిల్వా అనే పేరుతో స్త్రీగా జన్మించింది. ప్రస్తుత జన్మలోని తన భర్తనే ఆ జన్మలో వివాహం చేసుకుంది. అప్పుడతని పేరు మెర్‌సిర్వా. అతను ఆ జన్మలో బాగా దైవభక్తి కలవాడు. ఆ క్రూసేడ్స్‌లో పాల్గొని క్రైస్తవ మతాన్ని దుర్మార్గుల బారి నుంచి కాపాడాలనుకునే ధ్యేయంతో, తన తోటి వాళ్లతో కలిసి మత యుద్ధాలకి వెళ్లేవాడు.

అలా తను వెళ్లినప్పుడు తన భార్య పరాయి మగాళ్లతో తిరగచ్చన్న భయంతో అతను ఆ రోజుల్లో అందరూ వాడే ఓ అసాధారణ పరికరాన్ని, ఆమె అలాంటి పాపకార్యంలో పాల్గొనకుండా ఉండడానికిగానూ, తను ఇల్లు వదిలి వెళ్లినప్పుడల్లా ఆమెకి తొడిగేవాడు. దాని పేరు ఛేస్టిటీ బెల్ట్ (ఇరవై శతాబ్దపు చివరి దాకా ఇది యూరప్‌లో ఉపయోగంలో ఉండేది) తోలు లేదా లోహంతో చేసిన ఆ తొడుగు ఆడదాని వంటిమీద తొడిగితే ఇక ఆమెతో ఎవరూ రతి కార్యంలో పాల్గొన లేరు. రతికి అవసరమైన అంగాలని ఆ పరికరం మరగు పరిచి ఉంచుతుంది. దాన్ని ఆమె విప్పుకోకుండా ఉండడానికి తాళం వేసేస్తే ఆమె పాతివ్రత్యానికి భౌతికంగా భంగం వాటిల్లదు. తన భార్య పతివ్రతగా ఉండడానికి ఆమె భర్త ఆ చేస్టిటీ బెల్ట్ అనే తొడుగుని ఆమె చేత ధరింప చేసి కానీ వెళ్లేవాడు కాదు.

అయితే ఆమెకి అది ఎంత మాత్రం ఇష్టం లేకపోవడంతో బలవంతంగా దాన్ని ధరించాల్సి వచ్చేది. అలా తను బలవంతంగా పాతివ్రత్యాన్ని కొనసాగించడం ఆమెకి మానసిక వేదనగా ఉండేది.

పైకర్మల ప్రభావం వల్ల, అందులోంచి విముక్తి పొందడానికి ఈ జన్మలో తిరిగి వారు భార్యాభర్తలయ్యారు. తన భార్య, భౌతికంగా సెక్స్‌లో పాల్గొనకుండా బలవంతంగా, యాంత్రికమైన పరికరంలో ఆనాడు బంధించిన కర్మ ఫలితంగా అతను ఈ జన్మలో నపుంసకుడిగా పుట్టాడు. ఎంత సరైన ఫలితం!

అయితే ఆమెకి ఆ జీవితంలో లభించిన శిక్షే ఈ జీవితంలో కూడా ఇలాంటి భర్త వల్ల లభించింది అనిపించవచ్చు. కానీ లోతుగా ఆలోచిస్తే, ఆ సూక్ష్మం బోధపడుతుంది. ఈమెకి ఇష్టం లేకపోయినా బలవంతంగా ఆ సాధనాన్ని భర్త ధరింపచేయడంతో ఆమె పరపురుషుడితో సంభోగంలో పాల్గొనలేకపోయింది. ఆ పరికరం లేకపోతే, ఆమె ఆ పాడు పని చేసేదో లేదో కానీ, ఆ పరికరం వల్ల ఆమెకి అది చేయాలన్న తపన, తద్వారా భర్త మీద ప్రతీకారం తీర్చుకోవాలన్న భావన కలిగి ఆ జన్మలో ఆ భావం స్థిరపడింది.

కర్మ ఎప్పుడూ "భావన" వల్లే ఏర్పడుతుంది అని పూర్వపు ఆధ్యాయాల్లో చెప్పుకున్నాం. మానసికంగా కలిగి, స్థిరపడిపోయే భావాలే అసలు కర్మలు. అవే బంధాలు అయ్యేవి. ఆ జన్మలో ఆమె ఆత్మ ఆ విధంగా బాధింపబడబట్టి దానికి శిక్షగా ఈ జన్మలో అతను నపుంసకుడయ్యాడు. ఆమెకి ఆనాడు అతన్ని ప్రతీకారంతో శిక్షించాలన్న కోరిక ఉండబట్టి ఆ అవకాశం ఈ విధంగా ప్రకృతి లేదా కర్మబంధం ఆమెకి తిరిగి ప్రసాదించింది. అది పూర్తయితే కానీ ఎన్ని జన్మలు గడిచినా ఆ ఆత్మకి శుద్ధి జరగదు.

ఈ విషయం ఇంకాస్త విశదమయ్యేందుకు ఇక్కడో పిట్టకథ చెప్పుకుందాము.

ఓ గుడి ఎదురుగా ఓ వేశ్య ఇల్లుంది. అనేకమంది విటులు నిత్యం ఆ వేశ్య ఇంటికి వస్తూండడం ఆ గుడి పూజారి చూసేవాడు.

ఓ రోజు ఆయన ఆ వేశ్యతో " నువ్వు ఎంత పాపం చేస్తున్నావో తెలుసా? ఇందువల్ల నువ్వు నరకానికి పోతావు కాబట్టి ఈ పని ఆపు" అన్నాడు. పూజారి మాటల మీద విశ్వాసం గల ఆ వేశ్య తను చేసే పాపపు పనికి వెరవసాగింది. అయితే వ్యభిచారం ఆమె వృత్తి. వంశాచారం వల్ల వచ్చిన ఆ జీవనోపాధిని వదులుకోలేక పోయింది. ఇంకో వృత్తి చేతకాదు.

దాంతో ఆమె తన ఒంటిని అమ్ముకున్నప్పుడల్లా అందుకు బాధపడేది. పశ్చాత్తాపంతో కుమిలిపోతూ భగవంతుడిని తనని క్షమించమని ప్రార్థించేది. కొంతకాలానికి ఓ రోజు ఓ రాళ్ల గుట్టని ఆమెకి చూపించి చెప్పాడు ఆ పూజారి.

"నిన్ను నేను సన్మార్గంలో పెడదామనుకున్నాను. నా మాట వినలేదు. చూడు . నీ ఇంటికి విటుడు వచ్చినప్పుడల్లా నేను ఓ రాయిని ఇక్కడ వేస్తున్నాను. నీ పాపరాశి ఎలా గుట్టగా ఎదిగిందో చూడు. నువ్వు నరకంలో ఎన్నో బాధలు అనుభవించి తీరాలి"

ఆమె భయంతో గజ గజ వణికి పోయింది. భగవంతుణ్ని పశ్చాత్తాపంతో తనని క్షమించమని ఆ రాత్రి ప్రార్థించింది. కాలం తీరి ఆ రాత్రే ఆమె మరణించింది. ఆ పూజారి కూడా అదే సమయంలో మరణించాడు. అయితే యమభటులు ఆ వేశ్యని స్వర్గానికి, పూజారిని నరకానికి తీసుకెళ్లడం గమనించి పూజారి వాళ్లతో పొరపాటు చేస్తున్నారని చెప్పాడు. వాళ్లు విషయం తేల్చుకోవడానికి ఇద్దర్ని యమధర్మరాజు దగ్గరకి తీసుకెళ్లారు. పూజారి చెప్పాడు.

"స్వామీ, భటులు మందమతుల్లా ఉన్నారు. ఎంతో నిష్ఠగా జీవితాంతం గుళ్లో దేవుడికి పూజలు చేసిన నన్ను నరకానికి, నిత్యం వ్యభిచారం చేసి పాపాన్ని పోగుచేసుకున్న ఈమెని స్వర్గానికి తీసుకువెళ్తున్నారు."

యముడు నవ్వి చెప్పాడు.

"ఈమె తన శరీరంతో పాపం చేసినా అందుకు మానసికంగా పశ్చాత్తాపపడుతూ ఎంతో కృంగిపోయింది. సంకల్పానికి తగ్గట్టే శిక్ష ఉంటుంది. ఈమె తను చేసిన తప్పుకు ప్రక్షాళనగా సదా దేవుడిని స్మరించేది కాబట్టి ఆమె పాపం ప్రక్షాళనమై స్వర్గానికి అర్హతని సంపాదించింది. ఈమె శరీరం తప్పు చేసింది కాబట్టి అది కాకుల, గద్దల పాలయ్యింది. ఆత్మ పరిశుద్ధం కాబట్టి అది స్వర్గానికి వెళ్తుంది. ఇక నీ విషయం. నువ్వు నీ శరీరంతో ఎన్నడూ పాపం చేయలేదు. కాబట్టి మరణాంతరం లోకులు నీ శరీరాన్ని సుగంధ ద్రవ్యాలు, పూలు చల్లుతూ తీసుకెళ్లి చందనంతో కాలుస్తున్నారు. కానీ నీకు ఈమెపై మనసుంది కానీ, లోకులు ఏమనుకుంటారో అని భయపడి, ఆమెని అంటలేదు. నీ మనసుతో నీవు ఆ విధంగా పాపం చేసావు. కాబట్టి నీ ఆత్మ నరకానికి పోవడం సబబు."

శంకరాచార్యులు వివేకచూడామణిలో ఇదే చెప్పారు. "మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః" అని. యోగ వాశిష్టంలో కూడా మనసే బంధానికి కారణం అని చెప్పాడు వశిష్టుడు. ఇందుకే "దేవుడిని భావగ్రాహి" అని కూడా అంటారు. కాబట్టి మనం మనస్సుని పవిత్రంగా ఉంచుకోగలిగే, మానసిక ఎక్సర్‌సైజ్‌లు చేయడంద్వారా పాపంలో చిక్కుకోకుండా ఉండవచ్చు.

ఇక ప్రస్తుతానికి వస్తే, ఆమెకి లభించిన ఈ అవకాశంతో ఆమె గత జన్మలో తనని బాధించిన భర్త ఈ జన్మలో అసూయతో చచ్చేలా తన సౌందర్యాన్ని పరాయి పురుషుల చేతుల్లో పెట్టి బాధించవచ్చు. లేదా తన భర్తలోని ఈ లోపాన్ని ప్రపంచానికి వెల్లడి చేసి, విడాకులు తీసుకుని అతన్ని బాధించవచ్చు. ఇంతకు

మించిన చక్కటి ప్రతీకారం ఇంకేముంటుంది?

ఆమె ఈ జన్మలో అలా చేసినా ఆమె ప్రతీకార వాంఛ చల్లారి ఆమె ఆత్మశుద్ధి అయ్యేది కానీ ఆ పాపం ఆమెకి అంటేది కాదు. కర్మబంధం పరిధిలో ఏం చేసినా అది తిరిగి అంటదు. ఇది ఒకప్పటి చర్యకి ప్రతిచర్యే. ప్రతిచర్యకి మరో ప్రతిచర్య ఉండదు.

అయితే అలా జరగలేదు. కారణం తర్వాతి రెండు జన్మలలోని అనుభవాలతో ఆమెకి ఆత్మోన్నతి జరిగింది. అందువల్లే ఆమె ఎవరి పట్ల అయినా దయారహితంగా ఉండగలిగే స్థితిని అధిగమించింది. తన పాత ప్రియుడితో రహస్యంగా అక్రమ సంబంధం కొనసాగించవచ్చు. కానీ అది తన ప్రియుడి భార్యకి తెలిస్తే, ఆమె బాధ పడుతుందన్న దయాగుణంతో ఆమె అందుకు నిరాకరించింది. దాంతో తన సౌందర్యాన్ని, తనలోని భౌతిక కాంక్షలని, కామ వాంఛలని, ఆమె తన భర్త పట్ల విధేయతగా ఉండాలన్న కోరికతో త్యాగం చేసేసింది. అతనితో వైవాహిక జీవితం ద్వారా తనకి దొరకాల్సిన సుఖాన్నే ఆమె దయాగుణంతో త్యాగం చేసింది. ఈ విధంగా ఆమె ఫ్రాన్స్‌లో పుట్టినప్పటి ఆ కర్మబంధాలనించి తనని తాను ఈ జీవితంలో విముక్తి చేసుకుంది. ఈ విధంగా 600 ఏళ్ల క్రితం ఆమె ఆత్మ తనకి తాను పెట్టుకున్న పరీక్షలో ఈ జన్మలో ఉత్తీర్ణురాలైంది. అయితే ఆమెకి ఆ జన్మలో తను చేసిన కర్మ ఫలితాన్ని ఆమె భర్త ఈమె ప్రమేయం లేకుండా అనుభవిస్తున్నాడు.

"పగ మీదే కావచ్చు కానీ ప్రతీకారం నాది. దాన్ని నాకు వదలండి. నేను అమలు పరుస్తాను. ఎవరు ప్రతీకారం (పాపం) చేస్తే వాళ్లే దానికి శిక్ష అనుభవించాలి." అన్న ఏసుక్రీస్తు మాటలు ఈ సంధర్భంలో గుర్తు చేసుకోవచ్చు.

**మనకి ఎవరు ద్రోహం చేసినా తిరిగి మనం వారికి ప్రతీకారం చేయకపోతే, ఓరిమిని వహించగలిగితే, అది మన ఆత్మోన్నతికి దారి తీస్తుంది. ఆత్మ సాక్షాత్కారానికి అది త్వరగా చేరుస్తుంది. మనకి ద్రోహం చేసిన వారిని, వారి యొక్క కర్మ బంధం విడువకుండా వెంటనేనో, మరో జన్మలోనో తప్పక శిక్షిస్తుంది.**

ఈ నిజాన్ని గ్రహించి, వారికి తగిన శిక్షపడే విషయం ప్రకృతి లేదా దైవం చూసుకుంటారని బదులు తీర్చుకోగలిగే అవకాశం ఉండీ ఉదాసీనంగా ఉండగలిగేవారు ఆధ్యాత్మిక జీవితంలో అనేక డబుల్ ప్రమోషన్స్‌తో పురోగమిస్తారు. ఈ కారణంగానే క్షమాగుణాన్ని ప్రతీ మతం ప్రోత్సహిస్తుంది.

ఏ విషయంలోనూ తన మీద పగ లేదా ప్రతీకారం కలిగే విధంగా తన జీవిత భాగస్వామితో భార్యా/భర్తలు ప్రవర్తించకూడదని కూడా పై ఉదంతం ద్వారా మనమంతా నేర్చుకోవచ్చు. లేదా కార్మిక్ బంధంలో చిక్కుకుని తిరిగి దాన్ని తీర్చుకోవడానికి మళ్లీ ఏదో జన్మలో భార్యభర్తలుగా పుట్టాల్సిన అవసరంలో చిక్కుకోవాల్సి వస్తుంది. శ్రీ మారెళ్ల శ్రీ రామకృష్ణ మాస్టారు మీ కుటుంబ సభ్యులకి ఏదైనా ఒకసారి చెప్పిచూడండి. వాళ్లు వినలేదా ఫోర్స్ చేయవద్దు అని అనేకసార్లు మనల్ని హెచ్చరించడం వెనుక రహస్యంగా ఈ కేసుని తీసుకోవచ్చు. లేకపోతే మనం కర్మబంధంలో చిక్కుకుని తీరతాము.

ఇంకో కేసు. ఇందులో కూడా ఫ్రాన్స్‌లో అదే కాలంలో భార్య చేత బలవంతంగా ఛేస్టిటీ బెల్ట్‌ని తొడిగించిన భర్త, వ్యతిరేకించిన భార్యలు తిరిగి ఈ జన్మలో భార్యభర్తలుగా పుట్టారు. అయితే ఇక్కడ ఆ కర్మఫలం అనుభవించిన తీరు మరో రకంగా ఉంది.

ఈ జన్మలో ఆ భార్యకి సెక్స్ అంటే భయం. వివాహమై ఎనిమిదేళ్లయినా ఆమెకా భయం పోక అతన్ని దగ్గరకి రానివ్వదు. భర్త మాత్రం సహనం, ఓపిక గల, అర్థం చేసుకోగల స్వభావం గల వ్యక్తి. గత జన్మలో చేస్టిటీ బెల్ట్ ద్వారా తనని నిర్బంధించిన భర్తకి అతని కర్మకి, ఆమె ద్వారా ఈ విధంగా ప్రతిఫలం ముడుతోంది. అందగత్తె అయిన భార్య, కానీ ఏం లాభం? విపరీతమైన భయం వల్ల ముట్టుకోనివ్వదు. తన చేత ఛేస్టిటీ

బెల్ట్‌ని బలవంతంగా తొడిగించినందుకు ఆ జన్మలో ఆమెకి కలిగిన భావన ద్వేషం. ద్వేషం ఎప్పుడూ కర్మబంధంలో చిక్కుకునేలా చేస్తుంది. ఆనాటి ఆ ద్వేషమే ఈనాడు భయం రూపంలో వ్యక్తం అవుతోంది. ఆనాడు ఆమె తన భర్తని క్షమించి ఉంటే, ఈనాడు ఆమెకీ భయం ఉండేది కాదు.

ఏది జరిగినా ‘నా కర్మ’ అనుకుని ఊరుకోవాలి కానీ వ్యక్తుల మీద ప్రతీకారం, ద్వేషం పెంచుకోకూడదన్న సిద్ధాంతాన్ని హిందూ కర్మ సిద్ధాంతం బోధిస్తుంది. ఇండియాలో పుట్టిన చాలా మంది హిందువుల ఆలోచనా ధోరణి ఇలాగే ఉంటుంది. అయితే పాశ్చాత్యులు దీన్ని తరచూ ఎద్దేవా చేస్తూ ఉంటారు. ఈ నా కర్మ అనుకోవడం వల్ల హిందువులు నిర్వీర్యులు అయ్యారు అన్న విమర్శని అనేకమంది చేసారు. అలాకాక తిరుగుబాటు ధోరణితో ఆలోచించే వారంతా కర్మబంధంలో చిక్కుకుంటారని, నా ఖర్మ అనుకుని ద్వేషభావం లేదా ప్రతీకార భావం లేకుండా మనసుని సరిపెట్టుకోగలిగితే తాము కర్మబంధంలో చిక్కుకోరని, అయినప్పటికి, తమని అన్యాయం చేసిన వారికి శిక్షలు పడతాయని ఈ కేసుని బట్టి గ్రహించవచ్చు.

**మనం నా ఖర్మ అనుకొని, దేన్నయినా ఓర్మితో భరించగలగడం ఆత్మోన్నతికి సరైన మార్గం.**

భార్యభర్తలలో ఒకరికి అక్రమసంబంధాలు ఉండడానికి కారణం పూర్వజన్మ కర్మ బంధం వల్ల అవచ్చని ఈ క్రింది మూడు కేసులు స్పష్టం చేస్తున్నాయి.

ఇద్దరు పిల్లల తల్లి అయిన ఓ ఇల్లాలి భర్తకి గత 8 ఏళ్లుగా మరో స్త్రీతో అక్రమ సంబంధం ఉంది. అది రెండేళ్ల క్రితమే ఈమెకి తెలిసింది.

“నేనెందుకు ఇలా బాధపడాలి?” అని ఆమె కేసీని ప్రశ్నిస్తే, ఆయన జవాబు.

“ఎందుకంటే, నువ్వు నీ పూర్వజన్మలో ఇలాగే ప్రవర్తించావు కాబట్టి.”

అలాగే మరో స్త్రీ పూర్వ జన్మలో ఫ్రాన్స్ దేశంలో పుట్టి తన సుఖం మాత్రం చూసుకుంటూ స్వార్థ రహితంగా అక్రమ సంబంధాలలో మునిగి తేలేది. ఆమెకి ఆ జన్మలోని ప్రధాన ప్రియుడు ఈ జన్మలో భర్త. అతనితో ఆమె నేడు అలాంటి సంధర్భాన్నే ఎదుర్కొంటోంది.

మూడో కేసులోని ఆమె భర్త తాగుబోతు, తిరుగుబోతు. ఎంత తిరుగుబోతంటే, తమ ప్రియురాళ్లని తాగిన మత్తులో ఇంటికి తెచ్చుకునే వాడు. అయితే భార్య ఎంతో సహనంగా అన్నీ భరిస్తూ ఉండేది. ఆమెకి అతని వల్ల తరచు గుప్త రోగాలు కూడా అంటుకునేవి.

కేసీ రీడింగ్స్ ప్రకారం ఆమె గత జన్మలోని తన కర్మబంధాలని ఈ విధంగా వదిలించుకుంటోంది. గత జన్మలో ఆమె పెళ్లికాని తల్లికి జపనీస్ కూతురుగా పుట్టింది. అయితే ఫ్రెంచ్ నావికులకి పుట్టడంతో ఆమె జపాన్‌లో చిన్న చూపు చూడబడడంతో, యుక్తవయస్కురాలయ్యాక తిరుగుబోతుగా మారింది. ఫలితంగా ఆమె ఓ మగాడి నుంచి అంటుకున్న గుప్తరోగాలని తిరిగి వేరే మగవాళ్లకి అంటించేది. ఆ కర్మల వల్ల ఆమెకి ఈ జీవితంలో ఈ రకం వైవాహిక జీవితం లభ్యమైంది.

దీన్ని బట్టి ఓ జన్మలో తిరుగుబోతుగా ఉంటూ తన జీవిత భాగస్వామిని బాధపెట్టిన వారు మరు జన్మల్లో తప్పకుండా అదే విధంగా కర్మ బంధం ప్రకారం తిరిగి బాధని అనుభవించి తీరాలని తెలుతోంది. అయితే ఇలాంటి అన్ని కేసులూ పూర్తిగా పూర్వజన్మ కర్మ బంధాల వల్లే కలిగాయనుకోకూడదు. కృష్ణుడు రాధని తన అక్రమ సంబంధాలతో బాధిస్తే, గత జన్మలో రాధ అలా ప్రవర్తించబట్టి అయి ఉండకపోవచ్చు. కృష్ణుడికి ఈ జన్మలోనే ఆ భావాలు కలిగి అలా ప్రవర్తిస్తూ ఉండవచ్చు. కృష్ణుడు ఈ జన్మలో నాటుకుంటున్న ఈ కర్మబంధాన్ని భవిష్యత్‌లో ఏదో జన్మలో అనుభవించవచ్చు. ఒకోసారి ఈ జీవితంలోని చర్యకి అది ఈ

జీవితంలోని ప్రతిచర్యే కావచ్చు. కర్మ ఆలస్యం లేకుండా వెంటనే ఫలితం జరిగి కర్మ పరిపాకం కావచ్చు. ఎడ్గర్ కేసీ లాంటి క్లైయర్‌వాయెంట్ చెప్పడానికి ఉన్న పక్షంలోనే వీటన్నింటికీ అసలు కారణం మనకి బోధపడుతుంది.

కొందరికి కేసీ విడాకులు తీసుకోమని సలహా ఇచ్చాడు. మరికొందరికి వద్దని, కర్మబంధం పూర్తిగా అనుభవించమని సలహా ఇచ్చాడు. అయితే ఎవరికైతే పిల్లలు లేరో వాళ్లకి మాత్రమే విడాకులు తీసుకోవచ్చని సలహా ఇవ్వడం జరిగింది. లేదా పిల్లలు ఉన్నా, విడాకుల వల్ల పిల్లలకి మంచి జరగవచ్చన్న పరిస్థితిలోనే విడాకులకి ఆమోదముద్ర పడేది. అయితే ఆ జీవిత భాగస్వామి కర్మబంధం పూర్తిగా అనుభవించి, అందులోంచి బయట పడి ఆత్మోన్నతి పొందిన సంధర్భంలోనే విడాకులకి కేసీ అంగీకరించే వాడు. లేకపోతే "ఈ భూమి మీదకి నువ్వు రావడానికి ఏది సరైన కారణమో అది పూర్తవనంత వరకు విడాకులు వద్దు" అని సలహా ఇచ్చేవాడు. గత జన్మలోని తన స్వార్థం వల్ల ఏర్పడ్డ కర్మబంధం పూర్తయ్యే దాకా ఎంతటి విషాదకరమైన వైవాహిక బంధంలో చిక్కుకున్నా విడాకులని కేసీ సమర్థించేవాడు కాదు. ఈ జన్మలో అది తప్పించుకున్నా తర్వాతైనా ఆ అనుభవం పూర్తి చేయాల్సిందే కదా.

ఆధ్యాత్మిక పరిపూర్ణతకి వైవాహిక జీవితంలో ఓ భాగస్వామి తన స్వార్థ పూరితమైన స్వప్రయోజనకరమైన ఆనందం కోసం కర్మ చేయకూడదు అన్నది బేసిక్ రూల్‌గా, వీటన్నింటినీ క్రోడీకరించి మనం సూత్రంగా తీసుకోవచ్చు. తన భాగస్వామికి తెలియకుండా ఇంకొకరితో అక్రమ సంబంధం పెట్టుకున్నా, లేదా భార్యకి ఛేస్టిటీ బెల్ట్ బలవంతంగా తొడిగినా అది స్వార్థ పూరితమైన, స్వప్రయోజనకరమైన ఆనందం కోసమే కాబట్టి కర్మబంధంలో చిక్కుకుంటారు.

మన జీవిత భాగస్వామి మనతో అలా ప్రవర్తించినా వారిలోని ఆ బలహీనతని క్షమించి సహనంగా ఓర్మితో ఉండగలగడం నేర్చుకోవాలి. లేదా అందువల్ల జనించే ద్వేషం, పగలాంటి వ్యతిరేక భావాల వల్ల మనం వారితో తిరిగి కర్మబంధంలో చిక్కుకుంటాము.

వివాహం ద్వారా భార్యాభర్తలు జీవితం అనే నాటక రంగంలో పాత్రధారులవుతారు. అయితే ఈ నాటక రంగంలో ఇది తొలి అంకం కాదు. అలా పూర్వం ఎన్నో జీవితాలలో వారు ఇవే పాత్రలని పోషించిన వారై ఉండవచ్చు. వాటి ఫలితంగానే ఈ జీవితం అనే నాటకరంగంలో, గతంలో నటించిన అంకాలకి ఫలితంగా కొత్త అంకాన్ని ప్రారంభిస్తూ ఉండవచ్చు.

వారిరువురూ, ఇలా తరచూ జీవితం అనే నాటకరంగం మీద కలుసుకోవడం ఆపాలంటే, కనీసం ఈ జీవితంలోనైనా వారి పట్ల ద్వేషభావం కలగకుండా, ప్రేమ భావం కలిగేలా జాగ్రత్త తీసుకోవడం ఒకటే దారి.

**ప్రేమ ఆధ్యాత్మిక పరిపూర్ణత్వానికి దారి తీస్తే, ద్వేషం కర్మబంధానికి దారి తీసి, పరిపూర్ణత్వానికి మనల్ని దూరం చేస్తుంది.**

ఇలా ఒకో జీవిత కర్మ బంధం వదిలించుకో గలగడమే ముక్తికి మార్గం. ఎందుకంటే నాటకానికి స్టేజి మాత్రమే ఇక్కడ ఉంది కానీ, కథ, డైలాగ్స్, సీన్స్ లేవు. అవి మన చేతిలోనే ఉన్నాయి. ఈ జీవితంతో నాటకానికి అంతిమ గీతం పాడే తాళం చెవి మన దగ్గరే ఉంది అని పై కేసులన్నింటినించి మనం పాఠంగా స్వీకరించవచ్చు.

## అధ్యాయము - 4

## కొందరికి పెళ్లి ఎందుకు కాదు?

కొందరు అవివాహితులు ఎడ్గర్ కేసీని తాము ఎవరిని వివాహం చేసుకోవాలి? అని ప్రశ్నించారు. బదులుగా కొందరికి ఫలానా వ్యక్తిని చేసుకోమని చెప్తే, కొందరికి అతనితో మీకు గత జన్మ బంధం ఉంది, అయినా అది వివాహం ద్వారా తీరడం కష్టం కనక వద్దు అని సలహా ఇచ్చేవాడు. మరికొందరికి మీరు పేర్కొన్న వారిలో ఎవరిని చేసుకున్నా ప్రమాదమే అని, అయినా అది మీరు స్వయంగా నిర్ణయించుకోవలసి ఉంటుంది అని చెప్పేవాడు.

కర్మ బంధం ఉన్న అందరికి వివాహం ఖచ్చితంగా అవుతుంది అని చెప్పలేము అని ఎడ్గర్‌కేసీ సలహా ఇస్తూ, రెండు జన్మలగా మీరు భార్యాభర్తలుగా ఉన్నారు కాబట్టి చూడగానే ఒకరి పట్ల ఒకరికి ఆకర్షణ కలగడం సహజం. కానీ భౌతిక ఆకర్షణ అంత ముఖ్యం కాదు. మీ ఇద్దరి ఆదర్శాలు కలిసాయో లేదో ముందు తెలుసుకోండి. ఆదర్శాలు కలవక పోతే మీ వివాహం భగ్నం అవుతుంది అని సలహా ఇచ్చేవాడు. అయితే ఎవరిని చేసుకున్నా సరే వారికి తీర్చుకోవాల్సిన కర్మబంధం ఉండటం వల్లనే వివాహం జరగుతుందని ఎడ్గర్‌కేసీ రీడింగ్స్ అన్నీ తెలియచేస్తున్నాయి.

అంటే ఓ డజను మందిలో ఎవరిని వివాహం చేసుకోవాలి అన్నది " గుంజకి కట్టిన గుర్రం థియరీలోలా మనిషి ఫ్రీ విల్‌ని బట్టే జరుగుతుందని స్పష్టం అవుతున్నది. (గుంజకి కట్టిన గుర్రం తను తిరగగలిగే పరిధిలోని ఏ గడ్డినన్నా తినవచ్చు. పరిధి ఆవల ఉన్న గడ్డిని తినలేదు అది.) అలాగే

**"మనిషి తన ప్రారబ్ధ కర్మల పరిధిని దాటి పని చేయలేడు. అంటే ఎక్కువ కేసులలో పెళ్లిళ్లు స్వర్గంలో జరుగుతాయి అన్నది నిజం అని తెలుతోంది."**

సమాజంలో ఎందువల్లో కొంతమందికి వివాహాలు కాకుండా ఉండిపోవడం మనం చూస్తూ ఉంటాము. వాళ్లకి ఎందుకు వివాహాలు కావు? వాళ్లకి గత జన్మలలో ఎవరితోనూ కర్మబంధాలు లేవా? ఆరోగ్యం, అందం, ఐశ్వర్యంలాంటి అన్ని క్వాలిఫికేషన్స్ ఉన్నా కొందరికి ఎందుకు వివాహం కాదు?

దీనిలో సెక్స్ కోణం ముఖ్యం అయినది. పెళ్లి కానందువలన సెక్స్ సుఖాన్ని ఈ సమాజంలో ఆడవాళ్లు కోల్పోతారు. మగవాళ్లకి ఈ బాధ సాధారణంగా ఏ దేశంలోనూ ఉండదు. ఒకవేళ అందుకోసం పురుషుడిలా స్త్రీ సాహసించినా, సమాజంలో గౌరవాన్ని కోల్పోతుంది.

ఒంటరితనం అనుభవించే అవివాహితులు అయిన కొందరి విషయం చూద్దాం. దీనికి గల కర్మబంధాలు ఎలా ఉంటాయి అనే దాని మీద వివరణలు మనకి ఎడ్గర్‌కేసీ రీడింగ్స్‌లో దొరుకుతాయి.

న్యూయార్క్ సిటీలో సెక్రటరీగా పని చేసే 47 ఏళ్ల ఓ అందమైన మహిళ తన వివరాలని ఇలా తెలిపింది. మొదటి సారి వివాహం అయిన కొద్దికాలానికే భర్త మరణించాడు. రెండోసారి తనకన్నా తక్కువ వయస్సు ఉన్న ఒకతనిని చేసుకుంది కానీ అది మూడు ఏళ్లలోనే విడాకులతో ముగిసింది. ఆమెకి పిల్లలు లేరు. తండ్రి వైపు నుంచి కానీ, తల్లి వైపు నుంచి కానీ ఎవరూ బంధువులు లేరు. పూర్తిగా ఒంటరిది. మూడో వివాహం చేసుకునే ఉద్దేశ్యం ఉంది కానీ, సరైన అవకాశం రావడం లేదు.

"ఇలా ఒంటరితనం నా మీద ఎందుకు రుద్దబడింది?" అని ప్రశ్నిస్తే, అందుకు ఓ కర్మబంధం కారణం అని ఎడ్గర్‌కేసీ జవాబు ఇచ్చాడు.

రెండు జన్మల క్రితం ఆమె నార్వేలో పుట్టినప్పుడు ప్రస్తుత జన్మలో అనుభవించే దుఃఖానికి కారణమైన కర్మబంధాన్ని సృష్టించుకుంది. అప్పుడు ఆత్మహత్య చేసుకుంది. ఆ జన్మలో ఆమె ఇద్దరు పిల్లల తల్లి. ఏవో

కొన్ని కారణాల వలన సమాజంలో సాటివారి ముందు తలవంపులు తెచ్చే ఏవో పనులు చేయబట్టి ఈమె ఆ బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుంది. దాని ఫలితమే ప్రస్తుత జన్మలోని ఈ బాధలు.

ఆ జన్మలో ఆమె తన భర్తకి తోడుగా ఉండే బదులు తన స్వార్ధంతో ఆత్మహత్య చేసుకుంది కానీ ఆ జన్మలో పిల్లలకి తల్లి ప్రేమని, భర్తకి సపోర్ట్‌ని అందించలేదు. అందువల్ల వైవాహిక జీవితం ఈ జన్మలో పొందకపోవడం వలన, ఈ జన్మలోని ఈ అనుభవంతో వాటి విలువ తెలిసి వచ్చి ఆత్మోన్నతి చెందుతుంది.

**"ఆత్మహత్య మహా పాతకం"** అన్నది ఎందుకో ఈ కేసు ద్వారా అర్థం చేసుకోవచ్చు.

**"దేవుడు మనకి వరంగా ఇచ్చిన జీవితాన్ని అనుభవించకుండా, ఆత్మహత్య ద్వారా అంతం చేయడం అనే చర్యకి ఎవరికి వారే జవాబుదారిగా ఉంటారు.**

ఇలాగే ఒంటరితనం అనుభవించే ఇంకొకరి మహిళ కేసు చూద్దాం. కిండర్‌గార్డెన్‌లో పిల్లలకి టీచర్‌గా పని చేసే ఓ మహిళకి వివాహం చేసుకోవాలనే ప్రగాఢమైన కోరిక ఉంది. ఈవిడ ఒక్కతే కూతురు. ఈవిడకి చిన్నప్పుడే తల్లితండ్రులు మరణించారు. ఇద్దరు వృద్ధులైన అత్తల దగ్గరే పెరిగింది. దానితో చిన్న వయస్సు వారితో ఈమె ఎడ్జెస్ట్ కాలేకపోతోంది. ఫలితంగా ఆమె ఒంటరిగా ఫీల్ అవుతూ ఇంట్రోవర్ట్‌గా మారిపోయింది. ఆమె ఒకసారి ప్రేమలో పడింది గానీ అది కేవలం భౌతికమైన ఆకర్షణ అని తేలాక అది ఆగిపోయింది. స్కూల్లో ఆమె తన విధులని ఎంతో చక్కగా నిర్వర్తిస్తోంది. అయితే తన జీవితంలోని ఖాళీ వల్ల ఆమె కొన్ని వారాల పాటు డిప్రషన్‌కి గురి అయ్యి మళ్లీ మామూలుగా అవుతూ ఉంటుంది. ఒక్కోసారి ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన కూడా చేసింది. అయితే అందంగా, ఆకర్షణీయంగా ఉండే ఆమె వెనుక ఇంత బాధ ఉందని ఎవరికీ తెలియదు.

ఎడ్గర్‌కేసీ రీడింగ్స్ ప్రకారం ఈమె నాలుగు జన్మల క్రితం పర్షియా దేశంలో జన్మించి ఉండగా బెడోయిన్ జాతి వారు ఈమె దేశం మీద దాడి చేసారు. ఆమె ఆ దేశ రాజు కుమార్తె. బెడోయిన్స్ తమ వెంట తీసుకుని వెళ్లిన ఆడపిల్లలలో ఈమె కూడా ఒకతి. ఆమె ఆ దేశపు షేక్ క్రింద ఉండే ఒకరి ద్వారా ఓ కూతురిని కన్నది. ఆ తరవాత ఆమె ఆత్మహత్య చేసుకున్నది. ఫలితంగా ఆమె బిడ్డ, ఆ యుద్ధ వాతావరణంలో ఎలాంటి ప్రేమకీ నోచుకోక పెరిగింది. చివరికి ఓ మతప్రభోధకుడు ఆ పాపని చూసి జాలిపడి తన వెంట తీసుకుని వెళ్లి పెంచుకున్నాడు.

తనను ఉంచుకున్న వ్యక్తి చెప్పినట్లు వినడం ఇష్టం లేక ఈమె ఆత్మహత్య చేసుకుంది. దానితో తనను తాను స్వార్ధపరంగా తృప్తి పరచుకోవడానికే ఆత్మహత్య చేసుకుంది తప్ప, ఆత్మరక్షణకో, తన దేశం కొరకో ఆ పని చేయలేదు. పైగా తన కూతురి భవిష్యత్‌ని తీర్చిదిద్దాల్సిన భాధ్యతని కూడా విస్మరించింది.ఆ ఆత్మ గుణపాఠం నేర్చుకోవడానికి అనువుగా ఈ జన్మలో వివాహము, పిల్లలు ఇవ్వబడలేదు.

**"తాము చెప్పేది ఎవరూ వినలేదని, లేదా తాము అనుకున్నది కాలేదని అన్న భంగపడ్డ గర్వం, స్వార్థం కారణంగా ఎవరు ఆత్మహత్య చేసుకున్నా, ఏ కారణం వల్లనయితే ఆ పని చేసుకుంటారో, వచ్చే జన్మలో ఆ కారణం వల్లే ఈ విధంగా బాధపడే జీవితంలోకి తోసివేయబడతారని దీని ద్వారా అర్థం చేసుకోవచ్చు. "**

అంతేకాక ఆమె నేటి మనస్తత్వం కూడా, స్వతంత్రంగా జీవించడం, ఒకరి మాట వినక తనకి తోచింది చేయడం. దాంతో మగవాళ్లు ఆమెని తమ భార్యగా భరించలేము అని దూరం అవుతున్నారు.

తమాషా ఏమిటంటే ఆమెకి స్వంత బిడ్డల మీద మోజు అధికం. వృద్ధులయిన అత్తల ప్రాపకం లేకపోతే కనీసం దత్తత అయినా తీసుకునేది. కానీ అత్తలు అందుకు అంగీకరించలేదు.

**"నువ్వు ఈ జన్మలో ఆత్మహత్యకు ఆలోచన చేయడం, గత జన్మలో ఆ పని చేయడం వల్లనే. మళ్లీ అదే తప్పు చేస్తే, ఇప్పుడు అనుభవించాల్సిన బాధని ముందు జన్మలలో తప్పక అనుభవించి తీరాలి కనుక ఆ పని చేయవద్దు అని నా ప్రార్ధన" అని ఎడ్గర్‌కేసీ చెప్పాడు. ఎడ్గర్‌కేసీ ఇంకా ఇలా చెప్పాడు.**

"ఇకనైనా ప్రేమించడం నేర్చుకుని, గర్వాన్ని, స్వతంత్ర భావాన్ని పక్కన పెట్టి నీకు తటస్థ పడిన వారందరిని ప్రేమించడం నేర్చుకుంటే నీ భవిష్యత్తులో నీకు వివాహం తప్పక అవుతుంది. ఈ జన్మ నీకు పరీక్షా సమయం కాబట్టి, గత ఐదేళ్లుగా ఏ పురుషునితోనూ ఎలాంటి సంబంధం లేకుండా పోయింది" అని కేసీ చెప్పాడు.

ఇలాంటి కేసులే మరో మూడు ఉన్నాయి. భర్త, పిల్లల అదృష్టం లేకుండా ఒంటరిగా జీవిస్తున్న ఆడవాళ్లు గత జన్మలలో పెళ్లయి ఉండి ఆత్మహత్య చేసుకున్నారు. మరి గత జన్మలో ఆత్మహత్య చేసుకున్న కొందరికి ఈ జన్మలో వాటి ఫలితం అంతగా కనిపించలేదు. బహూశా రాబోయే జన్మలలో వారు దాని ఫలితాన్ని అనుభవించాల్సి ఉండవచ్చు.

అయితే పెళ్లికాని వారంతా గతజన్మలలో ఆత్మహత్య చేసుకున్న వారే అయి ఉండాలని లేదు. మరి ఏ ఇతర కర్మబంధాల వల్లనైనా అది జరగవచ్చు అని ఎడ్గర్‌కేసీ రీడింగ్స్ ద్వారా తెలుస్తోంది. ఉదాహరణకి ఓ కేసు చూద్దాం.

40 ఏళ్ల ఓ యువతి 8వ క్లాసు దాకానే చదువుకుంది. ఫాక్టరీలో యంత్రాలతో పని చేస్తూ జీవనోపాధి సంపాదించుకుంటోంది. బాగా లావుగా ఉంటుంది ఆమె. ఆమె దుస్తులు ఎక్కువ కాలం మన్నడానికి అనువుగా ఉండడంతో ఆమెలోని స్త్రీత్వాన్ని అవి మరుగుపరిచే విధంగా ఉంటాయి. ఆమె మనస్తత్వం దాదాపు పురుషుడి మనస్తత్వం లాంటిది. ఆమెకు భగవద్భక్తి మెండు. ఇది ఆమె కుటుంబసభ్యులకి నచ్చలేదు. నిజానికి ఆమె డైటింగ్ చేసి, చక్కని దుస్తులు వేసుకుంటే అందగత్తెగా మారగలదు. గత జన్మ ఫలితంగా ఈమె వివాహం కాక ఈ జన్మలో ఒంటరితనం అనుభవిస్తోంది.

అట్లాంటిస్ పీరియడ్‌లో ఓ జన్మలో ఆమె ఒక పెద్ద పదవిలో ఉన్న స్త్రీగా జీవించి ఉన్నప్పుడు, విఫలమైన ఓ ప్రేమ వల్ల ఆమె ఎంతో మానసిక వేదనని అనుభవించింది. ఫలితంగా ఆమె మరో పురుషుడిని ప్రేమించలేక పోయింది. మరోసారి పురుషుడిని ప్రేమించి కోరి బాధ తెచ్చుకోకూడదు అన్న మనస్తత్వం ఆ జన్మలో స్థిరపడిపోయింది. ప్రేమాయణంలో చిక్కుకోకుండా, స్వతంత్రంగా ఉండడం మంచిదన్న అభిప్రాయం ఆమెలో పని చేస్తుండడంతో, ఆమెకు వివాహం కాలేదు. అయితే ఈ జన్మలో పొందడానికి ఆ జన్మలో ఆమె ఎలాంటి స్వార్ధపూరిత దుష్కర్మ చేయలేదు. అయితే పైన పేర్కొన్న విధంగా కొనసాగే ఆదర్శం పని చేసి ఆమె వివాహం చేసుకోలేదు. గతజన్మలోలా తన ప్రేమను పురుషుడికి ఇచ్చి భంగపడకూడదన్న దాని మీద అప్పుడు తీసుకున్న ఆ నిర్ణయం ఇంకా పని చేస్తూ ఉండడంతో, ఆమె ఈనాటికి అవివాహితగా మిగిలి పోయింది.

అమె నిర్ణయం భగవంతుడి మీద ప్రేమతో మతపరంగా సన్యసించడానికి కాదు. మరి ఏ ఇతర కారణం వ్లల కాదు. కేవలం స్వార్ధపూరిత కారణం వల్ల కావడం వల్ల ఈ జన్మలో ఇలా ఆ ఫలితానికి కట్టుబడి ఉంటోంది.

ఆమెకి వివాహం కావాలంటే, పురుషద్వేషం మాని, పురుషులని ప్రేమించడం ఒక్కటే మార్గం అని కేసీ సలహా ఇచ్చాడు.

మరికొన్ని కేసులలో ఆడవాళ్లకి వివాహం జరగకుండా ఒంటరిగా ఉండిపోవడానికి కారణం గతజన్మలలో వారు మగాళ్లుగా ఉండి, ఈ జన్మలో ఆడవారిగా పుట్టినా, మగవాళ్ల మనస్తత్వ లక్షణాలు కలిగి

ఉండడమే. అంటే దాదాపుగా ఆడశరీరంలో, మగవాడి ఆత్మ ఉండడంలాంటిది.

**ఏది ఏమైనప్పటికీ, వివాహం కాకుండా ఉండేవారి ఆత్మలు, ఈ జన్మలో వారి ఆత్మోన్నతి చెందడానికే అలా అయి ఉంటుందని ఈ కేసులన్నీ ఋజువు చేస్తున్నాయి.**

## అధ్యాయము - 5

## మనకి జన్మించే సంతానంతో గతజన్మల కర్మబంధం ఉంటుందా?

పిల్లలు తల్లితండ్రుల సొత్తు అన్నది అనాదిగా వస్తున్న సిద్ధాంతం. ఇందుకు కారణం తల్లి ఎన్నో బాధలు అనుభవించి, కని పెంచుతుంది. తండ్రి ఎంతో కష్టపడి పోషణకి అవసరమయ్యే ధనం సంపాదిస్తాడు. అంతేకాక తల్లితండ్రులు తమ బిడ్డకన్నా ఆర్థికంగా ధనవంతులు, శారీరిక శక్తి, వివేకము కలవారు కాబట్టి పిల్లలు వారి చెప్పుచేతలలో ఉండాలి అన్నది కూడా మనం అంతా నమ్మి పాటిస్తున్న విషయం.

కానీ ఆధ్యాత్మిక వాస్తవికతలో అది సత్యం కాదు. పిల్లలకన్నా తల్లితండ్రులు ఆధిక్యత కలవారు అన్నది ఆధ్యాత్మిక వాస్తవికత ఒప్పుకోదు. బ్రతికున్న ప్రతీవారు ఆధ్యాత్మిక కుటుంబంలోని సభ్యులు మాత్రమే. పిల్లల మీద తల్లితండ్రుల ఆధిక్యత సంగతి అలా ఉంచండి. **అసలు పిల్లలని తల్లితండ్రులు సృష్టించలేరు. వారనుకుంటున్నట్లు పిల్లలు తల్లి తండ్రుల సృష్టి కానే కాదు అన్నది ఆధ్యాత్మిక నిజం. పిల్లల పుట్టుకలో వారు కేవలం పరికరాలుగా మాత్రమే ఉపయోగ పడుతున్నారు.** ఓ గోప్యమైన చర్య ద్వారా, వారికి తమ జీవిత భాగస్వామితో మైధునంలో పాల్గొనాలన్న కాంక్ష కలుగుతుంది. ఫలితంగా ఓ గోప్యమైన చర్య ద్వారా తల్లి ఓ శరీరానికి జన్మనిస్తుంది.

**"శరీరంలో జరిగే ప్రతిక్రియ, తద్వారా పిల్లలు పుట్టడం ఓ గోప్యమైన, దివ్యశక్తి వల్లే సంభవిస్తోంది తప్ప మనిషి తన స్వశక్తితో చేయడం లేదు".**

మనందరి శరీరాలలో ఆత్మలు ఉన్నట్టుగా మరో ఆత్మ ఆ శరీరంలోకి ప్రవేశిస్తుంది. తాత్కాలికంగా ఆ శరీరం మాట్లాడలేక, నిస్సహాయ స్థితిలో ఉండడంతో, తల్లితండ్రులు దానికి సేవ చేస్తూ, తమ బిడ్డల శరీరం తమ సొంతం అనుకుంటారు. అలా అనుకోవడం వల్లే వారు దాన్ని ఎంతో ప్రేమగా చూస్తూ, దాని ఉన్నతి కోసం ఎన్నో త్యాగాలు చేస్తారు.

**" బిడ్డలు మన ద్వారా వస్తారు కానీ మన నుంచి కాదు "**

వారు మనతో ఉన్నా, మనకి చెందిన వారు కాదు. మనం ధనస్సు అయితే పిల్లలు బాణాలు. కానీ వాటిని ప్రయోగించే చేతులు మనవి కావు. ఏదో అదృశ్యశక్తివి.

ఈ నిజాన్నీ, అన్ని శరీరాల్లోని ఆత్మలు భగవంతుడిని నుంచే ఉద్భవించారు అన్న వాస్తవాన్ని అర్థం చేసుకుంటే అప్పుడు మనం మన బిడ్డలు మన సొంతం అనుకోవడం, వారి మీద ప్రేమ, అభిమానం, మమకారం కలగడం జరగవు.

**"కొన్ని ఆత్మలు పునర్జన్మ పొందడానికి ఉపయోగించే మార్గమే మనం అని కేసీ తన రీడింగ్స్‌లో స్పష్టం చేసాడు."**

ఇందువల్ల అందుకు అవసరమయ్యే రతికార్యం పవిత్రమైన దైవత్వంతో కూడిన కార్యముగా పరిగణించాలని కేసీ చెప్పాడు (హిందూ మతం కూడా ఇదే బోధిస్తుంది). అయితే దురదృష్టవశాత్తు క్రిస్టియన్ మతం రతిని పాపంగా బోధించింది.

**"బుక్ ఆఫ్ జెనిసిస్"లో** మనిషి ఆడమ్ మరియు ఈవ్‌లు చేసిన పాపం వల్ల ఉద్భవించాడు అని

తప్పుగా బాష్యం చెప్పడంతో ఈ విపత్కరం జరిగింది. ఓ రీడింగ్‌లో కేసీ మైధునం గురించి ఇలా చెప్తాడు.

**"ఓ భౌతిక శరీరం మీద ఉండే ప్రేమ, మనిషి ఈ భూమి మీద నివసించి ఉండగా పొందే గొప్ప పవిత్రమైన అనుభవం."** ఈ విషయాన్ని కేసీ తన రీడింగ్స్‌లో అనేక సందర్భాలలో చెప్పాడు.

కొందరు ఇల్లాళ్లు తాము పిల్లలని కనాలను కుంటున్నామని సలహా కోసం వస్తే, ఎడ్గర్‌కేసీ వాళ్లకి ఆహారం, శారీరక పరిశ్రమ, వ్యక్తిగత లక్ష్యం విషయాలలో ఇచ్చిన సలహాలు ఒక అనుభవజ్ఞుడైన డాక్టర్ ఇచ్చే సలహాలతో సమానమైనవి. అయితే తన అద్వితీయ క్లెయిర్‌వాయెన్స్ శక్తితో ఏ శరీరానికి ఏది అవసరమో గ్రహించి సలహాలు ఇచ్చాడు. మంచి బిడ్డకి తల్లితండ్రులు కావడానికి వారు శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా తయారు కావాలని కూడా చెప్పేవాడు. పుట్టబోయే బిడ్డ క్యారెక్టర్‌పై విషయాల్లో తల్లి తండ్రుల ధృక్పధాన్ని బట్టి నిర్మించబడుతుంది అని కూడా కేసీ వివరించాడు.

అలాగే తల్లితండ్రులకి ఓ ఆత్మ బిడ్డగా పుట్టడం కూడా యాదృచ్ఛికంగా జరగదు అని, తల్లితండ్రులతో పూర్వజన్మల సంబంధం ఉంటుందని కూడా కేసీ రీడింగ్స్ స్పష్టం చేస్తున్నాయి.

**అయితే అరుదైన సందర్భాలలో తల్లితండ్రులలో ఎవరికీ తమ బిడ్డతో గత జన్మలలో ఎలాంటి కర్మబంధం లేదని, అయితే వారి కుటుంబం నేపధ్యం, ఆ బిడ్డకి ఆధ్యాత్మిక లేదా మానసిక అవసరాలకు సరిపడేలా ఉండడంతో వారికి పుట్టడం జరిగిందని కూడా కేసీ తన రీడింగ్స్‌లో వెల్లడించాడు.**

కొన్ని సంధర్భాలలో పుట్టిన బిడ్డకి, తల్లితండ్రుల ఇద్దరితో కాక, కేవలం ఒకరితోనే పూర్వజన్మలలో కర్మబంధం ఉందని కేసీ చెప్పాడు. (అంటే తల్లితండ్రులలో ఒకరికి తన బిడ్డ ఆత్మతో గతజన్మలలో ఎలాంటి కర్మబంధం లేకపోయినా, తన జీవిత భాగస్వామితో మాత్రమే ఉండబట్టి వారికి పుడతారు.) అలాంటప్పుడు ఎవరికైతే కర్మబంధం ఉందో, వారే బిడ్డకు ఎక్కువ దగ్గరగా ఉండడం జరుగుతుంది. ఇందుకు ఉదాహరణగా ఈ కేసు చూద్దాం.

తన భర్తకి, తన కొడుకు మీద అట్టే ఎందుకు ప్రేమ లేదని ఒకరు అడిగితే అందుకు కేసీ జవాబు, "గత జన్మలో ఎన్నడూ వారిద్దరి మధ్య ఎలాంటి బంధం లేదు కనుక. కానీ మీ ఇద్దరికి గతజన్మలో తల్లిబిడ్డల అనుబంధం ఉండబట్టి, నువ్వు నీ కొడుకుని నీ భర్తకన్నా ఎక్కువ ప్రేమిస్తున్నావు."

మరో కేసులో తక్కువ ఎటాచ్‌మెంట్‌గల తండ్రీకొడుకులు, గత జన్మలో అన్నాదమ్ములుగా జీవించారని కేసీ వివరించాడు. సఖ్యత లేని తల్లికూతుర్ల మధ్య సాధారణంగా గతజన్మల కర్మబంధం ఉండదు అని మరో కేసు ద్వారా తెలుస్తోంది. అయితే అన్ని సంధర్భాలలో ఇది వర్తించదు. ఇలాంటి సఖ్యత లేని మరో తల్లికూతుళ్ల విషయంలో కేసీ, "గత జన్మలో మీరు ఇరువురూ అక్కాచెల్లెళ్లు. ఆ జన్మలో మీకు పడేది కాదు. మీరు దెబ్బలాడుకుని విడిపోయారు. మళ్లీ కలవలేదు. అందుకని ఆ ద్వేషభావం పోనందువల్ల ఈ జన్మలో మీరు తిరిగి ఆ కర్మబంధం వల్ల ఇలా కలిసారు" అని చెప్పాడు.

దెబ్బలాడుకునే మరో తల్లికూతుళ్లు, గత జన్మలోఒకే పురుషుడిని కోరుకుని, ఆ కారణంగా బద్ధవిరోధులుగా విడిపోయి ఇలా పుట్టారు.

తన కొడుకు తనని డామినేట్ చేస్తున్నాడని ఓ తల్లి చేసిన ఫిర్యాదుకి కేసీ ఇచ్చిన జవాబు, "గతజన్మలో నువ్వు కూతురుగా, అతను తండ్రిగా జన్మించినప్పుడు నువ్వు అతన్ని డామినేట్ చేసిన ఫలం ఇది." గత జన్మలో భార్యభర్తలుగా జీవించిన ఇద్దరు, తమ కర్మబంధాన్ని అనుసరించి ఈ జన్మలో తండ్రి కూతుళ్లుగా పుట్టారు.

దీన్నిబట్టి ద్వేషం బంధమై ఒకరిని ఒకరు ద్వేషిస్తే, ఆ ఇరువురు తిరిగి మరుసటి జన్మలలో దగ్గర సంబంధీకులుగా పుట్టి తీరాలని అర్థం అవుతోంది.

**"కాబట్టి భవబంధాలు తొలగించు కోవాలంటే ఈ జన్మలో మనం ద్వేషించే వారి మీద కోపం పోగొట్టుకునే సాధన చేయగలిగితే ఈ ఆగామి కర్మ బంధం నుంచి విముక్తులము కావచ్చు అన్న పాఠంగా పై విషయాలను స్వీకరించడం వివేకమయిన విధానం. మనల్ని ఒకరు ద్వేషించకుండా ఉండేలా ప్రవర్తించడం నేర్చుకోవాలి, ఆచరించాలి.**

పై కేసుల వల్ల తేలేదేమిదంటే ఓ బిడ్డ ఫలానా తల్లితండ్రులకే పుట్టడానికి అనేక కర్మబంధాలు పనిచేస్తాయని తెలుస్తోంది. వాటిని మనస్సుకి ఎక్కించుకుని, ఈ జన్మలో మనం అలాంటి తప్పులు చేయకపోతే, ఈ జన్మలో మనకి సంబంధం గల ఎవరితోనూ మనకి కర్మబంధం ఉండదు. ఎందుకంటే బద్ధవిరోధుల ఒకరి కర్మ మరొకరికి ఫలంగా మారి, తిరిగి భవిష్యత్ జన్మలలో దగ్గరై తీరతారు.

తన 5 ఏళ్ళ కొడుకు స్వార్థపరుడని, తప్పు చేస్తే ఒప్పుకునే స్వభావం లేని వాడని, ఇతరుల మీద పెద్దగా ప్రేమ లేని వాడని, నేర స్వభావం గల వారి మీద మాత్రమే ప్రేమ చూపిస్తాడని ఓ తల్లి వివరిస్తే, ఆయన ఆ కుర్రాడి రీడింగ్‌లో ఇలా చెప్పాడు.

"గత జన్మలో ఇతను ఆవిరి యంత్రంతో పని చేసాడు. ముందు జన్మలో రసాయినిక ప్రేలుడు పదార్థాల వృత్తితో జీవించాడు. మరో జన్మలో మెకానిక్‌గా పని చేసాడు. అంతకు ముందు జన్మలో అట్లాంటిస్ ఖండములో ఎలక్ట్రిక్ ఇంజనీరుగా పని చేసాడు. వరసగా నాలుగు జన్మల పాటు సైన్స్‌తో జీవనం గడపడంతో అతనికి అందం, ప్రేమ, జీవితం మీద, జీవిత విలువల పట్ల అవగాహన లేదుకాబట్టి ఇలా అయ్యాడు. ఈ జన్మలో ఇతను చక్కని శాస్త్రజ్ఞుడు అవ్వచ్చు. కాబట్టి ఆ విధమైన చదువు నేర్పించండి."

పెద్దయ్యాక అతను ఎలక్ట్రిక్ ఇంజనీరుగా రాణించాడు. అయితే అతనికి ఈ జన్మలోని ఎవ్వరితో కర్మబంధాలు లేకపోవడం గమనించ దగ్గ విషయం. తండ్రి మతాధికారి, తల్లి దయగల ఇల్లాలు. అన్న ఇతరులకి సహాయంచేసే మనస్తత్వం కలవాడు.

"ఈ కుర్రవాడి ఆత్మ, జీవితపు విలువలను గత నాలుగు జన్మలలో నేర్చుకోలేదు కనక అందుకు అనువుగా ఉండే వాతావరణం ఉన్న ఈ కుటుంబంలో జన్మించాడు. ఇతను తన కుటుంబ సభ్యులు, ఇతరులకి సహాయపడడం రోజూ గమనిస్తాడు కాబట్టి, ఇతనికి ఈ జన్మలో ఆ ప్రభావం పట్టు బడుతుంది. మెటీరిలియస్టిక్‌గా మారిన ఆత్మ మానవత్వం నేర్చుకోవాల్సి ఉండడంతో అతనికి ఈ జన్మ వారి మధ్య లభించింది" అని కేసీ వివరించాడు. పెద్దయ్యే కొద్ది ఇతనిలోని స్వార్థం క్రమేపీ తగ్గింది.

మరో విశేషం పుట్టబోయే ఆత్మలకి తమ తల్లితండ్రులని ఎన్నుకునే స్వతంత్ర్యం ఉంటుందని  కూడా కేసీ అనేక కేసులలో స్పష్టం చేసాడు. అయితే ఆధ్యాత్మికంగా ఆట్టే ఎదగని ఆత్మలకి ఆ స్వాతంత్ర్యం లేదు. అందువల్ల ఆధ్యాత్మిక ఉన్నతిని పొందిన ఆత్మలకే తమ తల్లితండ్రులను ఎంపిక చేసుకునే స్వాతంత్ర్యం ఉంటుంది.

అయితే ఇక్కడ మనకో అనుమానం రావచ్చు. ఓ ఆత్మ బీదవాడైన ఓ గుడిసెవాసిగానో లేక కుష్టురోగులనో ఉన్న వాళ్లని ఎంచుకుని తల్లితండ్రులుగా ఎందుకు  చేసుకుంటున్నది? మంత్రులు, ఐఏఎస్, ఆఫీసర్లులాంటి వాళ్లని ఎందుకు ఎన్నుకోవచ్చు కదా? అంగవైకల్యం గల శరీరంలోకి ఆత్మ చూస్తూ, చూస్తూ ఎందుకు ప్రవేశించాలి? ఈ సంధర్భాన్ని అకస్మాత్తుగా మనిషి తను లావయ్యావని గ్రహించిన మనిషితో పోల్చవచ్చు. దుస్తులు పట్టక పోవడమో, లేదా ఈ కారణంగా ఓ స్త్రీ దగ్గరకు రానీయకపోవడమో లేక ఆఫీసు వారు ఇంత బరువు ఉంటే ఉద్యోగం తీసేస్తాము అనడమో, (ఎయిర్ హోస్టెస్‌లు నిర్ణీత బరువు

దాటితే వారికి ఆ బరువు తగ్గే దాకా విమానంలో ఎక్కడా డ్యూటీ చేయడానికి అనర్హులు) లాంటి ప్రెషర్స్ వస్తే తనకు అయిష్టమే అయినా తన బరువుని తగ్గించుకునే ఒక పద్ధతిని నిర్ణయించుకుని, ఆ ప్రకారం తన బరువుని తగ్గించుకుంటాడు. ఆ రకంగా అతనిలో అధిక బరువు తగ్గి ఆరోగ్యం అభివృద్ధి చెందుతుంది.

అట్లాగే ఆత్మ కూడా ఆత్మోన్నతికి బహూశా తమకు ఇష్టం లేకపోయినా ఇలాంటి నీచ జన్మలు పొందడానికి వెనకాడవు. మనిషి తనకి ఇష్టం లేనిది, మంచిని ఆశించైనా చేస్తాడు. అలా ఆత్మకు ఇష్టం లేని జన్మని కూడా మంచి ఫలితమైన ఆత్మోన్నతి కోసం తీసుకుంటుంది అని భావించవచ్చు.

కేసీ రీడింగ్స్ ప్రకారం ప్రతీ ఆత్మ తన పొందాలనుకున్న జన్మ విషయంలో భూమి మీద పరిస్థితులని, తల్లితండ్రులని ఆకళింపు చేసుకోగలదు. భవిష్యత్తులోని కొన్ని సంఘటనలను కూడా ముందే అవి చూడగలవు. తన ప్రారబ్ధ కర్మకి సంబంధించిన సంఘటనలను తప్ప మిగిలిన సంఘటనలని (మనిషి స్వతంత్ర భావంతో చేసేవి) చూడలేవు.

అయితే ఆత్మ అలా జన్మ తీసుకున్నాక, తను ఊహించిన విధంగా తల్లితండ్రులు కానీ, సంఘటనలు కానీ లేకపోతే ఇంక ఈ జన్మలో తను కొనసాగించలేడు అని గ్రహించి, ఆ శరీరంలో నుంచి ఆత్మ వెళ్లిపోవచ్చు. కారణం లేకుండా పిల్లలు మరణించే వ్యాధి ఒకటి ఉంది. (సిడ్స్,ఐ।ఈఐ - సడన్ ఇన్‌ఫాంటైల్ డెత్ సిండ్రోమ్. దీనికి కారణం ఇంతదాకా ఏ డాక్టరూ కనుక్కోలేదు). ఎలాంటి వ్యాధి లేకుండా అకస్మాత్తుగా చంటి పిల్లలు మరణిస్తుంటారు. బహూశా ఇది ఆత్మ ఆ జన్మ వద్దు అనుకుని వెళ్లిపోవడం కావచ్చు.

ఎడ్గర్‌కేసీ తన రీడింగ్స్ వల్ల ఇలా ఆత్మలు శరీరాలని వదిలివెళ్లడం చాలా మామూలు విషయం అని తెలుస్తోంది. ఆత్మ అలాంటి నిర్ణయం తీసుకుంటే, చంటి పిల్లలకు వచ్చే జబ్బుల ద్వారా కూడా మరణం సంభవించవచ్చు.

ఓ రీడింగ్‌లో ఓ యువతి గత జన్మలో చాలా చిన్న వయస్సులోనే మరణించింది. తండ్రితో గల కర్మబంధం వల్ల తిరిగి ఆ ఆత్మ పుట్టుక జరిగింది. తండ్రి తాగుడుకి అలవాటు పడ్డాడు. తల్లిని హింసించడం ప్రారంభించాడు. దాంతో ఆ ఆత్మ ఈ జన్మ వద్దు అనుకుంది. దాంతో ఆ బిడ్డకి వ్యాధి వచ్చి మరణించింది.

ఈ విషయాన్ని సినిమా ప్రేక్షకులతో పోల్చుకోవచ్చు. మంచి సినిమా అనుకుని వెళ్లాక, సినిమా మొదలు అయ్యాక, అది తను ఊహించిన విధంగా లేదని తెలిసి, మొదటి సీన్ అవ్వగానే థియేటర్‌లోంచి బయటకి వెళ్లిపోయే ప్రేక్షకుడితో ఈ సంధర్భంలోని ఆ ఆత్మను పోల్చవచ్చు ఒక్కోసారి బిడ్డ మరణించడం వల్ల, తల్లితండ్రులకు ఏర్పడే విచారం, అవసరమైన అనుభవం అవడం వల్లకూడా బిడ్డ మరణించవచ్చు.

ఉదాహరణకి ఓ తండ్రికి ఆరోగ్యమైన, అందమైన బిడ్డలు తనకి ఉన్నారన్న అధిక గర్వం ఉంటే, అందవిహీనమైన బిడ్డగా ఆత్మ అతనికి పుట్టి అందువలన కలిగే పరితాపం వల్ల ఆ గర్వం అణిగి అతని ఆత్మకి ఆ మేర పవిత్రత లభింపచేయవచ్చు. (గమనిక : ఇది ఉదాహరణే కానీ కేసీ రీడింగ్స్‌లో వచ్చింది కాదు). ఇలా మరో ఆత్మ ఆత్మోన్నతికి దారి తీసే విధంగా కూడా బిడ్డ ఈ దశలో శరీరంలోంచి ఆ ఆత్మ తొలగవచ్చు.

గర్భవతి ఐన తల్లి ఎలా ఉండాలో మన శాస్త్రాలు పేర్కొన్నాయి. ఇందులో నిజం ఉందని చెప్పే ఓ రీడింగ్ చూద్దాం.

గర్భవతి అయిన ఓ తల్లి కేసీని ఇలా ప్రశ్నించింది. "వచ్చే నెలల్లో నేను ఎలాంటి మానసిక స్థితిని కలిగి ఉండాలి? అందుకు కేసీ జవాబు : నువ్వు ఎలాంటి బిడ్డను కోరుకుంటున్నావు అనే దాని మీద అది ఆధారపడి ఉంది. సంగీత సామర్థ్యం కలిగి ఉన్న బిడ్డ పుట్టాలనుకుంటే సంగీతం గురించి, కళలు, అందం

గురించి ఆలోచించు. ఒక వేళ మెకానిక్ టైప్ బిడ్డ కావాలి అనుకుంటే మెకానిక్స్ గురించి ఆలోచించు. అలాంటి మెకానికల్ వస్తువులతో పని చేస్తూ ఉండు. వీటి వల్ల పుట్టబోయే బిడ్డ మీద ఎలాంటి ఫలితం ఉండదు అనుకోకు." ప్రతీ తల్లి నేర్చు కోవాల్సిన పాఠం ఇది. గర్భవతి మానసిక స్థితిని బట్టి పుట్టబోయే బిడ్డ ఆత్మ ఆమె తల్లిని ఎన్నుకుంటుంది.

కేసీ రీడింగ్స్ ప్రకారం,

**ఆత్మ గర్భస్థ పిండంలోకి డెలివరీకి కొంత సేపటికి ముందు, లేదా పుట్టిన కొంత సేపటికి, లేదా పుట్టే సమయంలో ప్రవేశిస్తోందని తెలుస్తోంది. బిడ్డ పుట్టిన 24 గంటల తరవాత కూడా ఆత్మ బిడ్డ శరీరంలోకి ప్రవేశించ వచ్చు. అలాగే ఏ ఆత్మ ఆ బిడ్డ శరీరంలోకి ప్రవేశిస్తుంది అన్న విషయంలో, ఆఖరి నిమిషంలో కూడా మార్పులు జరగవచ్చు.**

ఇందువల్ల ఆత్మ లేకుండా శరీరం ఎలా జీవించగలదు అన్న ఆలోచన మనకి వచ్చి తీరుతుంది. అయితే ఇది విడ్డూరం కాదు. శరీరం ఆత్మకి రథం. దీన్ని ఈ సంధర్భంతో పోల్చవచ్చు. అప్పుడే తయారు అయిన కారు యొక్క ఇగ్నీషన్ ఆన్ చేసి, కారు స్టార్ట్ చేసి, గేర్‌ని న్యూట్రల్ కండీషన్‌లో ఉంచవచ్చు. డ్రైవర్ ఇంకా ఆ కారులోకి ఎక్కక ముందే ఇది జరిగి ఆ కారు పని చేస్తుండవచ్చు. అలాగే ఓ శరీర నిర్మాణం జరిగి, దానిలోకి ఇంకా ఆత్మ ప్రవేశించకుండానే అది పని చేస్తుండవచ్చు. "భగవద్గీతలో భగవంతుడు శరీరాన్ని రథంతోనూ, ఆత్మను అందులో కూర్చునే వారితోనూ పోల్చాడు."

ఒకరు కేసీని ఆత్మ శరీరంలోకి ప్రవేశించేదాకా శరీరాన్ని ఎవరు బతికుండేలా చేస్తారు? అని ప్రశ్నస్తే కేసీ ఇచ్చిన జవాబు : "దేవుడు".

## అధ్యాయము - 6

## ఎలాంటి పూర్వ జన్మల కర్మలు వల్ల పిల్లలు అంగవికలురుగా పుడతారు?

## కుటుంబ సభ్యుల మధ్య అకారణ వైరాలు ఎందుకు వస్తాయి?

మనుష్యులకి కలిగే అత్యధిక దుఖాలలో ఒకటి వికలాంగులైన పిల్లలని ఈ లోకంలోకి తీసుకురావడం. వాళ్లని సాకడం ఆర్థికంగా కష్టమే కాక సమాజంలో చిన్న చూపు భరించాల్సి రావడం.

ఎడ్గర్‌కేసీ ఫైల్స్‌లో వికలాంగులైన బిడ్డల ప్రసక్తి అనేకసార్లు వచ్చింది. పుట్టుకతో వచ్చే అవకరం ఆ బిడ్డకి గతజన్మల్లోని దుష్కర్మల ఫలితమే కాక అందులో ఆ బిడ్డ తల్లితండ్రులకి కూడా భాగం ఉండడం జరుగుతుంది.

మంగోలియన్ ఈడియసి, చెవుడు, మెదడులో నీరు లాంటి అనేక అవకరాలు తల్లితండ్రులకు (లేదా వారిలో ఒకరికి) లేదా ఆ బిడ్డకు సంబంధించిన గతజన్మల దుష్కర్మ ఫలితాలని ఎడ్గర్‌కేసి అనేక సందర్భాలలో వివరించారు.

12 ఏళ్ల ఓ యూదు బాలిక చిన్నప్పటినుంచే ఎపిలెప్సి (మూర్ఛ) వ్యాధితో బాధ పడేది. ఇతరుల ముందు ఆ వ్యాధి లక్షణాలు వస్తే తల్లితండ్రులు ఎంతో ఇబ్బంది పడేవారు.

కేసీ వాళ్ల రీడింగ్‌ని ఇలా చెప్పారు.

ఆ తల్లి, తండ్రి, బిడ్డ అమెరికాలో రివల్యూషన్ జరిగిన కాలంలో సరిగ్గా ఇదే బాంధవ్యంతో జీవించారు. తల్లితండ్రులు ఆర్థిక లాభాన్ని ఆశించి అమెరికన్ కాలనిస్టుల రహస్యాలు కూతురి ద్వారా తెలుసుకుని వాటిని బ్రిటిష్ అధికారులకి అమ్మసాగారు. వారి కూతురు అందగత్తె, తెలివిగలది. ఈ రెండు గుణాలని ఆ అమ్మాయి తల్లితండ్రులు చక్కగా ఉపయోగించుకున్నారు. ఆమెకి బుద్ధి చెప్పేబదులు వాటిని ఉపయోగించి అమెరికన్స్ నుంచి రహస్యాలు తెలుసుకోవడానికి ప్రోత్సహించారు.

"మనం ఏది నాటితే దాన్నే కోసుకుంటాము. లౌకిక లాభాల కోసం కూతురు చెడ్డ పనులు చేస్తుంటే తల్లితండ్రులు ఆమెను నివారించే బాధ్యతను విస్మరించి పైగా అందుకు ప్రోత్సహించారు. దాని ఫలితాన్ని ఆ ముగ్గురూ ఈ జన్మలో అనుభవిస్తున్నారు. ఆనాటి తన విచ్చలవిడి లైంగిక అపరాధాలకి ఆమె నేడు భౌతిక శరీరం ద్వారా శిక్షని అనుభవిస్తోంది. ఈ శరీరానికి రక్షణదారుల పాత్రలో తల్లితండ్రులు కూడా అదే సమయంలో శిక్షని అనుభవిస్తున్నారు."

దీన్ని బట్టి ప్రతీ వ్యక్తీ తన కుటుంబ సభ్యుల, సమాజంలోని ఇతరుల విషయంలో తన బాధ్యతను స్వార్థంతో సక్రమముగా నెరవేర్చకపోవడం కూడా దుష్కర్మ అని తేలుతోంది.

మరో కేసులో న్యూయార్క్‌లో పుట్టిన ఓ అమ్మాయి పుట్టుగుడ్డి. ఆమె తల్లి ఇందుకు కారణం తెలుసుకోవాలని ఎడ్గర్‌కేసీ సహాయం అర్థిస్తే వచ్చిన జవాబు ఇది.

తన పూర్వజన్మలో తల్లి ఉపాధ్యాయురాలు. ఆమె మరో తల్లిని తన స్వార్థం కోసం వాడుకుంది. (అదేమిటో కేసీ రీడింగ్‌లో స్పష్టంగా లేదు.) ఇది ఆ తల్లికి ఎంతో మనస్థాపంగా ఉండేది. ఇందులో ఆ పుట్టిగుడ్డి యొక్క తండ్రి చేయి కూడా ఉంది. ఫలితంగా వారు ఈ జన్మలో తల్లితండ్రులుగా, ఆలా వాడుకోబడిన తల్లి వారి పిల్లగా పుట్టింది. అయితే ఆ బిడ్డ గుడ్డితనానికి కారణం తెలియదు. బహుశా ఆమె గతజన్మలలో చేసిన ఏదో చెడు కర్మ వల్ల అది వచ్చి ఉండవచ్చు. ఆవిడ రీడింగ్ మీ తల్లి తీసుకురాలేదు కాబట్టి ఆ కారణం తల్లి రీడింగ్‌లో రాలేదు. ఈ జన్మలో తనని వాడుకున్న ఆ తల్లి గుడ్డిదానిగా ఆ జన్మలో తనని వాడుకున్న ఆ ఇద్దరికి గుడ్డిబిడ్డగా పుట్టి బదులు తీర్చుకుంటోంది.

మరో కేసులో అవిటిమెదడుతో, (మంగోలియన్ ఇడియోక్రసి) పుట్టిన తన బిడ్డ విషయంలో మరో తల్లి కేసీని ప్రశ్నిస్తే ఆయన చెప్పిన వివరాలు ఇవి.

ఆ తల్లి తన పూర్వజన్మలలో ఓ దాంట్లో పాలస్తీనాలో పుట్టినప్పుడు ఇలాంటి మంగోలియన్ బేబీలను చూసి వెక్కిరించేది. అందువల్ల ఆమెకి అలాంటి బిడ్డ ఉంటే పడే వేదనని నేర్చుకోవడానికి, తద్వారా అలాంటి వారిని వెక్కిరించకూడదన్న పాఠం నేర్చుకోవడానికి మానసిక వికలాంగురాలైన కూతురుని కంది.

మరో కేసులో తలలో అధికనీరు కల బిడ్డని కని ఓ తల్లి మరణించింది. తండ్రి ఆ బిడ్డని ఓ కాథలిస్ట్ హోమ్‌లో ఉంచాడు. ఆ బిడ్డ నాలుగో ఏట, తండ్రి తనకి ఆ బిడ్డకి గత జన్మలో గల సంబంధం తెలుసుకోవడానికి ఎడ్గర్‌కేసీ సహాయం కోరాడు. తన బరువైన తల వలన ఆ బిడ్డ నడవలేదు. తలని మెడమీద మొయ్యడమే ఆమెకి భారంగా ఉండేది. అయితే అ బిడ్డ రీడింగ్ తీసుకోకపోవడం వల్ల ఏ దుష్కర్మ వల్ల ఆమెకి ఈ వ్యాధి సంభవించిందో తెలియదు. తండ్రికి కేసీ చెప్పిన జవాబు.

**"పూర్వజన్మలో నువ్వు సహాయం చేయగలిగి ఉండి, చేయలేదు. ఈ జన్మలోనయినా నువ్వు సహాయం చేయడం నేర్చుకో."**

దురదృష్టవశాత్తు ఇంతకు మించిన సమాచారం కేసీ ఇవ్వలేదు. అందుకని ఏ విషయంలో ఎవరికి అతను సహాయం చేయలేదో తెలియదు. పూర్వజన్మలో అతను ఫోర్ట్ డియర్ బార్న్ అనే ఊరిలో వ్యాపారస్తుడు అని మాత్రమే చెప్పాడు కేసీ.

**"భౌతిక సంపాదనని నువ్వు ఆర్జించావు కానీ ఆధ్యాత్మికంగా నువ్వు నష్టపోయావు"** అని కేసీ చెప్పాడు.

'ఇప్పటికైనా నువ్వు ఆ పాఠం నేర్చుకోకపోతే వచ్చే జన్మలో నీ శరీరానికే ఈ అవకరం వస్తుంది' అని అర్థం వచ్చేలా కూడా చెప్పాడు కేసీ.

సాటి మనిషి పడే బాధని చూసి తగిన సహాయం చేయగలిగి ఉండీ చేయకపోవడం కూడా దుష్కర్మే అని ఈ కేసు కూడా ఋజువు చేస్తోంది. అంటే బాధితుల పట్ల సానుభూతి కలిగి ఉండకపోవడం కూడా పాపమే.

అయితే ఈ ఋణానుబంధం కేవలం తల్లితండ్రులకి, బిడ్డకి మధ్యే కాక బిడ్డకి బిడ్డకి మధ్య కూడా ఉంటుంది. ఇద్దరు అక్కచెల్లెల మధ్య చిన్నప్పటి నుంచి విరోధం ఉండేది. ఎప్పుడూ పోట్లాడుకునేవారు.

అయితే 5గురు పిల్లలు గల ఆ కుటుంబములో మిగిలిన ముగ్గురి విషయంలో ఈ ఇద్దరికీ విరోధం లేదు. చెల్లెలు వివాహం అయ్యాక ఆమె భర్త మీద కూడా అక్క విరుచుకు పడేది. కేసి గురించి విన్న చెల్లెలి భర్త, తమ ముగ్గురికి పూర్వజన్మలో ఏదైనా సంబంధం ఉందా అని కేసిని అడిగితే కేసి దీనికి కారణం ఇలా వివరించాడు.

వర్జీనియా రాష్ట్రములో కోలోనియన్ పీరియడ్‌లో చెల్లెలి భర్త నిజానికి అక్క భర్తగా ఉండేవాడు. అతనికి జబ్బు చేస్తే అతని భార్య ఏ కారణంతోనో భర్తకి దూరంగా ఉండటంతో చెల్లెలు అతనికి ఉపచారాలు చేసింది. దీనితో వారి మధ్య అనురాగం అంకురించింది. ఆ జన్మలో అతని భార్య అయిన అక్కకి ఇది తెలిసి అసూయ జనించింది. క్రమంగా ఆ ఇద్దరి మీదా ద్వేషంగా మారింది. ఇది ఎంత లోతుగా పాతుకుందంటే వందల ఏళ్లు గడిచినా అది ఇంకా అక్కనుంచి పోలేదు. దాంతో ఈ జన్మలో అక్క, గత జన్మలోని ఆ భావనల ప్రకారం తన చెల్లెలు, భర్తల మీద ద్వేషపూరితంగా ఉంటోంది. ఈ జన్మలో ఆ అవసరం లేకపోయినా క్రితం జన్మలో గల తన మానసిక స్థితిని ఈ జన్మలో కూడా ఆమె ఇద్దరి మీదా బహిర్గతం చేస్తోంది.

మరో కేసులో రెండో ప్రపంచయుద్ధ కాలంలో ఇంగ్లాండులో పుట్టిన అన్నాచెల్లెల్ల అలనాపాలనని వారు చదువుకునే స్కూలులో ఉద్యోగి అయిన ఓ అమెరికన్ మహిళ చూసుకునేది. అన్నకి 10వ ఏడు, చెల్లెలికి 5. అమెరికన్ మహిళ ఆ వయస్సులో వారిని దత్తత కూడా తీసుకుంది. అన్నకి చెల్లెలు అంటే క్షణం పడేది కాదు. కోపంతో ఉన్న కుక్కలా చెల్లెలిని వంక చూస్తూ నాజీ మెథడ్స్‌ని ఉపయోగించేవాడు. ఇలా ఎందుకని? అని ఆ అమెరికన్ మహిళ ఎడ్గర్‌కేసికి రాసిన ఉత్తరంలో పేర్కొంది.

దీనికి కేసి జవాబు.

"స్కాట్‌లాండ్‌లో ఈ ఇద్దరు గతజన్మలో ఒకరంటే ఒకరు పడని రెండు కుటుంబాలకి(క్లాన్) చెందిన వారు. అప్పుడు వారి మధ్య గల ద్వేషభావం వందల ఏళ్ల తరువాత కూడా ఈ జన్మలో బహిర్గతం అవుతోంది."

ఈ కేసులన్నింటిని క్రోడీకరించి చూస్తే -- **కుటుంబములోని అవకరం గల బిడ్డలు ఉండడానికి కారణం, వాళ్ల విషయంలో వహించాల్సిన బాధ్యతని వహించకపోవడమో లేదా ఆ అవకరం కలవారిని వెక్కిరించడమో కారణంగా తెలుస్తోంది. ఇవి దుష్కర్మలని మనం అర్థం చేసుకోవాలి. అలాగే తోడబుట్టిన వారి మధ్య గల ద్వేషభావం, పూర్వజన్మలలోని ఒకరిమీద మరొకరికి గల ద్వేషం ఈ జన్మలో కొనసాగడంగా కూడా అర్థం చేసుకోవాలి. ఈ జన్మలో పోట్లాటలకి కారణాలుగా కనపడేవి ఏవైనా ఆ పోట్లాటలకి మూలం ఆ కారణాలు కాక గతజన్మలలో వారు అనుభవించిన ద్వేషభావమే పునాది అవుతోంది.** అదే తప్పు ఇతర కుటుంబ సభ్యులు చేస్తే పట్టించుకోని వారే ఆ ఒక్క కుటుంబసభ్యుడు చేస్తేనే ఎందుకు కోపం తెచ్చుకోవడం?

**అందుకే ఏ కారణం వల్లనైనా సరే, ఎవరి మీద ద్వేషభావం ఉన్నా, అది వారితో బంధం అయితీరుతుందని మరోసారి ఈ కేసులు ఋజువు చేస్తున్నాయి. ద్వేషం ఎంత గాఢమైతే అంతగా వారితో దగ్గర బంధం ఏర్పడుతుంది. ఈ ద్వేషభావం వారి నుంచి సమసి పోయేదాకా వారితో ఈ బంధం కొనసాగుతుంది.**

**వారు ఈ ద్వేషాన్ని మర్చిపోయి ఒకరిని ఒకరు ప్రేమించడం నేర్చుకుని, అర్థం చేసుకుని దయగా ఉండడం అలవరచుకునేదాకా ఎన్ని జన్మలైనా సరే వారు సమీపంలో పుడుతూండ వలసినదే.**

ద్వేషం అనేది ముందు కుటుంబేతర సభ్యులతో మొదలయి, ఆ తరువాత జన్మలలో వాళ్లు కటుంబసభ్యులుగా అవతారం ఎత్తుతూంటారు.

**మనమంతా మానవ కుటుంబములోని సభ్యులము. మన కుటుంబములోని ఎవరినీ ద్వేషించకుండా జీవించడం నేర్చుకోవాలి అనే విషయాన్ని గ్రహించాలి.**

ఎడ్గర్‌కేసి కేసుల ద్వారా మనందరికి ప్రకృతి నేర్పిన ఈ పాఠాన్ని మనమంతా నేర్చుకుని ఈ హెచ్చరికను సదా మనస్సులో ఉంచుకోవాలి.

## అధ్యాయము - 7

## పూర్వ జన్మ కర్మలు - నేడు చేసే వృత్తులు

ఎడ్గర్‌కేసీ ఇచ్చిన కొందరి రీడింగ్స్‌ని బట్టి ఈ జన్మలో వారి వృత్తి లేదా ఉద్యోగం గత జన్మలలోని వృత్తి ఉద్యోగాల మీద ఆధారపడి ఉంటుందని తెలుస్తోంది. సాధారణంగా గత జన్మలలో వాళ్లు ఏ వృత్తిలో ఉంటే ఈ జన్మలో తిరిగి అదే వృత్తిని చేపడతారు అని అర్థం అవుతోంది.

న్యూయార్క్‌లోని ఫిగర్ కండీషనింగ్ పర్సనాలిటి ఇంప్రూవ్‌మెంట్, హెయిర్‌స్టైలింగ్ మొదలైన సర్వీసులని అందచేసే ఓ బ్యూటీషియన్‌కి గత 3 జన్మల రీడింగ్ ఇచ్చాడు కేసి. మొదటిది ఫ్రెంచి చక్రవర్తి లూయీ 15 కోర్టులో ఆమె అతనికి ప్రియురాలిగా ఉండేది. ఆ సమయములో ఆమె చక్కగా అలంకరించుకునేది. ఇతరులతో ఎంతో మర్యాదగా, మృదువుగా ప్రవర్తించడం కూడా అభ్యసించింది. అంతకు ముందు జన్మలో ఆమె రోమ్‌లో క్రిస్టియన్ మతం పుచ్చుకున్న ప్రథములలో ఒకరు. ఆ సమయంలో కూడా ఆమె శరీర అందానికి ప్రాదాన్యత ఇచ్చేది. అంతకు మునుపు క్రీస్టు పూర్వం 1300 ఏళ్ల క్రితం ఈజిప్టులో టెంపుల్ సర్వీసులో ఉంది. ఆ సర్వీసులో భాగంగా ఆమె శరీరాన్ని అందంగా అలంకరించుకోవడం, అందుకు అవసరమైన లోషన్లు, ఆయింట్‌మెంట్లు, పౌడర్లు తయారు చేయడం నేర్చుకుంది.

ఈజిప్టులో రెండు రకాల టెంపుల్స్ ఉండేవి. ఒకటి టెంపుల్ బ్యూటిఫుల్, రెండవది టెంపుల్ ఆఫ్ శాక్రిఫైజ్. టెంపుల్ బ్యూటిఫుల్ ఓ యూని- వర్సిటీలాంటిది. అయితే ఈ యూనివర్సిటీలో నేర్పేది మనిషి శరీరాన్ని అందంగా అలంకరించుకునేలా బోధించడం. వాళ్లు తమ ఆత్మని, శరీరాన్ని అందంగా ఉంచుకునే పద్ధతులు నేర్చుకుని ఇతర దేశాలకి వెళ్లి దాన్ని బోధించేవారు. దాన్ని టెంపుల్ అనడానికి కారణం అది మతపరమైన బోధగా ఉండడమే. శరీరంలోని 7 పాయింట్లను ఆధారంగా చేసుకుని అందాన్ని అభివృద్ధి చేయడం బోధించేవారు. బహూశా ఇవి హిందూ యోగాలో చెప్పే 7 చక్రాలకి సంబంధించినవి అయిఉండవచ్చు.

ఇక టెంపుల్ ఆఫ్ శాక్రిఫైజ్ వైద్యశాల. ఆపరేషన్లు, ఇంకా ఎలక్ట్రిసిటీని ఉపయోగించి శరీరానికి చికిత్స చేయడం అక్కడ జరిగేది.

బాగా ప్రాక్టీస్ ఉన్న ఓ డాక్టర్ రీడింగ్‌లో గతజన్మలో కూడా అతను వైద్యవృత్తిలో ఉండేవాడని తేలింది. గత జన్మలో అమెరికాలోని రెడ్ ఇండియన్స్‌తో స్నేహం కుదిరి అతను వాళ్ల నుంచి ఆ జన్మలో ఔషదాల ఉపయోగం, వాటినుంచి మందులు తయారు చేయడం ప్రకృతి సహజమైన వైద్యవిధానం నేర్చుకున్నాడు. అంతకు మునుపు జన్మలో ఓ క్రిస్టియన్ దేశంలో బాడీ మసాజ్, ఆరోగ్య స్నానాలు చేయించే వృత్తిలో ఉన్నాడు. అంతకు మనుపు ఈజిప్టులో క్రీస్తు పూర్వం 1300 ఏళ్ల క్రితం ఎంబామర్గా (శవాలు కుళ్లిపోకుండా పై పూత రాసే ఉద్యోగం) పని చేసాడు. ఆ సమయంలోనే మానవ దేహంలోని లోపలి భాగాల గురించి, ఔషధాలు, స్టైసెన్‌ల గురించి అభ్యసించాడు.

మరో కేసులో హాలివుడ్‌లోని చిత్రకారుడు, కళల డైరెక్టరుగా పని చేసిన ఒకతను గత మూడు జన్మలలో కూడా కళకి సంబంధించిన వృత్తులలోనే ఉన్నాడు. 150 ఏళ్ల క్రితం అమెరికాలో ఇంటీరియర్ డెకరేటర్‌గా పని చేసేవాడు. ఆ సమయంలోనే అమెరికాలో భవంతుల నిర్మాణం తొలిసారిగా జరిగింది. అంతకు మునుపు జన్మలో రష్యాలో సైనికాధికారిగా పని చేసాడు. అంతకు మునుపటి జన్మలో ఇండోచైనాలో ఓ క్వీన్‌కి దుస్తులు ఎన్నిక చేసేవారి ఉద్యోగం నిర్వహించాడు. అంతకు మనుపు ఈజిప్టులో టెంపుల్ బ్యూటిఫుల్‌లో పని చేసేవాడు. సైనికాధికారిగా ఉండగా రకరకాలుగా యూనిఫామ్‌లు డిజైన్ చేసే పనిని

ఇతను చేపట్టాడు.

న్యూయార్క్ చెందిన ఒక మ్యూజిక్ కంపోజర్ క్రితం జన్మలో న్యూయార్క్‌లోని ఓ స్కూలు టీచర్‌గా పనిచేస్తూ స్కూల్లో పాటలు- సంగీతము విద్యలో బాగంగా ఏర్పాటు చేసిన సంధర్భములో అందుకు అధికారిగా ఉన్నాడు. మరో జన్మలో జర్మనీలో సంగీత పరికరాలు తయారు చేసే చెక్కపనివాడుగా ఉన్నాడు. మరో జన్మలో ఓ రాజు దగ్గర బఫూన్‌గా పని చేసాడు. నాలుగో జన్మలో ఈజిప్టులో పాటగాడుగా జీవించాడు. ఈ జన్మలో ఇతను అనేక సంగీత పరికరాలని చక్కగా ఆర్గనైజ్ చేసే శక్తి, జర్మనీలో వాటి చెక్కపని వాడుగా ఉండగా పట్టుబడింది. అతనిలోని హాస్యప్రియత్వం బఫూన్‌గా ఉన్న జీవితంలో పట్టుబడింది. మిగిలిన రెండు జన్మలలోని సంగీతకారుడిగా అనుభవం ఈ జన్మలో ఉపయోగిస్తోంది.

ఒకోసారి ఓ మనిషి హాబీ కూడా ఈ జన్మలో అతని వృత్తిని నిర్ణయిస్తుంది. ఉదాహరణకి ఓ బ్యాంకు ప్రెసిడెంట్‌కి చిన్నప్పటి నుంచి ఆటలంటే మక్కువ. ముఖ్యంగా బేస్‌బాల్ ఆట మీద మంచి అభిరుచి ఉండేది. అతను వెళ్లే చర్చిలోని ఫాదర్ ఆదివారాలు బంతి ఆటని ఆడడం నిషేదిస్తే, ఆయన ఆ చర్చికి వెళ్లడం పూర్తిగా మానేసాడు. హెన్రీ 8 కాలానికి మునుపు, తరువాతి జన్మలలో ఇతనికి దేవుడి మీద భక్తి అలవడింది. బ్యాంకులో ఉద్యోగం చేస్తూ ఓ బేస్‌బాల్ క్లబ్బులో మెంబర్ అయి, ఖాళీ సమయాలలో ఆ ఆట ఆడుతూ ఉంటాడు. అతను ఓ జన్మలో ఎగుమతి, దిగుమతి వ్యాపారాలు చేసేవాడు. మరోజన్మలో రోమ్‌లో ప్రభుత్వంనిర్వహించే ఆటల కార్యాలయంలో పని చేసేవాడు. ఓ జన్మలో ఈజిప్టులో ట్రెజరీ ఆఫీసరుగా పనిచేసాడు. అందువల్ల ఈ జన్మలో బ్యాంకు ప్రెసిడెంట్‌గా రాణిస్తున్నాడు. తనకి ఇష్టమైన మరో వృత్తి అయిన ఆటగాడుగా ఉండే కోరికని హాబీగా తీర్చుకుంటున్నాడు.

మరో కేసులో అమెరికన్ నావీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే ఒకతని పని నావీ కోసం కొనే ఆహార పదార్థాలని పరీక్షించడం. అయితే అతని విలువైన రాళ్లు, రత్నాలు. అతని స్నేహం విలువైన రాళ్లని కట్ చేసేవాళ్లతో, రాళ్లు, రత్నాల వ్యాపారం చేసేవాళ్లతో. రిటైర్ అయ్యాక ఆ వ్యాపారంలోకే దిగాడు ఇతను. గత 3 జన్మల రీడింగ్స్ కేసీ ఇతనికి ఇలా ఇచ్చాడు. ఒహాయ్ రాష్ట్రములో ఇతను రెడ్ ఇండియన్స్‌తో రాళ్ల వ్యాపారం చేసేవాడు. అంతకు ముందు జన్మలో పర్షియా దేశంలో పుట్టి ఈజిప్టు నుంచి బళ్లలో దుస్తులు తెచ్చి అమ్మే వ్యాపారం చేసాడు. ఇంకా పర్షియాలోని ముత్యాలు, పగడాలు, వజ్రాలు లాంటి విలువైన రాళ్లని ఈజిప్టుకి తీసుకువెళ్లి అమ్మేవాడు. అంతకు మునుపు జన్మలో క్రిస్టియన్ ప్రీస్ట్‌ల దుస్తులలో రత్నాలు కుట్టే ఉద్యోగం చేసేవాడు. అయితే రిటైర్‌మెంట్‌కి మునుపు ఇతను నావీలో ఎందుకు ఉద్యోగం చేసేవాడు అన్నదానికి వివరణ కేసీ ఇవ్వలేదు. అతని హాబీకి సంబంధించిన పూర్వజన్మ వివరాలనే కేసీ ఇచ్చాడు. బహూశా అదే ఆయన అడిగి ఉంటాడు.

అప్రస్తుతం కానీ ఓ విషయం. 1944 కి మునుపు కేసి ఇతరులకి ఇచ్చిన రీడింగ్స్‌లో కొందరికి విలువైన రాళ్లని ధరించమని సలహా ఇచ్చాడు, వాటి ప్రకంపనలు వారికి ఉపశమనంగా ఉంటాయిని చెప్పి. ప్రతీ రకం రాయికి ఓ ప్రత్యేక ఆటమిక్ శక్తి ఉంటుంది. అలానే ప్రతీ మానవశరీరం కూడా అటమిక్ శక్తితో నిర్మించబడ్డ శరీరమే. ఎవరికి ఏ రకం రాయి అమరుతుందో కేసి చెప్పలేదు. అయితే అటమిక్ శక్తి ఇంకా కనుక్కోక ముందే కేసి రీడింగ్స్‌లో ఆ శక్తి గురించి చెప్పడం విశేషమని తర్వాత అతని రీడింగ్స్‌ని చదివిన వారు గుర్తించారు. మన జ్యోతిష్య శాస్త్రములో కూడా దీని గురించి విస్తారముగా ఉంది. క్రీస్తుకి పూర్వం 10,000 ఏళ్ల క్రితం అట్లాంటిస్ ద్వీపం సముద్రములో మునిగి పోవడానికి ముందు కొందరు

అక్కడ నుంచి ఈజిప్టుకి వచ్చారు. తమతో పాటు వారు తమ కళలని, శాస్త్ర విజ్ఞానాన్ని తెచ్చారు. దాంతో ఈజిప్టు సంస్కృతిలోకి వాళ్ల కళలు, సైన్స్ కొంత బాగం చొచ్చుకుపోయాయి.

ఎవరికైనా విమానయానం, ఎలక్ట్రానిక్, టెలివిజన్, టెలిపతీ, హిప్నాటిజం, ఆటమిక్ ఎనర్జీ మొదలైన వృత్తులకి సంబంధించిన వాటిలో ఉద్యోగం మీద ఆసక్తి ఉంటే గతజన్మలలో వారు అట్లాంటిస్‌లో ఆ వృత్తిలో జీవించేవారని, అలాగే ఆ శాస్త్రాలకు సంబంధించిన వృత్తిలో నెం.1గా ఉంటే వాళ్లు గతజన్మలలో ఆ వృత్తినే చేపట్టిన వారని కూడా కేసి అనేక సంధర్భాలలో రీడింగ్స్ ఇచ్చాడు. తక్కువ అనుభవంతో ఎక్కువ ప్రతిభని తమ ఉద్యోగంలో చూపించారంటే అది ఏ వృత్తి అయినా సరే అందుకు కారణం గతజన్మలలోని ఒక లేదా కొన్ని జన్మలలో వారు ఆ వృత్తిలో రాణించిన వారే అయిఉంటారు.

ఉదాహరణకి అమెరికాలోని నెం.1 లేడీస్ మాగ్‌జైన్‌లో అతి ప్రతిభావంతమైన వ్యాసాలను రాసే ఓ లేడీ రైటర్ కేసి దగ్గర రీడింగ్ తీసుకుంటే ఆమె గతజన్మలలో ఓ జన్మలో అమెరికాలో ప్రముఖ నటిగా, మరో జన్మలో క్రిస్టియన్‌కి సంబంధించిన వార్తలు రాసే ఉద్యోగములో, ఇంకో జన్మలో పాలస్తీనాలో తల్లిగా, మరోజన్మలో ఈజిప్టులోని టెంపుల్ బ్యూటిఫుల్‌లో ఉండేది.

తల్లి బిడ్డల సంబంధ, బంధవ్యాల మీద ఆమె చక్కని ఆర్టికల్స్ రాయడం, చక్కటి తల్లిగా పాలస్తీనాలో జీవించిన జీవితానుభవంలోంచి వచ్చిందని కేసి చెప్పాడు. సూటిగా రాయగలిగే శక్తి క్రిస్టియన్స్‌కి చెందిన వార్తలు రాసిన అనుభవంతో వచ్చింది. ఇలా గతజన్మలలోని వివిధ వృత్తులు కలిసి ఈ జన్మలో ఒకేవృత్తిగా కూడా పరిణమించవచ్చు.

31వ ఏట మెడికల్ కాలేజీలో చేరదామనుకున్న ఒకతను, ఇతనికి చిన్నప్పటి నుంచి డాక్టర్ అవ్వాలన్న కోరిక. అయితే అతనికి ఆ అవకాశం రాలేదు. 31వ ఏట స్వంత సంపాదనతో మెడికల్ కాలేజీలో చేరాలనుకుని ఎడ్గర్‌కేసిని సలహా అడిగితే అందుకు ఆయన ప్రోత్సహించారు.

"అమెరికన్ రెవల్యూషన్‌లో నువ్వు చిన్న ఉద్యోగివి. యుద్ధంలో తోటి వారి బాధలని గమనించాక, వాళ్లకి సహాయం చేయడానికి నీకు వైద్యం రాలేదే అని వాపోయేవాడివి. ఆ కోరిక వల్ల నువ్వు డాక్టర్‌ని నీ తండ్రిగా ఎన్నుకుని పుట్టావు. మరోజన్మలోని కర్మఫలం వల్ల త్వరగా పెళ్లి, దాని బాధ్యతలు మోయడం జరిగింది. అయితే గతజన్మలోని నీ తీవ్రకోరికను నువ్వు మర్చిపోలేదు కాబట్టి మెడికల్ కాలేజీలో ఈ వయస్సులో నువ్వు చేరినా నువ్వు తేలికగా పాస్ అవుతావు".

**దీన్ని బట్టి కర్మఫలమే కాకుండా కోరిక కూడా ఓ జీవి ఓ వృత్తిని ఎన్నుకోవడానికి అందులో రాణించడానికి కారణం అవుతుందని తెలుసుకోవచ్చు.**

ఒకరు ఓ వృత్తిలో బాగా రాణిస్తున్నారు అంటే అర్థం గతజన్మలలోనే వాళ్లు ఆ వృత్తులలో ఉన్నారు అని. అలాగే కొందరు తమ వృత్తులలో చాలా సామాన్యంగా ఉన్నారంటే వాళ్లు ఈ జన్మలోనే ఆ వృత్తిలోకి తొలిసారిగా ప్రవేశించారని అర్థం చేసుకోవచ్చు.

ఈ కేసులన్నింటినీ క్రోడీకరిశ్తే ఎవరైనా ఓ వృత్తిని ఎంచుకోవడానికి, అందులో బాగా రాణించడానికి కారణం వారు గతజన్మలలో అదే వృత్తిలో అనుభవాన్ని సంపాదించి ఉండడమే అని తేలుతోంది.

**అయితే కర్మ, కోరికలలో కర్మే బలమైనది అవుతుంది. ఉదాహరణకి ఒకరికి డాన్సర్ అవ్వాలన్న బలమైన కోరిక ఉండవచ్చు. కానీ కర్మఫలంగా ఆ జీవి కుంటివాడిగా పుడితే డాన్సర్ అయ్యే అవకాశం లేదు. అప్పుడు కోరిక వల్ల కుంటి వాడిగా పుట్టకుండా ఉండడం జరగదు. కర్మదే అప్పుడు గెలుపవుతుంది. అప్పుడు ఇంకో వృత్తి చేపడితే గతజన్మల్లో ఎప్పుడో ఆ వృత్తి చేసి ఉంటే ఆ అనుభవం**

**ఇప్పుడు బయట పడుతుంది. మధ్యలో ఎన్ని వందల జన్మలు ఇతర వృత్తులలో గడిచినా.**

**ఓ ఆత్మ ఆత్మసాక్షాత్కారం పొందడానికి ముందుగా అన్ని రకాల వృత్తులనీ చేపట్టి ఉండాలి అని కూడా కేసి రీడింగ్స్‌ని బట్టి అర్థం చేసుకోవచ్చు.**

ఓ జీవాత్మ కళలలో నిష్ణాతులై మెకానిక్స్, మెడిసెన్‌లలో అనుభవం లేకుంటే తరువాత జన్మలలో ఆ విభాగాలకి చెందిన వృత్తులలో కూడా పని చేయాల్సి ఉంటుంది. ఇందుకు కారణం ఒక్కో వృత్తి ద్వారా లభించే ఒక్కో గుణంలోంచి బయట పడడం కోసం, లేదా కొత్త గుణాన్ని నేర్చుకోవడం కోసమో ఇది తప్పదు.

ఉదాహరణకి ఓ 68 ఏళ్ల వ్యక్తి కేసి దగ్గరకి వచ్చి తను రియల్ ఎస్టేట్ ఏజెంటుగా పని చేస్తున్నానని అయితే తన ప్రవృత్తి ఈ వృత్తికి సరిపడడం లేదని ఏ వృత్తిలోకి మారితే బాగుంటుందని ప్రశ్నించాడు. దానికి కేసి ఇచ్చిన జవాబు.

"క్రితం జన్మలో నువ్వు స్కూల్ టీచర్‌గా పని చేసావు. విద్యార్థులు నువ్వు చెప్పింది విని అలా చేయడం అనే గుణం అలవర్చుకున్నావు. ఈ వృత్తిలో కూడా అలా ప్రవర్తిస్తున్నావు. కాబట్టి నీకిది లాభసాటిగా లేదు. నువ్వు అవసరమైన పాఠం నేర్చుకోవడానికే ఈ వృత్తిలోకి తీసుకురాబడ్డావు. కాబట్టి దీన్ని మానద్దు."

**బహూశా ఇందుకేనేమో చిన్న పిల్లల ముందు రకరకాల వస్తువులు పరిచి వాటిలోంచి వారు ఏ వస్తువుని ఆసక్తిగా చేతిలోకి తీసుకుంటే ఆ చదువులలో రాణిస్తాడు అన్న సిద్ధాంతము మనకుంది. ఇందువల్లే కొందరు చిన్న పిల్లల నుంచే పెద్దయ్యాక ఏమవుతారో వాళ్ల మాటల, చేతలని బట్టి చెప్పచ్చు. పూర్వజన్మలోని వృత్తి నేడు మనకి హాబి అవ్వచ్చు. చైనీస్‌కి సంబంధించిన బాషా వస్తువుల మీద ఆసక్తి గతజన్మలో మనం చైనాలో జన్మించడం వల్ల కలగవచ్చు. ఓ ఆట, ఓ కళ, లేదా ఓ బాషని సులువుగా నేర్చుకోవడం, ఓ ప్రాంతానికి చెందిన వంటకాలు నచ్చడం లాంటి వాటి వెనక పూర్వజన్మలో మనం ఎక్కడున్నాం, ఏంచేసాం అన్నదాని మీద ఆధారపడి ఉండచ్చు. కాబట్టి పిల్లలు చదువులో, ఏ సబ్జెక్ట్ మీద ఆసక్తి చూపితే దానిలో చేర్చడం ద్వారా వారు తర్వాత అందుకు సంబందించిన వృత్తిలో రాణించ వచ్చు. బొమ్మలు బాగా గీసేవాడు ఇంజనీర్ అవచ్చు, లేదా చిత్రకారుడు, డాక్టర్ కూడా అవ్వచ్చు. డబ్బులు విషయంలో జాగ్రత్తగా ఉండేవాడు అకౌంటెంట్ కావచ్చు లేక వడ్డీ వ్యాపారి కావచ్చు.**

ఒకరు కేసిని "నేను ఏ వృత్తిలో బాగా సంపాదిస్తాను?" అని అడిగితే "సంపాదన సంగతి మర్చిపో, ఏ వృత్తిలో నువ్వు ప్రపంచానికి ఎక్కువ సేవ చేయగలవో ఆలోచించు. నువ్వు చేసే కర్మ వల్ల ఇతరుల ప్రపంచం ఇంకాస్త సుఖమయమవుతుందా లేదా అని ఆలోచించు. నువ్వు ఇతరులనుంచి లాభం పొందడం కాదు. నువ్వు ఇతరులకి ఎంత బాగా పడతావని ఆలోచించు."

ఇతరులకి సేవ చేయడం అన్నది అన్నింటికన్నా అత్యుత్తమమైనదని కేసి ఎందరికో చెప్పాడు. **"నేను ఈ వృత్తిలో ఇతరులకి ఎంత బాగా ఉపయోగపడగలను, ఇతరులకి సేవ చేయడం అంటే దేవుడికి సేవ చేయడమే. మనుష్యులందరిలోకి గొప్పవాడు ఎవరంటే అందరికి సేవ చేసేవాడే"** అని చెప్పాడు కేసి.

దీన్నే డాక్టర్ మారెళ్ల రామకృష్ణ ఓ కథలో ఇలా చెప్పారు.

ముగ్గురు కూలీలు కలిసి ఓ గుడి కడుతున్నారట. ఒకడ్ని ఎవరో ఏం చేస్తున్నారని అడిగితే "8గంటలు ఇక్కడ బందీ అయ్యి ఇటుక మీద ఇటుకలు పేరుస్తున్నాను" అని విసుగ్గా చెప్పాడు.

మరోకరిని అదే ప్రశ్న అడిగితే "నా కుటుంబాన్ని పోషించే ధనం ఆర్జిస్తున్నాను" అన్నాడు.

మూడవ వాడిని అడిగితే " ఎంతో మంది వచ్చి దర్శించుకోవడానికి వీలుగా దేవాలయం

నిర్మిస్తున్నాను" అన్నాడు.

ముగ్గురూ చేసే పని ఒకటే అయినా భావనలో ఎంత తేడానో చూడండి.

**అలా మనం చేసే ఏదయినా నలుగురికి ఉపయోగపడుతుందన్న భావనతో చేస్తే అది బంధం కాదని మాస్టర్ డా. మారెళ్ల శ్రీరామకృష్ణగారు అంటారు.**

## అధ్యాయము - 8

## మన స్వభావం కర్మఫలం వల్లే . . .

**మనుష్యులకుండే రకరకాల మానసిక భయాలు-ఫోబియాలు కూడా పూర్వజన్మానుభవాల వల్లే ఏర్పడతాయని కేసి రీడింగ్స్‌ని బట్టి తెలుస్తోంది.** ఓ ఆసక్తికరమైన కేసు ఇది.

ఓ అమ్మాయికి మూసేసిన ప్రదేశాలంటే భయం. సినిమా హాల్సుకి వెళితే గేటు దగ్గర కూర్చుంటుంది. బస్సులో ఎక్కువ మంది ఎక్కితే దిగిపోయి ఖాళీగా ఉండే బస్సుకోసం ఎదురుచూస్తుంది. గుహలు, చిన్న గదుల్లోకి వెళ్లాలంటే భయం. కేసి ఆమె గురించి ఇలా చెప్పాడు. గత జన్మలో ఆమె ఓ గుహలో ఉండగా దాని సీలింగ్ కూలి అందులో కూరుకుని మరణించింది. ఆ జ్ఞాపకమే ఆమెకీ రకమైన భయాన్ని కలిగించింది.

మరో యువతికి మొనదేలి సూదిగా ఉండే పరికరాలంటే భయం. ఎవరైనా మొనతేలిన పరికరాలు వాడడం చూస్తే వణికి పోయేది. కేసి దీనికి కారణం ఇలా చెప్పాడు. ఓ జన్మలో ఆమె పర్షియాలో పుట్టినప్పుడు కత్తితో మెడ నరికి చంపబడింది. దాంతో ఈ భయం.

చీకటంటే భయం కల ఒకతను గతజన్మలో ఫ్రెంచి చక్రవర్తి లూయిస్16 సమయంలో రాజకీయ ఖైదీగా డంజన్ (చీకటి గది)లో బంధింపబడ్డం వల్ల కలిగింది. ఒకరికి కత్తులంటే భయానికి కారణం ఫ్రాన్స్‌లో గతజన్మలో అతను అలాంటి పరికరాలతో రాజకీయ ఖైదీగా హింసింప బడ్డాడు. క్రూర జంతువులంటే ఒకరికి భయం. అందుకు కారణం అతను గత జన్మలో రోమ్‌లో చక్రవర్తి ముందు ఎరీనాలో తన జీవితం కోసం క్రూర మృగాలతో పోరాడి మరణించిన ఖైది. నీరంటే భయపడే ఒక వ్యక్తి రోమన్ చక్రవర్తుల కాలంలో సముద్రములో మునిగి మరణించాడు.

ఇలాంటి **మానసిక భయాలు సాధారణంగా గత జీవితాలలోని భయంకర అనుభవాల వల్లే కలుగుతాయి.**

కొన్ని పూర్వజన్మానుభవాలు కలల రూపంలో కూడా వస్తాయని కేసి రీడింగ్స్‌ని బట్టి తెలుస్తోంది. ఓ నాలుగేళ్ల పిల్ల పీడకలలకి ఉలిక్కిపడి ఏడుస్తూ నిద్రలేస్తూంటుంది. ఆ పిల్ల తల్లి కేసికి ఆ విషయం రాస్తే అతనిచ్చిన జవాబు ఇది.

"ఆ పిల్ల పూర్వజన్మలో రెండో ప్రపంచ యుద్ధములో హింసాత్మకంగా మరణించింది. అయితే తిరిగి పుట్టాలన్న ఆత్మ బలంతో 9వ నెలకే అమెరికన్ తల్లితండ్రులకి పుట్టాడతను. ఇంకా ఆ బాంబులు పడి చెలరేగే అగ్నిజ్వాలల జ్ఞాపకాలు పోకపోవడం వల్ల ఆ పాపకి నిద్రలో కలల రూపంలో అవి గుర్తుకొస్తున్నాయి."

కొందరు 'పూర్వజన్మ అంతా ట్రాష్' అని కొట్టిపారేస్తారు. పూర్వజన్మంటూ ఉంటే అది గుర్తుండాలిగా అన్నది వాళ్ల వాదం. అయితే మన పసితనం ఆరేళ్లలోపు జీవితం కూడా మనకి గుర్తుండదు. మరి అది లేనట్లా? ఎవరినైనా "1999 సెప్టెంబర్ 10వ తారీఖు రాత్రి ఏడున్నరకి ఏం చేసావని అడిగితే" దానికి సమాధానం చెప్పగలరా? చెప్పలేనంత మాత్రాన తమ జీవితంలో ఆ సమయంలో వారు జీవించలేదని కాదుగా?

మరో ఉదాహరణ. పెద్దవాళ్లంతా ఏడు ఏళ్లు 49 అని పన్నెండు పన్నెండ్లు 144 అని చెప్పగలరు తప్ప, ఈ విషయం ఠక్కున గుర్తు రావడానికి 4, 5 క్లాసులలో వాళ్లు పడ్డ కష్టం, చదివిన ఎక్కాల పుస్తకాలలోని ఎక్కాలు గుర్తుంచుకోరుగా. ఏదైనా అనేకసార్లు మననం చేసిన విషయాన్ని మెదడు గుర్తుంచుకుంటుంది. అదే విధంగా ఓ మనిషికి కుక్కంటే భయం లేదా నిప్పంటే భయం. పాట పాడే నైపుణ్యం, ఇతరులకి సహాయం చేసే గుణం లాంటివి గతజన్మలలోని అనుభవసారంగా గుర్తుండి పోతాయి. (దీన్నే మనం సంస్కారం అంటాం) మనకి నడవడం తెలుసు కానీ నడక నేర్చుకోవడానికి చిన్నప్పుడు మనం చేసిన ప్రయత్నం గుర్తుంటుందా?

**ఇదే విధంగా మనిషికి పూర్వజన్మల్లోని వివరాలన్నీ గుర్తుండవు గానీ ఆ వివరాల తాలూకు మొత్తం అనుభూతి సంస్కార రూపంలో గుర్తుండి పోతుంది.**

దీన్ని ఇంకో ఉదాహరణతో కూడా ఇలా చెప్పచ్చు.

షేక్స్పియర్ డ్రామాలు వేసే ఓ నటుడు ఇంట్లో ఉన్నప్పుడు తను వేసిన అన్ని నాటకాల్లోని పాత్రలని గుర్తు తెచ్చుకోగలడు. కానీ ఓసారి హేమ్లెట్ నాటకం వేస్తూండగా, ఆ పాత్రలన్నింటినీ మరిచి కేవలం హేమ్లెట్ పాత్రలోనే లీనమవుతాడు. అదే విధంగా ఆత్మకి అంతకు మునుపు జన్మల్లోన్ని విషయాలన్నీ గుర్తున్నా, ఓ జన్మలోని తక్కువ పరిధిలోని వ్యక్తిత్వానికి మాత్రం అది గుర్తుకు రాదు.

**ఈ ఉదాహరణలన్నీ, ఎప్పుడో మనకి గుర్తులేని జన్మల్లో చేసిన పనులకి ఈ జన్మలో శిక్ష అనుభవించడం సరికాదనేవారి వాదనని కొట్టి పారవేస్తాయి. బాల్యంలో చేసిన హత్యకి వృద్ధాప్యంలో శిక్ష పడకూడదనడం ఎంత హాస్యాస్పదమో ఇదీ అంతే హాస్యాస్పదం.**

**అన్ని జన్మల తాలూకు పూర్తి జ్ఞాపకాలు సబ్కాన్షస్ మైండ్లో నిలువ ఉంటాయి. కేసీ దీన్ని సోల్మైండ్ (ఆత్మమెదడు) అన్నాడు. మనం ఉపయోగించేది బాడీమైండ్ (శరీరమెదడు).**

కేసీ దయ్యాలని కూడా ఒప్పుకున్నాడు. కొందరు మానసిక రోగుల రోగాలు ఈ జన్మలోని శారీరక బాధల వల్ల కలిగాయని, మరికొందరికి 'దయ్యం పట్టడం' వల్ల వచ్చాయని చెప్పి వాటి నివారణకి ఉపాయాలు చెప్పాడు. హైయ్యర్ పొటెన్సీలో ఉన్న విద్యుత్ ప్రసారం వల్ల తక్కువ వేవ్లెంగ్త్ కల దెయ్యాలు పారిపోతాయి. మన దైవ ప్రార్థనలలో ఉచ్చరించే మంత్రాల వల్ల వచ్చే హై వైబ్రేషన్స్ వల్ల కూడా అదే జరుగుతుంది. అందువల్లనే ఈ రెంటిని సాధారణంగా వాటికి నివారణోపాయంగా చెప్తారు.

ఓ మనిషి ఇంకో మనిషిని ఎలా పోలి ఉండడో, అలాగే ఓ మనిషి స్వభావం ఇంకో మనిషిని పోలి ఉండదు. ఈ ప్రపంచములో ఎన్ని కోట్ల మంది మనుష్యులున్నారో అన్ని కోట్ల స్వభావాలున్నాయి.

**అయితే విరుద్ధ స్వభావాలకి (సిజోఫ్రోనియాక్) మూలమైనటువంటి ఎడ్గర్కేసీ రీడింగ్స్లో దీనికి సరైన సమాధానం లభిస్తుంది. పూర్వజన్మల్లో పొందిన అనుభవాలని మర్చిపోకుండా వెంట తెచ్చుకోబట్టి ఈ ద్వంద స్వభావాలుగా అవి వ్యక్తమౌతాయని తేలుతోంది.**

1853లో పుట్టిన అలబామా రాష్ట్రంలోని ఓ రైతుకి నీగ్రోలంటే పడదు. వాళ్ల పొడ గిట్టదు. ఎడ్గర్కేసీ హిప్నాటిక్ ట్రాన్స్లో అందుకు కారణం ఇలా చెప్పాడు.

"2200 ఏళ్ల క్రితం నువ్వు ఆఫ్రికన్ మనుష్యుల వ్యాపార ఓడలో ఓడ నడిపే తెడ్లని వేసే బానిసగా కొంతకాలం గడిపావు. అప్పుడు వాళ్లంటే నీకు కలిగిన ద్వేషభావమే ఇప్పుడు నీ స్వభావంగా వ్యక్తమౌతోంది."

అతనప్పటికే శ్వేతజాతి గొప్పదనాన్ని నిలబెట్టే ఓ సొసైటీని స్థాపించి ఉన్నాడు. ఇలాంటి డజన్లకొద్దీ కేసులు కేసీ ఫైల్స్లో చూడవచ్చు. యూదు మతస్థులైన తన పొరుగువాళ్లని ద్వేషించే ఓ వ్యక్తి గతజన్మలో

యూదుల వల్ల అనేక బాధలు అనుభవించాడని కేసి చెప్పాడు. జాతిపరమైన, మతపరమైన ద్వేషమే కాక పురుషద్వేషం లేదా స్త్రీ ద్వేషం కూడా పూర్వజన్మల్లోని అనుభవాలే కారణం అవుతాయని కేసి రీడింగ్స్‌లో తేలింది.

ఓ 38 ఏళ్ల బ్రహ్మచారిణి అనేకమంది పురుషులతో ప్రేమలో పడ్డా ఎవరినీ వివాహం చేసుకోలేదు. మగాళ్లంటే అపనమ్మకమే అందుకు కారణం. ఈ స్వభావానికి కారణం - పూర్వజన్మల్లోని ఓ జన్మలో తనని వదిలి మతయుద్ధాలలో పాల్గొనడానికి వెళ్లిన భర్తని ద్వేషించడం అనే అనుభవం వల్ల ఈ పురుషద్వేషం ఆమెలో నిలిచిపోయి ఇప్పుడు వ్యక్తమౌతోంది.

**అదే విధంగా సంగీతం, నృత్యం, సాహిత్యం, ప్రకృతి ఆరాధన మొదలైన వాటిమీద అభిరుచులన్నీ కూడా ఓ ఆత్మ తనతో వెంట తెచ్చుకునే పూర్వజన్మల్లోని అనుభవాల ఫలితాలే అని కూడా కేసి రీడింగ్స్ స్పష్టం చేస్తున్నాయి.**

న్యూయార్క్‌లో పుట్టిపెరిగిన ఓ పళ్ల డాక్టర్ అవకాశం ఉన్నప్పుడల్లా తుపాకీ తీసుకుని అడవుల్లోకి వెళ్లి వేటాడడంలో గడిపేవాడు. అతను పూర్వజన్మలో హాలెండ్ నుంచి అమెరికా వచ్చి న్యూజెర్సీ రాష్ట్రంలో స్థిరపడి, కొన్ని రకాల జంతువులని పట్టుకుని అమ్మడం, ఉన్ని కోసం జంతువులని చంపడం వృత్తిగా తీసుకుని జీవించాడు. ఆ అనుభవాలవల్లే ఇప్పుడు అతనికి వేట మీద ఆసక్తి కలుగుతోంది అని కేసి చెప్పాడు.

**అదే విధంగా పూర్వజన్మలో తాము నివసించిన ప్రాంతాలకి దూరంగా పుట్టిన వారు తరచూ ఈ ప్రాంతాలకి రావడం, ఆ ప్రాంతాల మీద మక్కువ కలిగి ఉండడం కూడా కేసి రీడింగ్స్‌లో స్పష్టమయింది.**

అమెరికాలోని ఈస్ట్‌కోస్ట్‌లో పుట్టిన ఓ యువతి అన్నీ వదులుకుని న్యూమెక్సికోకి వెళ్లి స్థిరపడడానికి ఇదే కారణమని కేసి చెప్పాడు. మరో నలుగురి కేసుల్లో వారు సౌత్ సీ ఐలాండ్స్, ఇండియా, చైనా, న్యూఆర్లియన్స్ రాష్ట్రాలని ఇష్టపడడానికి కారణం వారి పూర్వజన్మానుభవం వల్లనే అని కేసి చెప్పాడు. ఓ యువతికి గ్రీక్ నృత్యం, నాటకం మీద గల అభిరుచికి కారణం, గతజన్మలో ఆమె గ్రీస్‌లో పుట్టినప్పుడు ఇవి అక్కడ ఉచ్ఛస్థాయిలో ఉన్నాయి. టెలిపతీ మీద ఆసక్తిగల ఓ యువకుడికి ఆ ఆసక్తి జనించడానికి కారణం, పూర్వజన్మల్లో ఓ దాంట్లో అట్లాంటిస్‌లో అతను ఆలోచనలని ట్రాన్స్‌మిట్ చేసే మానసిక శాస్త్ర టీచర్‌గా పని చేయడం వల్లనే అని కేసి చెప్పాడు. అలాగే ఓ అందమైన యువతికి విమానం నడపడం మీద గల ఆసక్తి కూడా అట్లాంటిస్‌లో ఆమె ఓ జన్మలో విమాన చోదకురాలిగా పని చేయడం వల్ల కలిగింది.

కుంటి పిల్లల ఆలనాపాలనా చూసే వృత్తిని ఓ యువతి ఎన్నుకోవడానికి కారణం ఆమె పాలస్తీనాలో ఓ జన్మలో క్రీస్తు గ్రంథాలు చదివి ఆ స్ఫూర్తితో అలాంటి పిల్లలకి సేవ చేసిన జీవితం గడపడమే. తాగుబోతయిన ఓ ధనిక కుటుంబానికి చెందిన యువకుడు గతజన్మలో అమెరికాలో గోల్డ్‌రష్ పీరియడ్‌లో తాగుడికి బానిస అయ్యాడు. ఆ అనుభవంతో ఈ జన్మలో తిరిగి ఆల్కహాల్ అంటే ఇష్టపడి తాగుతున్నాడు. ఏదైనా ఎంతో తార్కికంగా మాట్లాడే ఓ బాలుడు తన పూర్వజన్మలో 'ఆల్‌ఫ్రెడ్ ది గ్రేట్' కోర్టులో లాయరుగానూ, మరో జన్మలో పర్షియాలో లాయర్‌గానూ పని చేసాడు కాబట్టి ఆ స్వభావాన్నే ఈ జన్మలో కూడా పుణికిపుచ్చుకున్నాడు. 19వ శతాబ్దంలో టీచర్‌గా పనిచేసిన ఒకామె ఈ జన్మలో ఏ విషయం అయినా ఓపికగా చెప్పే స్వభావంతో పుట్టింది.

**ధైర్యం, నిజాయితీ, నిస్వార్థతలాంటి అనేక గుణగణాలు లేదా ఏదైనా కళలో నిపుణత-సంగీతం, నటన, సైన్స్, లేదా లెక్కలలో ప్రతిభ ఇవన్నీ పూర్వజన్మానుభవాల వల్ల ఈ జన్మలో వికసిస్తాయి. ఏ వృత్తి లేదా ఏ కళలోనైనా నైపుణ్యం ప్రదర్శిస్తే అతను అనేక గతజన్మల్లో ఆ సబ్జెక్టులలో బాగా కృషి చేయబట్టే ఈ జన్మలో దాని పరిపక్వతని ప్రదర్శిస్తున్నాడని భావించవచ్చని కేసి స్పష్టంగా చెప్పాడు.**

**ఓసారి నిస్వార్థత, నిజాయితీ, పరోపకారంలాంటి స్వభావాలను ఆత్మ కొన్ని జన్మలు పాటిస్తూ వస్తే అవి ఇక శాశ్వత స్వభావంగా మారి ఆ ఆత్మ భవిష్యత్తులో తీసుకునే జన్మల్లో అందుకు వ్యతిరేక దిశలో ప్రయాణించదని కూడా కేసి చెప్పాడు. ఎందుకంటే ఈ సుగుణాలన్నీ పెంపొందించుకోవడానికి ఆ ఆత్మ ముందు అందుకు వ్యతిరేకంగా ప్రవర్తించి అందుకు కర్మఫలితాలను అనుభవించి ఈ పాఠాలు నేర్చుకుంది కాబట్టి ఇక మళ్లీ వెనక్కి అడుగేసి తిరిగి అలా దుర్మార్గంగా ప్రవర్తించలేదు. ఆ మేరకు ఆ ఆత్మ ఆ దుర్మార్గపు, స్వార్థపు రాక్షసగుణాల నుంచి స్వతంత్రం పొందిందన్నమాట.**

అనేక స్వభావాలు గలవారు మనకి తారసపడుతూంటారు. **గర్వపోతులు, ఏం మాట్లాడినా తప్పు పట్టేవారు, నోటితో పొగిడి నొసలతో వెక్కిరించేవారు, అందరితో స్నేహంగా ఉండేవారు, స్వార్థపరులు - వీరి ఈ వ్యక్తిత్వాల నిర్మాణానికి కారణం వారి పూర్వజన్మానుభవాలు అని కేసి చెప్పాడు. (వీటినే మనం వాసనా సంస్కారాలు అంటాం).**

ఓ మనిషి ఇంట్రావర్ట్‌గా(సిగ్గరిగా) లేదా ఎక్ట్రావర్ట్‌గా (కలివిడితనంగా) ఉండడానికి కారణం కూడా పూర్వజన్మానుభవాలే అని కొన్ని కేసుల ద్వారా తెలుస్తోంది. ఉదాహరణకి అందంగా పాడగలిగే ఓ అందమైన యువతి ఎంతో సిగ్గరి. ఎవరితోనూ కలిసేది కాదు. కేసి ఆమెకి ఇలా చెప్పాడు.

"పూర్వజన్మలో నువ్వు ఓ అందమైన ఫ్రెంచి యువతివి. నీకు అనేక కళలు తెలుసు. ఐతే వాటిని నువ్వు ఇతరుల ముందు ప్రదర్శించడానికి ఇష్టపడని నీ భర్త నిన్ను ఆ విషయంలో అణిచేసాడు. ఒక్కోసారి కొరడాతో కొట్టేవాడు కూడా. దాంతో నువ్వు మానసికంగా అణగారి పోవడంతో అదే స్వభావం ఈ జన్మలో కూడా వచ్చింది."

ఈ జన్మలో మనుష్యులతో కలవలేని స్వభావం కల ఓ సేల్స్‌మెన్ గతజన్మలో సౌత్ ఆఫ్రికాలో ఎక్స్‌ప్లోరర్‌గా వంటరిగా జీవించేవాడు. దాంతో ఆ జన్మలో మనుష్యులతో సంపర్కం లేక ఇప్పుడు తోటి మనుష్యులతో ఎలా ప్రవర్తించాలో తెలియడం లేదు. **ఆత్మన్యూనతా భావానికి లోనయిన ఓ హైస్కూల్ విద్యార్థినికి ఈ స్వభావం పూర్వజన్మనుంచి వచ్చింది.** ఆ జన్మలో ఆమె రెడ్ ఇండియన్‌గా పుట్టి తెల్లవాళ్ల ముందు తను ఎంతో తక్కువది అన్న భావనతో జీవించబట్టి ఈ జన్మలో కూడా అదే ఇన్ఫీరియారిటి కాంప్లెక్స్ వచ్చింది. ఎంతో నిపుణుడైన ఓ డాక్టర్‌కి తను రోగి రోగాన్ని సరిగా నిర్ణయించాడా లేదా అనే అనుమానం ఎప్పుడూ కలుగుతూంటుంది. ఈ మానసిక జబ్బు అతనికి పూర్వజన్మానుభవంగా వచ్చింది. క్రితం జన్మలో అతను అమెరికన్ సివిల్‌వార్ సమయంలో ప్రజాసంక్షేమాధికారిగా ఉండగా అతను చేసింది ప్రతీది, తోటివారు విమర్శించి వెక్కిరించేవారు. దాంతో అతనిలో తను చేసేది కరెక్టేనా అనే అనుమానం మొదలై అది ఈ జన్మలో కూడా వ్యక్తమౌతోంది. *(ఇలాంటి వారు కొందరు షాపుకి లేదా ఇంటికి తాళం వేసాక ఒకటికి పదిసార్లు దాన్ని లాగి చూస్తారు పడిందా లేదా అని.)*

**కలివిడితనం కూడా గతజన్మలోని అనుభవాల ఫలితంగానే సంభవిస్తుంది.** 38ఏళ్ల ఓ యువతి అందరితో కలివిడిగా ఉండేది. కారణం ఆమె ఫ్రెంచ్ చక్రవర్తి లూయిస్16 కి ఉంపుడుగత్తెగా ఉంటూ అతనితో ఎంతో కలివిడిగా ఉండేది. అంతే కాదు, ఆ జన్మలో ఆమె ఆ ఫ్రెంచ్ చక్రవర్తి నుంచి పనిమనిషి దాకా అందరిని శాసించే గుణం కలిగి ఉండేది కాబట్టి అదే గుణం ఈ జన్మలో కూడా ఉంది. ఫలితంగా కలివిడితనంతో పొందిన భర్తలు ముగ్గురూ ఆమె శాసించే గుణాన్ని భరించలేక విడాకులిచ్చారు. నిజానికి మనిషి స్వభావం ముందు సిగ్గరిగా కానీ, కలివిడిగా గానీ ఉండదు. మామూలుగా ఆనందదాయకంగా ఉంటుంది. అయితే ఓ జన్మలో పొట్టికాలు లేదా నత్తిలాంటి ఏదో ఒక కారణంతో అంతా తనని చిన్నచూపు చూస్తూండడంతో సిగ్గరిగా మారతారు.

ఉదాహరణకి 18వ జన్మదాకా మామూలుగా ఉండి 19వ జన్మలో సిగ్గరిగా మారాడనుకుందాం. అక్కడ నుంచి చైన్‌రియాక్షన్ మొదలవుతుంది. మొదట ఈ సిగ్గరితనం కొద్దిగా ఇబ్బందికరమైనదే అయినా ఆరోగ్యకరమైనదిగా మొదలవుతుంది. అందువల్ల అతనికి మానసిక రక్షణ కలుగుతుంది. కానీ 20, 21, 22 జన్మలకి వచ్చేసరికి ఈ సిగ్గరితనం అధికమై అతను ఓ బంగారు ఒంటిస్తంభం మేడ కట్టుకుని దాంట్లో కూర్చున్నవాడిలా ఇతరులని పూర్తిగా పట్టించుకోవడం మానేస్తాడు. దాంతో కష్టాల్లో ఉన్నవారిని చూసి స్పందించడు. అది దుష్కర్మ అవుతుంది. ఆ సిగ్గరితనం 21, 22, 23 జన్మలదాకా సాగి 23వ జన్మలో ఆ స్వభావం వలన ఈ రకం దుష్కర్మలు పెరిగి అతని ఆత్మ తిరిగి దాన్ని దిద్దుబాటు చేసుకోవడం మొదలుపెడుతుంది. దాంతో తిరిగి సిగ్గరితనం వదిలించుకుంటూ 23, 24, 25 జన్మలు వచ్చేసరికి కలివిడితనం అలవడుతుంది. 25వ జన్మకల్లా పూర్తి ఆరోగ్యకరమైన కలివిడితనం అలవరచుకుంటాడు.

అయితే అది మరీ పెరిగి అధిక సిగ్గరితనం వల్ల కలిగే దుష్పరిణామాల్లా అధిక కలివిడితనం వల్ల 26, 27, 28 జన్మలు గడిచేసరికి అహం పెరిగి ఎవ్వరినీ లెక్కచేయని స్థితికి వచ్చి ఆ స్వభావంతో మళ్లీ దుష్కర్మలు చేస్తాడు.

దీన్ని బాలెన్స్ చేయడానికి మళ్లీ సిగ్గరితనం క్రమంగా మొదలవుతుంది. మరో మూడు, నాలుగు జన్మలు గడిచేసరికి ఏ కలివిడితనం ఆరోగ్యకరమో అలాగే ఏ సిగ్గరితనం ఆరోగ్యకరమో ఆ రెంటి మధ్యగల స్థితిలో ఆ ఆత్మ స్థిరపడుతుంది. ఆ తరువాత ఇక అక్కడ నుంచి అటూ ఇటూ కదలదు.

ఒక్క ఈ విషయంలోనే కాక **అన్నీ విషయాల్లో ఆత్మ ఇలా కొన్ని జన్మలపాటు "రెంటి మధ్యగల సరియైన స్థితి"ని ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతి ప్రకారం అలవరచుకుంటూ ప్రయాణిస్తూంటుంది. అది స్వార్థం, ధనవ్యామోహం, కామం, క్రోధం, అసూయలాంటి కొన్ని వందల వ్యతిరేక భావాల విషయంలో 'ఆరోగ్యకరమైన పాయింట్' దగ్గర స్థిరపడుతూ వస్తూంటుంది.**

**అలా ఆత్మ ప్రయాణం కొన్ని వందల లేదా వేల జన్మలు తీసుకుని కానీ అన్నిటా 'సరియైన స్థితి' వైపు ప్రయాణించలేదు. గీతలో భగవానుడు అందుకే 'బహూజన్మానాం...' అంటే - అనేక జన్మలో తరువాతే నన్ను తెలుసుకోగలుగుతారు అన్నాడు. దానికి ఇదే అర్థం అయి ఉండచ్చు. ప్రతీ ఆత్మకి ఉండే అసంపూర్ణతని ఆధ్యాత్మిక కరెక్షన్ ద్వారా పరిపూర్ణతని చేకూర్చడమే అనేక జన్మల లక్ష్యం. ప్రతీ జన్మలో ఆత్మ ఇలా కొత్తది నేర్చుకుంటూ, ఆధ్యాత్మిక అభివృద్ధి సాధించుకుంటూ ప్రయాణం చేసాక ఓ జన్మలో ఇక కొత్తగా నేర్చుకోవాల్సింది ఏదీ లేని ఆధ్యాత్మిక పరిపూర్ణతని చేరుకోగానే అది ముక్తి పొందుతుంది. ఎందుకంటే ఇంకా కొత్త పాఠాలు నేర్చుకోవడానికి దానికి కొత్తజన్మలు తీర్చుకోవాల్సిన అవసరం ఉండదు.**

**ఆ తరువాత కావాలనుకుంటే ఆ ఆత్మలు మనుష్యరూపంలో అజ్ఞానులైన మానవులని సంసార సాగరం నుంచి గట్టెక్కించడానికి తిరిగి జన్మలు తీసుకుని మనుష్యులని ఉద్ధరిస్తూ ఉంటారు. ఉదాహరణకి పండిత శ్రీరామశర్మ ఆచార్యగారు, శ్రీరామకృష్ణ పరమహంస, మాస్టర్ సి.వి.వి మొదలుగువారు అలా వచ్చిన పరిపూర్ణ ఆత్మలే.**

ఎడ్గర్‌కేసి రీడింగ్స్ ద్వారా పై విషయం స్పష్టమౌతోంది. అతను అనేకమంది సమస్యలు విన్నాక ఇచ్చిన సలహాలన్నీ కూడా ఈ విధమైన ఆధ్యాత్మిక పరిపూర్ణత సాధించడానికి ఉద్దేశించినవే.

ఉదాహరణకి చక్కగా మాట్లాడుతూ ఎంతో కలివిడిగా ఉండే ఓ అందమైన యువతికి నటి అవ్వాలన్న కోరిక. కానీ ఆమె పొట్టి, లావు. దాంతో వ్యాపారరంగంలోకి కాలు పెట్టింది. కేసి ఆమెకి రీడింగ్ ఇస్తూ ఇలా చెప్పాడు.

"నువ్వు నీ పూర్వజన్మలో అమెరికన్ రివల్యూషన్ సమయంలో నర్తకిగా ఉంటూ, మంచి పొజిషన్ సంపాదించావు. కానీ నీ శీలాన్ని అందుకు పణంగా పెట్టావు. ఈ జన్మలో నువ్వు ఇతరులని నీ మాటలతో ఇన్‌ఫ్లూయన్స్ చేయగల సమర్థత, సంభాషణా చతురత ఆ జన్మనుంచి లభించాయి. కానీ వాటిని నువ్వా జన్మలో నీ స్వార్థానికే తప్ప నిస్వార్థతకి లేదా ఆధ్యాత్మిక అభివృద్ధికి వినియోగించలేదు.

దాంతో నీ శరీరాకృతి ఈ జన్మలో ఆ తప్పు తిరిగి చేయకుండా ఉండడానికి ఇవ్వబడింది. కాబట్టి ఈ జన్మలో నువ్వు నీ నటనా నైపుణ్యాన్ని నిస్వార్థంగా ఆధ్యాత్మిక అభివృద్ధి కోసం ఉపయోగించు. అనాథ శరణాలయాల్లో ఉండేవాళ్లకి, వృద్ధులకి మొదలైన వాళ్లకి నువ్వు కథలు అందంగా చదివి వినిపించు. ఇలాంటి నిస్వార్థ సేవకోసం నీ నైపుణ్యాన్ని వినియోగిస్తే ఆధ్యాత్మికంగా నువ్వు అభివృద్ధి చెందుతావు".

**ఇలాగే గుణాన్ని కరెక్ట్ చేయడం ద్వారా ఆధ్యాత్మిక అభివృద్ధి పొందే** ఇంకో కేసు గురించి చూద్దాం.

49 ఏళ్ల ఓ యువతిని ఎవరూ దగ్గరికి రానివ్వరు. చిన్నప్పుడు ఆమె అక్కలు, అన్నలూ, తమ్ముళ్లు ఆమెని దూరంగా ఉంచేవారు. ఆమె ముగ్గురిని ప్రేమించింది. వారూ ఆమెను ప్రేమించారు కానీ ఇతరులని పెళ్లి చేసుకున్నారు. దాంతో ఆమె కేసికి తన దుస్థితిని వివరిస్తూ రాసిన ఉత్తరంలో ఇలా రాసింది.

'ఓ గుంపులో ఉన్నా ఆ గుంపులోని అంతా నన్ను వదిలి దూరంగా వెళ్లిపోతారన్న భయం వేస్తూంటుంది. నన్నెవ్వరూ దగ్గరకి రానివ్వరు. ఇతరులు నన్ను దగ్గరకి రానివ్వాలని, ప్రేమించాలన్న కోరికతో వాళ్ల కోసం ఏదైనా చేయాలనిపిస్తూంటుంది. దాంతో నా సౌకర్యాన్ని, ఆరోగ్యాన్ని త్యాగం చేసి ఇతరుల కోసం ఏదైనా చేస్తూంటాను. నాకెందుకీ శిక్ష పడింది?'

దానికి కేసి ఇచ్చిన జవాబు.

"గతజన్మలో నువ్వు ఒహాయి రాష్ట్రములో సెటిలైన ప్రథముల్లో ఒకరివి. నువ్వు అందరితో కలివిడిగా ఉండేదానివి. కానీ అది కేవలం నీ స్వార్థం కోసమే. నీకు సహాయం చేయలేని వారిని దగ్గరకి రానిచ్చేదానివి కాదు. అవసరం తీరాక వాళ్లని దూరంగా విసిరేసే దానివి. నువ్వు ఎవరినైతే అలా ట్రీట్ చేసావో సరిగ్గా వాళ్లే నేడు నిన్ను తమ దగ్గరకి రానివ్వడం లేదు. ఇతరులను నీ విజయానికి మెట్లుగా వాడుకొన్న ఆ జన్మలోని దుష్కర్మే నీకు ఈ జన్మలో ఈ పాఠం నేర్పింది. నిన్ను దగ్గరకి రానివ్వాలంటే ఎవరికైనా సరే, నువ్వు సేవ, సహాయం చేయాలన్న పాఠం నీ ఈ జన్మలోని అనుభవాల ఫలితంగా నేర్చుకుంటున్నావు కాబట్టి దాన్ని వదలక కొనసాగించు. నీ కర్మ నిన్ను ఇలా సరిదిద్దుతోంది. ఇది నీ మంచికే. నిస్వార్థసేవ ఒక్కటే నీ పురోగతికి సహాయం చేసేది అని మరువక.

***ఓ రోజు నువ్వు చాలా మందిని దగ్గరగా రానివ్వలేదు. దాంతో నేడు చాలా మంది నిన్ను దగ్గరకి రానివ్వడం లేదు.***

**ఓపికగా ఉండడం నేర్చుకో. అది అన్ని సద్గుణాలలోకి మహరాజు. ఓపికగా వేచి ఉండే గుణంతోనే నువ్వు ముందుకెళ్తావు."**

ఎక్స్ట్రావర్ట్ సాధారణంగా ఇతరులెలా ఫీలవుతారన్నది పట్టించుకోకుండా ప్రవర్తిస్తారు. ఇంట్రావర్ట్ ఇతరులు తనని ఎలా పట్టించుకుంటున్నారో అని ఫీలవుతూంటారు. ఈ రెండూ దుష్కర్మలే. వీటికి మధ్య బాలన్స్‌గా ఉండగలగడం ఆధ్యాత్మిక పరిపూర్ణత్వం. గడియారం పెండ్యులమ్ అటూ ఇటూ కొన్నిసార్లు ఊగాక కానీ చివరికి కదలకుండా ఓ చోట ఆగదు. అలాంటి స్థితిని ఆగిన పెండ్యులమ్‌తో పోల్చచ్చు.

కర్మ విషయంలో అనేక ఆధ్యాత్మిక సిద్ధాంతాలున్నాయి. ఓ ఆధ్యాత్మిక సిద్ధాంతం ప్రకారం, మన ప్రమేయం లేకుండా వాటంతట అవే వచ్చి పడే కష్టసుఖాలన్నీ ప్రారబ్ధకర్మలు. మిగిలినవి కావు. ఉదాహరణకి ఓ వాహనంలో వెళుతూ ఉంటే యాక్సిడెంట్ అయి కాలు విరగడం ప్రారబ్ధకర్మ. అదే ఎవరితోనో పోట్లాట పెట్టుకుని ఓ రోజు

వారు మన కాలు విరగ్గొడితే అది ప్రారబ్ధకర్మ కాదు. ఈ జన్మలో కర్మ తాలూకు వేగవంతమైన ఫలితం.

మరో సిద్ధాంతం ప్రకారం మనం ఈ జన్మలో ధర్మంగా చేయాల్సిందంతా మన ప్రారబ్ధకర్మ. దాన్ని చేయకపోతే అది వచ్చే జన్మలలో ఇంకాస్త ఘనంగా తగులుకుంటుంది. ఉదాహరణకి వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రులని చూసుకోవాల్సిన ధర్మం కొడుకుది. అతను ఆ బాధ్యతను విస్మరించి వాళ్ళ ఏ ఓల్డేజ్ హోమ్‌లోనో లేదా మరొకరి దగ్గరో ఉంటే ఆ విధంగా ఈ జన్మలో ఆ కొడుకు తప్పించుకునే ఈ బాధ్యత వచ్చే జన్మల్లో వడ్డీతో సహా కలిసి అతను తప్పించుకోలేని విధంగా అతని చేత ఆచరించబడుతుంది.

తల్లితండ్రులని చూడాల్సిన భాధ్యతని తప్పించుకున్న కర్మఫలం వల్ల వచ్చే జన్మలో అతనికి ఏ అంగవికలుడో లేదా మానసిక వికలాంగుడో జన్మించి అతని పోషణాభారం ఇతనిమీద పడచ్చు. ఆ విధంగా తప్పించుకున్న ఆ ప్రారబ్ధకర్మ తిరిగి అతనికి తప్పించుకోలేని గుదిబండగా మారచ్చు. ఈ కారణంగానే రామకృష్ణపరమహంసను ఎవరో ఆయనకి వచ్చిన  కాన్సర్ వ్యాధిని సంకల్పంతో తీసేసుకోమంటే 'దాని కోసం తిరిగి ఎందుకు పుట్టడం?' అని ఆయన ఆ పని చేయలేదు.

మనం చదివిన ఎడ్గర్ కేసి కేసుల్లో చాలా భాగం కర్మఫలాలు వ్యాధిరూపంలో పీడించడానికి కారణం తల్లితండ్రులని పోషించడం తప్పించుకున్నంత తేలికగా వాటి నుంచి తప్పించుకోవడం సాధ్యం కాకపోవడానికేనేమో!

ఓ జన్మలో అధికంగా చేసే ఒకే రకం కర్మల తాలూకు ఫలితాలు ఆ జన్మలోనే కనిపిస్తాయని శాస్త్రం చెబుతోంది.

"అత్యుగ్రపుణ్యపాపానామి హైవ ఫల మాప్నుయాత్
తస్మాత్ జ్జుగుత్సితం కర్మ త్యక్తవ్యం భూతి మిచ్ఛతా"
---- శ్రీదేవి భాగవతం.

'భావం : ఈ జన్మలో పాపపుణ్యాలను అత్యధికంగా చేస్తే వాటి ఫలితాలను ఈ జన్మలోనే అనుభవించాల్సి వస్తుంది.'

ఇందుకు ఉదాహరణగా ఆల్కహాల్ అధికంగా తీసుకునే వాళ్లని చెప్పుకోవచ్చు. పంచమహాపాతకాల్లో ఆల్కహాల్ ఒకటి. అది అధికంగా తీసుకుంటే భయంకరమైన లివర్ కాన్సర్ వ్యాధిగా దాని ఫలితం అనుభవించడం చూస్తూంటాము లేదా మూత్రపిండాలు ఫెయిల్ అవడం. అదే విధంగా అధికంగా సిగరెట్లు తాగితే ఊపిరితిత్తులు లేదా గుండె జబ్బులు రావచ్చు.  ఒక్కసారి దొంగతనం చేసిన వాడు పట్టుబడకపోవచ్చు గానీ ఎక్కువ సార్లు దొంగతనం చేసినవాళ్లు పోలీసులకి పట్టుబడతారు.

**తక్కువ పరిమాణంలో తీసుకుంటూ ఈ జన్మలో చేసే ఆ వ్యసనం తాలూకు పాప ఫలితం శారీరకంగా వెంటనే అనుభవించకపోయినా, మరుజన్మలో ఆ పాపఫలితాన్ని వెంట తీసుకువెళ్లి, అలాంటి అలవాటు లేకపోయినా కూడా, పుట్టుకతోనే లేదా జన్మ మధ్యలోనైనా కర్మ పరిపాకం అయినప్పుడు అనుభవించాల్సి వస్తుంది. అంతేగానీ అనుభవరహితంగా ఆ కర్మ ఫలితం చూపకుండా ఉండదు. సాధారణంగా ఈ చెడ్డ అలవాటు తాలూకు సంస్కారం వచ్చే జన్మలో కూడా ఉండి, ఆ మనిషి అటువైపుకి మొగ్గుతాడు. ఇప్పటి జన్మకన్నా అప్పుడు ఆ అలవాటు మీద ఎక్కువ ఆప్యాయత కలిగి ఉంటాడు.**

అదే విధంగా 6, 7 శివాలయాలు కట్టిస్తే దాని సత్ఫలితం ఈ జన్మలోనే అనుభవిస్తారు. మనకేం చెడు జరిగినా, ఏం కష్టం వచ్చినా ' ఇదంతా నా ప్రారబ్ధం' అనుకుంటూంటాం. కానీ అన్నీ ప్రారబ్ధకర్మల వల్లే

జరగాల్సి లేదు.

మనిషి ఈ జీవితంలో చేసే కర్మలకి స్థూలంగా రెండు రకాల ప్రేరణలుంటాయని చెప్పచ్చు.

**1) ప్రారబ్ధకర్మ ప్రేరణ.**

**2) స్వతంత్ర కర్మ ప్రేరణ.**

ఉదాహరణకి ఓ తమ్ముడు అన్నని మోసం చేసి ఆస్థిలో అన్న భాగం అతనికి చెందకుండా, తండ్రి రాసిన విల్లు తారుమారు చేసి తండ్రి స్వార్జితమైన ఇంటిని తను పూర్తిగా కొట్టేసాడు. ఆ అన్నకి తమ్ముడి ద్వారా ఇలా జరగాలన్న కర్మఫలం అనుభవించే గీత ఉంటే ఇది ప్రారబ్ధకర్మ ప్రేరణ అవుతుంది. ఈ జన్మలో అన్నకి తమ్ముడు చేసే మోసం ద్వారా తను పొందాల్సిన ఆస్తిని పొందక పోవడమనే ప్రారబ్ధకర్మ ఉండబట్టే తమ్ముడు అలా వక్రంగా ప్రవర్తించాడు.

ఒకవేళ ప్రారబ్ధకర్మ వల్ల కాక తమ్ముడికి స్వతంత్ర కర్మ ప్రేరణ (స్వార్థం) వల్ల కలిగి ఉంటే, అప్పుడు అన్నకి తండ్రి ఆస్తిని కోల్పేయే ప్రారబ్ధకర్మ లేకపోయినా అది కోల్పోతాడు. తమ్ముడు మాత్రం కొత్తగా ఈ జన్మలో ఆ చర్య ద్వారా భవిష్యత్ జన్మల్లో అనుభవించాల్సిన కర్మఫలితానికి (ఆగామికర్మ) బీజం వేసుకుంటున్నాడన్నమాట.

**ఎప్పుడైతే మనిషి అధర్మంగా ప్రవర్తించాడో అప్పుడు తప్పనిసరిగా కర్మబంధంలో చిక్కుకుంటాడని, ధర్మంగా ప్రవర్తిస్తే కర్మబంధంలో చిక్కుకోడని ధర్మశాస్త్రం చెప్తోంది.**

పై రెండు ఉదాహరణలలో కూడా స్వార్థ, స్వతంత్ర ప్రేరణ వల్ల అధర్మం చేస్తే ఆ తమ్ముడు దాని తాలూకు కర్మబంధంలో చిక్కుకుంటున్నాడు. లేకపోతే ఆ తమ్ముడు ఎలాంటి కర్మబంధంలో చిక్కుకునే అవకాశం లేదు.

**అందుచేత మనం స్వార్థానికి లొంగకుండా ఎల్లప్పుడూ ధర్మబద్ధమైన కర్మలు చేయాలి. అప్పుడే అవి బంధ హేతువులు కావు -- భగవదార్పణమస్తు అనే భావనతో అలాంటి కర్మలు చేస్తే అవి మనల్ని అంటవు.**

**మన కర్తవ్యాన్ని విస్మరించకుండా కర్మలు చేస్తూ ఇతరుల నుంచి ఏదీ ఉచితంగా, అంటే వారు మనస్ఫూర్తిగా ఇచ్చినా సరే లేదా మోసంతోనో, దొంగతనంతోనో, హింసతోనో మరే అక్రమ పద్ధతితోనో మనం వారి నుంచి మనకి చెందనిది తీసుకున్నా సరే -- అది బంధహేతువవుతుంది. ఆ ఋణాన్ని తిరిగి వారికి ఏదో ఒక జన్మలో మనం చెల్లించి తీరాలి.**

***మనం ఎవరినించైనా ఏదైనా పొందాలనుకుంటే అందుకు తగ్గ రుసుముని వారికి ధనరూపంలోనో, పని లేదా సేవ రూపంలోనో చెల్లించి దాన్ని పొందాలి. అప్పుడది కర్మబంధం కాదు.***

ఈ విషయాన్నే పతంజలి యోగసూత్రాలలో "యమములు" అని చెప్పారు.

*"అహింసా సత్యాస్తేయ బ్రహ్మచర్యా పరిగ్రహాయ యమాః" -- 30వ శ్లోకము, సాధనా పాదము.*

భావం : అహింసా, సత్యం, అస్తేయం, అపరిగ్రహం, బ్రహ్మచర్యం ప్రతీ ఒక్కరూ పాటించాలి. అలా వాటిని గుర్తుంచుకుని పాటించగలగడం వలన కొత్త కర్మలు చేయనివారమవుతాము. అహింస, అస్తేయం (దొంగతనం) చాలా మంది పాటిస్తారు కానీ చాలా మంది ఆధ్యాత్మిక యోగ సాధకులు అపరిగ్రహ సాధనని పాటించరు. అపరిగ్రహం అంటే ఉచితంగా వచ్చేది ఏదీ స్వీకరించకపోవడం.

అపరిగ్రహం అంటే ఏమిటో తెలియని స్థితిలో కొందరు ఆధ్యాత్మిక సాధకులున్నారని ఈ రచయిత అనేక సంధర్భాలలో గమనించాడు. అందుకు కారణం ఏదీ ఉచితంగా తీసుకోకూడదన్న పతంజలి సూత్రం తాలూకు సారం మనస్సులో పూర్తిగా ఇంకకపోవడమే.

**తను తగిన రుసుము చెల్లించకుండా ఇతరులనుంచి ఉచితంగా తీసుకున్నా ప్రతీది అతనికి బంధమై ఏదో ఓ జన్మలో దాన్నతను ఇచ్చినవాళ్లకి తిరిగి చెల్లించే ఋణభారం అతని మీద ఉంటుంది. అందుకోసం జన్మ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఋణభారం కలగకుండా ఉండడానికి అపరిగ్రహ వ్రతం ఆచరించి కొత్త కర్మలు చేయద్దని పతంజలి యోగ సూత్రాలలో ప్రతిపాదించాడు. కానీ మనిషిలోని వ్యక్తిగత స్వార్థం ఈ అపరిగ్రహ వ్రతాన్ని చేయనివ్వదు. అది పెద్ద మొత్తం కానక్కరలేదు. చిన్న చిన్న వస్తువులు లేదా సేవలు కూడా బంధాలవుతాయి.**

రైల్లో తోటి ప్రయాణికుడు తనతో తెచ్చుకున్న పండో, ఫలమో ముక్కూ మోహం తెలియని మనకిస్తే తీసుకోవడం, బస్సులోనూ, రైల్లోనూ మనకన్నా ముందు ఎక్కిన వ్యక్తిని మన కోసం సీట్ రిజర్వ్ చేసి ఉంచమనే సేవని ఇతరుల చేత చేయించుకోవడం, మన ఉత్తరం డబ్బాలో వేయమని ఇవ్వడం, పక్కింటివాళ్లు ఫోన్‌ని ఉపయోగించుకుని డబ్బులు ఇవ్వకపోవడం, ఇద్దరు మిత్రులు కలిసి ప్రయాణిస్తున్నప్పుడు ఆ ఖర్చులను ఇద్దరూ సమానంగా పంచుకోకుండా తన కోసం రెండోవారు ఖర్చు చేసినా తిరిగి దాన్ని అతనికి చెల్లించకపోవడం, ఇతరులతో హోటల్ భోజనానికి వెళ్లినప్పుడు తన భోజనం టిక్కెట్‌ని ఇతరులు కొంటే మిన్నకుండడం, పుస్తకం చదివిస్తానని చెప్పి తిరిగి ఇవ్వకపోవడం, అప్పు తీసుకున్నప్పుడు ఎంత చిన్న మొత్తమైన గుర్తుంచుకుని తిరిగి చెల్లించకపోవడం... ఇలా మనం ఎన్నో పద్ధతులలో ఎదుటి వారి నుంచి ఉచితంగా పొందేవన్నీ బీజరూపంలో నాటుకుని వాటి ఫలితాలని అనుభవించడానికి ఎన్నో జన్మలు ఎత్తాల్సి ఉంటుంది. 'అపరిగ్రహవ్రతం' - ఒక్కటి పాటిస్తే చాలు, ఎన్నో జన్మలు తగ్గించుకోవచ్చు. అలా పాటించకపోతే అనేక జన్మలకి మనమే రూపకల్పన చేసుకున్న వాళ్లమవుతాము. మన స్వభావం అపరిగ్రహానికి ఎంత భిన్నంగా రూపు దిద్దుకుందో తెలియ చేయడానికి చిన్న ఉదాహరణ.

ఈ రచయిత వేసిన ఆధ్యాత్మిక గ్రంధాలు తోటి సాధకులు అడిగి ఉచితంగా తీసుకున్న వారే కానీ దాని ధర చెల్లించిన వారు ఒకరూ లేరు. - అది స్వల్పమే అయినా, వారికి అందుబాటులో ఉన్న ధరే అయినా తీసుకోవాలన్న కోరికే తప్ప ఇవ్వాలన్న స్ఫురణే రాదే!.

(అయితే ఈ రచయిత వారికి అది బ్రహ్మార్పణ భావంతో సమర్పిస్తాడు కాబట్టి ఇతని వైపు నుంచి ఎలాంటి కర్మబంధం ఉండదు అని విశ్వాసం.)

**ఏదీ ఉచితంగా పొందకూడదు. ఏదీ ఫ్రీగా స్వీకరించకూడదు అన్న ఒక సారాంశాన్ని మనస్సులోకి ఎక్కించుకోగలిగితే మన ఆధ్యాత్మిక ప్రయాణంలో సగం దూరం నడిచే ప్రయాస తగ్గుతుంది అన్నది సాధకులు బాగా అర్థం చేసుకుందురు గాక! అయితే ఈ అపరిగ్రహ వ్రతానికి ఒకే ఒక్క మినహాయింపు ఉంది. ఆకలిగా ఉన్నప్పుడు ఎవరేం పెట్టినా తిని, మిగిలింది ఆ రోజు సూర్యాస్తమయం దాటకుండా ఇతరులకి పంచితే అప్పుడది అపరిగ్రహం కిందకి రాదు. ఇలానే ఏ వస్తువైనా. మిగుల్చుకున్నాడా! అది కర్మబంధం అవుతుంది. షిరిడి సాయి బాబా తనకి భక్తులు ఇచ్చిన ధనాన్ని మిగుల్చుకోకుండా సాయింత్రానికి ఇతరులకు పంచడానికి బహూశా ఇదే కారణం అయి ఉండాలి.**

కొంత ప్రారబ్ధకర్మగా మనం జీవితంలో కర్మలు చేస్తాం. కొంత మన స్వతంత్ర కర్మగా చేస్తాం. ఈ స్వతంత్ర కర్మల వల్లే తిరిగి మనం కర్మ బంధంలో చిక్కుకునేది. ఈ స్వతంత్ర కర్మలు చేయడం లేదా చేయకపోవడం అనేది మన పరిధిలోనే ఉంటుంది.

ఓ బీద విద్యార్థికి చదువు చెప్పించడం, ఓ బిక్షగాడికి మన పాత ప్యాంటు, చొక్కా ఇవ్వడం, ఓ నిర్భాగ్యుడ్ని ఏదో విధంగా అదుకోవడం స్వతంత్రకర్మ. అలాగే ఒకరి డబ్బు తస్కరించడం, ఒకరి మీద అపవాదు మోపడం, ఒకరిని అసూయతో ద్వేషించడం కూడా స్వతంత్రకర్మే. ఇదే మనకి పుణ్యాన్ని లేదా పాపాన్ని

తద్వారా వాటిని అనుభవించడానికి కొత్త జన్మని ఇచ్చేది. ఈ మేరకు మనకు స్వతంత్రం ఉంది.

అయితే నిజంగా ఈ మేరకి కూడా మనకి స్వతంత్రం లేదని ఓ సిద్ధాంతం కూడా ఉంది. ఓ అతి పెద్ద కర్మ బంధ చట్రంలో ఉండబట్టే మనం స్వతంత్ర కర్మలని చేస్తున్నామని అంటారు. (ఎలా అంటే రావణాసురుడు ఋషులని, యజ్ఞాలు చేసే బ్రాహ్మణులను బాధించడం, ఆడవాళ్లని చెరపట్టడంలాంటి వాటిని అతను స్వతంత్ర కర్మగా చేసినా, భృగుమహర్షి శాప ఫలితంగా విష్ణుమూర్తి అతని సంహారానికి రాముడిగా పుట్టి సీత విరహాన్ని అనుభవించాల్సి ఉంది కాబట్టి, ఆ విష్ణుమూర్తి ప్రారబ్ధ కర్మ రావణాసురుడు స్వతంత్ర కర్మగా రూపొందింది అన్నది ఈ సిద్ధాంతం. ఇలా ఈ విశాల విశ్వంలోని ఇతరుల కర్మలు మనల్ని శాసించి అవి మనం స్వతంత్రంగా చేసే కర్మలుగా రూపొందాయని ఈ సిద్ధాంతం ప్రకారం చెప్పచ్చు. కానీ ఎలా చేసినా ఈ స్వతంత్ర కర్మల ఫలాన్ని రావణాసురుడిలా మనమూ అనుభవించి తీరాలి. ఏది ఏమైనప్పటికీ మనిషి ధర్మానికి వ్యతిరేకంగా ప్రవర్తించనంత కాలం జన్మపరంపరలో ఇరుక్కోడు.)

ఏది ఏమైనప్పటికీ ఎడ్గర్‌కేసి చెప్పిన విషయాలన్నీ క్రోడీకరించుకుని చూస్తే ఈ క్రిందివి బంధాలవుతాయని తెలుస్తోంది.

**1) ఇతరులని వెక్కిరించడం, హేళన చేయడం కర్మబంధమవుతుంది.**

**2) ఇతరులని ద్వేషించడం కర్మబంధంగా మారుతుంది.**

**3) ఇతరుల స్వతంత్రాన్ని హరించి మనం కోరిన రీతిలోనే వారు ప్రవర్తించాలి అని శాసించడం కర్మబంధం అవుతుంది.**

**4) ఆత్మహత్యతో సహా అన్ని రకాల హింసలు కర్మబంధం అవుతాయి.**

**5) ఓ వస్తువు, వృత్తి, మనిషి, ప్రదేశం లేదా మరి దేనిమీదైనా గల అధికాపేక్ష బంధం అవుతుంది.**

ఓం తత్సత్ సర్వం పరబ్రహ్మార్పణమస్తు . .

*"సద్గురువు కృప వల్లే ఈ అనువాదం నేను చేయగలిగానని, ఆయన కృప ఉన్నవారంతా దీన్ని చదువుతారని మాస్టర్ మారెళ్ల శ్రీరామకృష్ణగారు నాతో ఓ సందర్భములో అన్నారు. సద్గురువు కృప మనందరిమీదా వర్షించి అది మనల్ని బంధ హేతువైన కర్మలు చేయనివ్వకుండా సన్మార్గంలో పెడుతుందని ఆశిస్తూ . . . . ."*

- - - - స్వస్తి - - - - -